17-06Pg1exHMNWJQE_17-06Pg1exHMNWJQE.qxd 17/Jun/26 12:04 AM Page 1

సాహితీ గతి వాసంతోత్సవ వెలుగులు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు : fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 137 పేజీలు: 12 వెల: 6.50

## టైమ్స్ మేగజైన్ జాబితాలో క్రికెటర్ స్మృతి మంధాన



**న్యూఢిల్లీ,జూన్ 16:** భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని సొంతం చేసుకుంది. ప్రఖ్యాత టైమ్ మ్యాగజైన్ 2026 సంవత్సరానికి గాను ప్రకటించిన క్రీడారంగంలో 100 మంది అత్యంత ప్రభావశీల వ్యక్తుల జాబితాలో ఆమెకు చోటు దక్కింది.




# భారత్‌కు ఆర్థిక శక్తి ఎపి

### స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎపిదే పేటెంట్

### గ్రీన్ రాజధానిగా అమరావతి అభివృద్ధి

### అమరావతిని అడ్రస్‌గా మార్చుకోండి

### సింగపూర్ పారిశ్రామికవేత్తలకు సిఎం చంద్రబాబు పిలుపు

### సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో ప్రసంగించిన సిఎం



మంగళవారం సింగపూర్‌లో సిఐఐ పార్టనర్‌షిప్ సదస్సులో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు. హాజరైన పారిశ్రామికవేత్తలు

**విజయవాడ జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** భూమి, నీరు, మౌలిక వసతులు, అత్యుత్తమ పాలసీలతో పెట్టుబడులకు ఎపి అత్యంత అనుకూల స్థానమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఎపిదే పేటెంట్ అని, పెట్టుబడులకు ఎంతో సురక్షతమని స్పష్టం చేశారు. ఈ ఏడాది విశాఖలో తలపెట్టిన పార్టనర్షిప్ సమ్మిట్‌కు సన్నాహకంగా సింగపూర్‌లో సిఐఐ నిర్వహించిన బిజినెస్ రోడ్ షోలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ... 'సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఎపికి మంచి సంబంధాలున్నాయి. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ అంటే నాకు చాలా అభిమానం. 3 దశాబ్దాలుగా సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్‌షిప్‌నే నిర్మించాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ తయారు చేసి ఇచ్చింది. బ్లూ, గ్రీన్ రాజధానిగా ఓ అద్భుతమైన బృహత్ ప్రణాళికను సింగపూర్ రూపొందించి అందించింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసిపనిచేస్తున్నాం. పెట్టుబడులకు ఎపి అత్యుత్తమ ప్రాంతం అని స్పష్టం చేస్తున్నా. సింగపూర్ పారిశ్రామికవేత్తలు అమరావతిని, ఆంధ్రప్రదేశ్‌ను రెండోనివాసంగా ఎంచుకోవాలి' అన్నారు.

**స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు**

ఎపిలో పరిశ్రమలకు భూమి కేటాయింపు, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నాం. >>2



మంగళవారం ఫ్రాన్స్‌లోని ఎవిఎన్‌లో జి-7 సమ్మిట్ సందర్భంగా కలుసుకున్న ట్రంప్, మోడీ

# చేయిచేయి కలిపిన ట్రంప్, మోడీ

**● జి-7 సమ్మిట్‌లో ఉభయుల భేటీ ● 16 నెలల తర్వాత ఇద్దరు అధినేతలు ముఖాముఖి ● నేడు ఇద్దరి మధ్య ద్వైపాక్షిక సమావేశం**

**పారిస్, జూన్ 16:** ఫ్రాన్స్‌లోని ఎవియన్‌లో జరుగుతున్న జీ7 సదస్సు సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరియు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌లు మంగళవారం పరస్పరం కలుసుకుని మాట్లాడారు. గత 16 నెలల తర్వాత ఈ ఇద్దరునేతలు ముఖాముఖిగా సమావేశమవడం విశేషం. ఇద్దరు నేతలు చివరిసారిగా 2025 ఫిబ్రవరిలో అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని వైట్ హౌస్‌లో భేటీ అయ్యారు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం జరిగిన ఆ సమావేశం తర్వాత ఇదే తొలి ప్రత్యక్షసమావేశం. జీ7 సదస్సు >>2



మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో డి.సిఎం పవన్ సమావేశమైన దృశ్యం

# గోదావరి పుష్కరాలకు కేంద్రం సహకారం

### విబి జి రాం జి ద్వారా పుష్కర పంచాయితీల అభివృద్ధి

### మ్యాజిక్ డ్రెయిన్‌ను ప్రశంసించిన కేంద్రమంత్రి, దేశవ్యాప్త అమలుకు ఆసక్తి

### కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో డి.సిఎం పవన్ భేటీ

**విజయవాడ, జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** గోదావరి పుష్కరాల నిర్వహణ నిమిత్తం ఎంపిక చేసిన 260 మోడల్ పంచాయతీలకు విబి జి రాం జి కార్యక్రమం కింద అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక సహకారం అంది స్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ముందుకు రావడం శుభపరిణామం అని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలను నిర్వహిస్తున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మంత్రి పవన్ కల్యాణ్‌అన్నారు. విబి జి రాం జి నిధుల కేటాయింపులో రాష్ట్రానికిచ్చిన ప్రాధాన్యతకు కృతజ్ఞతలు తెలిపారు. మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, మురుగునీటి శుద్ధి తదితర కార్యక్రమాల ద్వారా కాలుష్యరహిత గ్రామాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణలో ఇది ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పారదర్శకత, జవాబుదారీతనంతో రాష్ట్ర గ్రామీణా >>2

# జులై మూడోవారంలో మెగా పిటిఎం


### 'తల్లికి వందనం' కూడా అప్పుడే..

### ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల పెంపునకు ప్రత్యేక చర్యలు

### రాష్ట్రానికి ఎన్‌సిసి స్టేట్ యూనిట్ మంజూరు

### 29న 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం

### విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



మంగళవారం విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 16, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం త్వరితగతిన అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య అధికారులతో మంత్రి లోకేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం, బడిపిలుస్తోంది, షైనింగ్ స్టార్స్, మెగా పిటిఎం, యోగాంధ్ర, టెట్ నిర్వహణ అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థుల ప్రవేశాల పెంపుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి.. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని, జులై 3వ >>2

# ఎపి రైల్వేకు 10,144 కోట్లు

### - కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

**విజయవాడ, జూన్ 16 (ప్రభాతవార్త):** దేశంలో రైల్వే రంగం విప్లవాత్మక మార్పులను చవి చూస్తోందని, వికసిత భారత్ లక్ష్య సాధనలో రైల్వేలు కీలక శక్తిగా మారాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలో సుడిగాలి పర్యటన జరిపి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి ప్రహ్లాద్ జోషి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరిలతో కలిసి విజయవాడ సమీపం లోని రాయనపాడు శాటిలైట్ రైల్వే స్టేషన్‌ను సందర్శించిస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.10,144 కోట్లను కేటాయించినట్లుఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి వెల్లడించారు. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్లు, స్టేషన్‌ల ఆధునికీకరణ, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల, సరుకు రవాణా సామర్థ్యాల పెంపు వంటి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. అమరావతిని దేశ ప్రధాన నగరాలతో అను సంధానం చేస్తామని, ఇందులో భాగంగా అమరావతికి కొత్త రైల్వే లైను మంజూరు చేసి నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. >>2



మంగళవారం ఏలూరులో మాట్లాడుతున్న మంత్రి నాదెళ్ల


# రూ. 400 కోట్లతో డయాఫ్రం వాల్

### పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి: మంత్రులు నాదెండ్ల, పార్థసారథి

**ఏలూరు, జూన్, 16 : ప్రభాతవార్త:** రైతాంగ సంక్షేమమే కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో మంగళవారం రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధితో కలిసి జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, డా. కామినేని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ప్రభృతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ దేశానికీ వెన్నుముక ఐన రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. విత్తనం నాటిన దగ్గరనుండి పండిన పంటకు గిట్టుబాటు దార కల్పించే వరకు రైతుకు అన్ని విధాలా తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వం చివరిలో 4.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, 6.30 లక్షల మంది రైతుల నుండి 9132 కోట్ల రూపాయల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయ సీజన్లో కూటమి ప్రభుత్వం 7. 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 10.27 లక్షల మంది రైతుల నుండి కొనుగోలు చేసి 17వేల 455 కోట్ల రూపాయలను రైతులకు చెల్లించామన్నారు. గత ప్రభుత్వం రైతులను మోసం చేసి 6 నెలలలకు పైగా బకాయిలు పెట్టిన ధాన్యం కొనుగోలు సొమ్ము 1674 కోట్ల రూపాయలను, నెల రోజుల్లోనే రైతుల ఖాతాలకు జమచేసి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలలోగా రైతుల ఖాతాలకు సొమ్మును జమచేస్తున్నామని మంత్రి చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు 70 శాతం పూర్తిచేస్తే, గత ప్రభుత్వం 10 శాతం కూడా పూర్తి చేయలేదని అన్నారు. వీళ్ళు నిర్వాహం వలన రూ 400 కోట్లు విలువచేసే డయాఫ్రమ్ వాల్ డామేజీ అయినను పట్టించు కోలేదని, కూటమి ప్రభుత్వం రాగానే ప్రపంచ నిపుణులను రప్పించి మరలా రూ 400 కోట్లు వెచ్చించి డయాఫ్రమ్ వాల్ ను నిర్మించామని అన్నారు. వచ్చే సంవత్సరం గోదావరి పుష్కరాలకు ముందుగానే పోలవరం పూర్తి చేస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్ల కాలంలో ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలుతో అనేక కీలక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు.

# కోట్లల్లో టోకరా



### చీరాలలో భారీ గోల్డ్ స్కాం

### ప్రజలను నట్టేట ముంచిన బంగారం వ్యాపారి

**చీరాల టౌన్, జూన్ 16, ప్రభాతవార్త:** చీరాల పట్టణంలో సంచలనం సృష్టించిన భారీ మోసం వెలుగులోకి వచ్చింది. స్థానిక బ్రహ్మంగారి చెట్టు వద్ద నగల వ్యాపారం నిర్వహిస్తున్న బిట్రా రాఘవేంద్రరావు అనే వ్యాపారి కోట్ల రూపాయల విలువైన బంగారం, నగదు సేకరించి రాత్రికి రాత్రే పరారైన ఘటన బాధితులను కన్నీటి పర్యంతం చేస్తోంది. యేళ్లుగా నమ్మకంగా వ్యాపారం చేస్తూ వచ్చిన బిట్రా రాఘవేంద్రరావు, కష్టమర్ల విశ్వసాన్ని ఆసరాగా చేసుకుని భారీ ఎత్తున డబ్బులు, బంగారం సేకరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు బంగారు నగలు తయారు చేయించుకోవడానికి తమ వద్ద ఉన్న బంగారాన్ని అప్పగించగా, మరికొందరు కొత్త నగల కోసం లక్షల రూపాయలు ముందస్తుగా చెల్లించినట్లు బాధితులు వాపోతున్నారు. అయితే 4 రోజు >>2

17-06pg2exHMNWJQE_17-06pg2exHMNWJQE.qxd 17/Jun/26 12:09 AM Page 1





మంగళవారం బ్రాటిస్లావాలో స్లోవేకియా అత్యున్నత పురస్కారం ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్‌ను ప్రధాని మోడీకి ప్రదానం చేస్తున్న స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని

## ప్రధాని మోడీకి స్లోవేకియా అత్యున్నత పురస్కారం

**బ్రాటిస్లావా, జూన్ 16:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారం వరించింది. భారత ప్రధానికి స్లోవేకియా దేశ అత్యున్నత జాతీయ పురస్కారమైన ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్ (ఫస్ట్ క్లాస్)ను ప్రదానం చేశారు. బ్రాటిస్లావాలో జరిగిన ఒక కార్యక్రమంలో స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని ఈ అవార్డును మోదీకి అందజేశారు. ప్రధాని మోదీ అందుకున్న 33వ అంతర్జాతీయ పురస్కారంఇది. ఈ గౌరవంపై ప్రధాని మోడీ స్పందిస్తూ ఈ పురస్కారం 140 కోట్ల మంది భారతీయులకు చెందిందని అన్నారు. ఈ సాయంత్రం ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్ అందుకోవడం గౌరవంగా ఉంది. ఈ గౌరవానికి స్లోవేకియా ప్రజలకు, ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. భారత్, స్లోవేకియా మధ్య శాశ్వత స్నేహానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నానని ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్ అనేది విదేశీ పౌరులకు మాత్రమే స్లోవేకియా ప్రభుత్వం అందించే అత్యున్నత పౌర, సైనిక పురస్కారం. యూరప్ పర్యటనలో భాగంగా మోడీ స్లోవేకియాలో పర్యటిస్తున్నారు. ఒక భారతప్రధాని ఈ దేశాన్ని సందర్శించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య వలసలు, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు 11ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. రెండు దేశాల మధ్య సంబంధాలను సమగ్ర భాగస్వామ్య స్థాయికి పెంచినట్టు అధికారులు తెలిపారు.

## 'నీట్' ముగిసేదాకా 'టెలిగ్రామ్'పై బ్యాన్

**న్యూఢిల్లీ,జూన్ 16:** కేంద్ర సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రాంయాప్‌ను ఇండియా బ్లాక్ చేసింది. ఈనెల 22వ తేదీ వరకు టెలిగ్రాం యాప్ అందుబాటులో ఉండదు. ఈనెల 21వ తేదీన దేశవ్యాప్తంగా నీట్ రీఎగ్జామ్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక జూన్ 30వ తేదీ వరకు టెలిగ్రాం యాప్‌లో ఉన్న మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను కూడా ప్రభుత్వం డిజైబుల్ చేసింది. ఎగ్జామ్ మెటీరియల్‌ను లీకేజీ చేయకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ చర్యలకు చేపట్టింది. మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌కు చెందిన యాప్‌ను తక్షణమే బ్లాక్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.
నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇచ్చిన మార్గదర్శకాల ఆధారంగా ఈ చర్య చేపట్టారు. కేవలం ఎగ్జామినేషన్ పీరియడ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ యాప్‌ను రద్దు చేశారు. పేపర్ లీక్ ఘటనలను తగ్గిచేందుకు ఎడిటింగ్ ఫీచర్లను డిజైబుల్ చేశారు. గతంలో పోస్టు చేసిన మెసేజ్‌లను ఎడిట్ చేసి ఆప్షన్ ప్రస్తుతం 30వ తేదీ వరకు బ్లాక్ చేశారు. పేపర్ లీకేజీలకు పాల్పడుతున్న చీటింగ్ ముఠాలు టెలిగ్రాం యాప్‌ను విరివిగా వాడుతున్నట్లు ప్రభుత్వం గుర్తిం చింది. నీట్ పరీక్షరాస్తున్న అభ్యర్థులను ఆ చీటింగ్ ముఠా టార్గెట్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. పేపర్ లీకేలకు చెందిన అనేక ఛానళ్లను, గ్రూపులను ఇప్పటికే ప్రభుత్వం తొలగించింది.

## కోట్లల్లో టోకరా

\>> లుగా వ్యాపారి కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన కస్టమర్లు అతని ఇంటికి వెళ్లగా, ఇంటిని పూర్తిగా ఖాళీ చేసి కుటుంబంతో సహా పరారైనట్లుగుర్తించారు. దీంతో ఒక్క సారిగా మోసపోయినట్లు గ్రహించిన బాధితులు షాక్‌కు గురయ్యారు. బాధితుల కథనాల ప్రకారం, ఈ వ్యవహారం ముందస్తు ప్రణాళికతోనే జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నమ్మకాన్ని పెట్టుబడిగా మార్చుకున్న వ్యాపారి, కస్టమర్ల కళ్లల్లో కారం చల్లి కోట్ల రూపాయల విలువైన బంగారం, నగదుతో ఉడాయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బాధితులు ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయిస్తూ ఫిర్యాదులు నమోదు చేస్తున్నారు. మోసపోయిన వారిసంఖ్య, నష్టపోయిన మొత్తం రోజు రోజుకు పెరుగుతున్నట్లు సమాచారం. కొందరు జీవితకాల పొదుపులను కోల్పోగా, మరికొందరు పెళ్లిళ్లు, శుభకార్యాల కోసం దాచుకున్న బంగారాన్ని అప్పగించి ఇప్పుడు ఆందోళనలో మునిగిపోయారు. బాధితులు ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, పారారీలో ఉన్న వ్యాపారిని వెంటనే అరెస్టు చేసి తమ సొమ్ము, బంగారం తిరిగి ఇప్పించాలని ప్రభుత్వాన్ని, పోలీసు అధికారులను వేడుకుంటున్నారు.

## ఎపి రైల్వేకు 10,144 కోట్లు

\>> కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తూ రైల్వే మౌలిక వసతులను దేశవ్యాప్తంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గత 12 సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం 1.05 లక్షల కిలోమీటర్లకు పైగా రైల్వే నెట్‌వర్క్ఉందని, దీనిని పూర్తిస్థాయిలో విద్యుదీకరించే కార్యక్రమం వేగంగాసాగుతోందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. విద్యుదీకరణ చేపట్టకపోతే దేశం లక్షల కోట్ల లీటర్ల డీజిల్ దిగుమతులపై ఆధారపడాల్సి వచ్చేదని తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచుతూ సౌరశక్తిని సమర్థవంతంగా వినియోగించడంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు.

## నీట్ రాసే విద్యార్థిని,విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

**విజయవాడ, జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** జూన్ 21న దేశవ్యాప్తంగా జరగబోయే నీట్ రీఎగ్జామినేషన్ జరగబోతోంది. ఈ నేపథ్యంలో ఈ పరీక్ష రాస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎగ్జామ్ సెంటర్ల దూరభారం, ప్రయాణ ఖర్చులతో టెన్షన్ పడుతున్న విద్యార్థులకు ఊరటనిస్తూ ఎపిఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తూ కీలక నిర్ణయం తీసు కుంది. నీట్ పరీక్షకు వెళ్లే విద్యార్థులకు టికెట్ ఫ్రీ సౌకర్యం కల్పించింది.హాల్ టికెట్ ఉంటేచాలు బస్సులో ఉచితంగా వెళ్ళ వచ్చు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు బస్సు కండక్టర్‌కు తమ నీట్ హాల్ టికెట్ చూపిస్తే సరిపోతుంది. రద్దీ రూట్లలో స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసింది.

# భారత్‌కు ఆర్థిక శక్తి ఎపి

\>> ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ అయిన ఆర్సెలార్ మిట్టల్‌కు అనతికాలంలోనే అన్ని అనుమతులు వేగంగా ఇచ్చాం. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి ఎపి నుంచి ఎగుమతులు చేస్తుంది. గూగుల్ క్లౌడ్ ఎఐ డేటా హబ్ కూడా ఏర్పాటు అవుతోంది. ఆ సంస్థకు గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించాం. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నాం. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయి. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభించనుంది. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్సిటీనీ కూడా ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తృతి పెరిగింది. దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయి. ఏపీలోనూ అదే తరహాలో డేటా డ్రివెన్ నిర్ణయాలను తీసుకుని పౌరసేవల్ని అందిస్తున్నామని అన్నారు.

**గ్లోబల్ నగరాలకు ఎపి కనెక్టివిటీ**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఒక్కరినీ వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానం తెచ్చాం. అలాగే ఎంఎస్ఎంఈ సహా వివిధ పరిశ్రమల్లో తయారయ్యే ఉత్పత్తుల నాణ్యతపై కూడా దృష్టి పెట్టాం. రియల్ టైమ్ గవర్నెన్సు ద్వారా ఎక్కడా జాప్యం లేకుండా అనుమతులు వేగంగా వచ్చేలా చూస్తున్నాం. ఏపీకి ఉన్న వెయ్యి కిలోమీటర్లకు పైగా తీర ప్రాంతంలో 6 ఆపరేషనల్ పోర్టులు ఉన్నాయి. ఈ పోర్టులను దేశంలోని వివిధ ప్రాంతాలకు, విదేశీ పోర్టులకు కనెక్టు చేసేలా ప్రయత్నాలు చేస్తున్నాం. 7 ఆపరేషనల్ ఎయిర్ పోర్టులు ఎపిలో ఉన్నాయి. భోగాపురం లాంటి అంతర్జాతీయ విమానాశ్రయంతో గ్లోబల్ నగరాలకు కనెక్టివిటీ ఏర్పడుతుంది. లాజిస్టిక్స్, అగ్రికల్చర్, సివిల్ ఏవియేషన్, ఎనర్జీ లాంటి వివిధ అంశాల్లో ఫంక్షనల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నాం. ఎపిలో ఉన్న పోర్టులను దేశంలోని ఇతర ప్రాంతాలు అనుసంధానించేలా రహదారి, రైల్ నెట్వర్క్‌ను కూడా పెద్ద ఎత్తున నిర్మిస్తున్నాం. ఎలక్ట్రానిక్స్, స్పేస్, ఏరోస్పేస్, డ్రోన్, డిఫెన్స్ క్లస్టర్లతో పాటు రాష్ట్రంలోని 175 చోట్ల నియోజకవర్గ ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఈ పారిశ్రామిక పార్కులకు నీరు, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. రాయలసీమలోని పుట్టపర్తి వద్ద 5వ తరం ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ కూడా వస్తోంది. ఇవిల వినియోగం పెంచటం ద్వారా కాలుష్యాన్ని తగ్గించేలా ప్రయత్నాలు చేస్తున్నాం అని ముఖ్యమంత్రి అన్నారు.

**నాలెడ్జ్ హబ్‌గా అమరావతి**

అమరావతిని ఎడ్యుకేషన్, నాలెడ్జ్ హబ్‌గా తయారు చేయటంతో పాటు దేశంలోని ప్రధాన నగరాలను కనెక్ట్ చేస్తాం. హైస్పీడ్ రైల్ నెట్వర్క్ కూడా అమరావతిని హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలను కనెక్టు చేస్తుంది. అమరావతిలోనే ఐబిఎం, టిసిఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికల్లా క్వాంటం అమరావతిలో కంప్యూటర్ పనిచేయటం ప్రారంభిస్తుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఆవిష్కరణల్ని, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నాం. ప్రాజెక్టులు పెట్టే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మా ప్రభుత్వం సహకారం అందిస్తుంది. త్వరలోనే విశాఖ సమీపంలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. ఎపిలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు కూడా ఉన్నాయి. దేవాలయాలు, పర్యాటక, బుద్ధిస్ట్ సర్క్యూట్‌లు ఉన్నాయి. అక్వా, వ్యవసాయం, హార్టికల్చర్‌లో ఎపి అగ్రస్థానంలో ఉంది. పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు అవకాశం ఉంది. పెద్దఎత్తున ప్రకృతి సేద్యం ద్వారా వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను పండిస్తున్నాం. ఎపికి వచ్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను పరీక్షించి అప్పుడు పెట్టుబడులు పెట్టాలని పిలుపునిస్తున్నాను. పెట్టుబడులు పెట్టడానికి ఇది సువర్ణ అవకాశం. ఇండియా గ్రోత్ స్టోరీలో భాగస్వాములు కావాలని కోరుతున్నాన్న అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రి పి.నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఇడిబి సిఇఒ షన్మోహన్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా పోలీసు క్రీడల్లో ఎపి పోలీసులకు పతకాల పంట

### వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్, బ్యాడ్మింటన్ క్లస్టర్, పోలీస్ డ్యూటీ మీట్, జూడో క్లస్టర్లో పతకాలు

**విజయవాడ, జూన్ 16, ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీసు క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసు క్రీడాకారులు విశేష ప్రతిభ కనబర్చి రాష్ట్ర ఖ్యాతిని మరోసారి దేశవ్యాప్తంగా చాటారు. బ్యాడ్మింటన్ క్లస్టర్, వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్, జూడో క్లస్టర్, పోలీస్ డ్యూటీ మీట్‌లో మొత్తం 39 పతకాలు సాధించి పోలీసు శాఖకు గర్వకారణంగా నిలిచారు.

**పోలీసు వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్ 2026- 27:** హర్యానా పోలీసు ఆధ్వర్యంలో హర్యానా రాష్ట్రం మధుబన్‌లో మే 23 నుంచి 27 వరకు నిర్వహించిన 3వ ఆల్ ఇండియా పోలీసు వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్202627 (యోగ, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్) పోటీల్లో ఏపీ పోలీసు క్రీడాకారులు 4 స్వర్ణ, 12 రజత, 1 కాంస్య పతకంతో మొత్తం 17 పతకాలు సాధించి సత్తా చాటారు. పైన సాధించిన పతకాలన్నీ యోగా విభాగంలో లబించాయి,

**పోలీసు బ్యాడ్మింటన్ క్లస్టర్2025- 26:** ఉత్తరప్రదేశ్ పోలీసు ఆధ్వర్యంలో లక్నోలో మే నెల 9 నుంచి 13 వరకు నిర్వహించిన 2వ ఆల్ ఇండియా పోలీసు బ్యాడ్మింటన్ క్లస్టర్2025- 26 (బాడ్మింటన్ + టేబుల్ టెన్నిస్) పోటీల్లో ఏపీ పోలీసు జట్టు 2 స్వర్ణ, 2 రజత, 6 కాంస్య పతకాలతో మొత్తం 10 పతకాలు కైవసం చేసుకుంది. (టేబుల్ టెన్నిస్ లో 4 కాంస్య పతకాలు... బ్యాడ్మింటన్ లో రెండు బంగారు, రెండు రజిత, రెండు కాంస్య పతకాలను మొత్తం 10 పతకాలు) దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న ప్రతిభావంతులైన క్రీడాకారుల మధ్య జరిగిన ఈ పోటీల్లో ఎపి జట్టు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి పతకాలను సాధించింది. జాతీయ స్థాయి పోలీసు డ్యూటీ మీట్ 2025 –26.... మార్చి 29, 2026 నుండి ఏప్రిల్ 3, 2026 వరకు నాగపూర్ లో జరిగిన జాతీయస్థాయి పోలీసు డ్యూటీ మీట్ లో 4 రజిత పతకాలు సాధించారు.

**జూడో క్లస్టర్ 2025- 26:** అక్టోబర్ 8, 2025 నుంచి 16 అక్టోబర్ 2025 వరకు జమ్మూ కాశ్మీర్ లో జరిగిన జూడో క్లస్టర్ లో (తైక్వాండో, కరాటే, పెన్కాక్సిలాట్) 2 బంగారు, 2 రజిత, 4 కాంస్య పతకాలను సాధించి ఏపీ పోలీసులు రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు ఈ విజయాల నేపథ్యంలో పతక విజేతలు మంగళవారం మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా క్రీడాకారులను అభినందించారు. జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ పోలీసు ప్రతిష్ఠను ఇనుమడింపజేసినందుకు ప్రశంసించారు.క్రీడా స్ఫూర్తితో భవిష్యత్తులో జరిగే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఎపిపిఇసెట్ 2026 ఫలితాలు విడుదల

**విజయవాడ,జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎపిపిఇసెట్2026) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఫలితాలను మంగళవారం ప్రకటించారు. ఈ ఏడాది పిఇసెట్‌లో మొత్తం 89.76 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన తెలిపారు.ఫలితాల వివరాల్లోకి వెళితే, పిఇసెట్2026 కోసం మొత్తం 4,037 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 2,958 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 2,655 మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో పురుషులు అధికంగా ఉన్నారు. పరీక్షకు హాజరైన పురుషుల్లో 92.91 శాతం (1,993 మంది) ఉత్తీర్ణులు కాగా, మహిళల్లో 81.43 శాతం (662 మంది) ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, ఫిజికల్ ఎడ్యుకేషన్, క్రీడల రంగంలో కెరీర్‌ను ఎంచుకునే దిశగా ముందడుగు వేసిన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. వారి భవిష్యత్ ప్రయత్నాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ర్యాంక్ కార్డులను కూడా ఇదే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదనంగా, 'మన మిత్ర' వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలను తెలుసుకునే సౌకర్యాన్ని కల్పించారు.

## బాలల సంక్షేమం, ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి

### ఎపిఎస్సిపిసిఆర్ చైర్‌పర్సన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్ 16,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కులపరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించి అమలాపురంలోని పలు ప్రభుత్వ, సంక్షేమ, ఆరోగ్య సంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి, స్కానింగ్ కేంద్రాలు, శిశు గృహం, వన్ స్టాప్ సెంటర్, ఆనంద నిలయం ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌లలో అందుతున్న సేవలను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాలలు, మహిళలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు బాలల హక్కుల పరిరక్షణ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

## రొయ్యల ఫీడ్ ధరల పెంపును నిలిపివేసిన కూటమి ప్రభుత్వం

**విజయవాడ,జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం రొయ్యల ఫీడ్ ధరల పెంపును నిలిపివేసింది. ఫీడ్ ధరల నియంత్రణకు ప్రత్యేక రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ సిఫార్సు మేరకు ఇకపై ఫీడ్ ధరల నిర్ణయం ఉంటుందన్నారు. జోన్, నాన్‌జోన్, 10 ఎకరాల పరిమితి నిబంధనలు తొలగించినట్లు వివరించారు. రైతులు, ఫీడ్ తయారీదారులతో 6 గంటలపాటు సుదీర్ఘ సమావేశం నిర్వహించగా, రొయ్యల ఫీడ్‌ధరలు పెంచితే ఊరుకోబోమని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సోయాబీన్, ఫిష్ ఆయిల్ ధరలు పెరిగిన మాట వాస్తవమే అయినప్పటికీ ముడి పదార్థాల ధరల భారం రైతులపై మోపడానికి వీల్లేదన్నారు.

## వారం - వర్జ్యం

17-06-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
తదియ రా.9.43, పునర్వసు మ.1.41,
వర్జ్యం : రా.2.58–తె.4.24,
దు. ఉ.8.11–ఉ.9.03, 2)రా.11.56–రా.12.48
శుభసమయం : ఉ.7.00–8.00
రాహుకాలం – మ.12.00–1.30

## వార్తాఫలం

**మేషం:** యోగక్షేమాల పట్ల అధిక శ్రద్ధ కనబరుస్తారు. తద్వారా లాభపడతారు. ప్రయాణాలు లభిస్తాయి. వస్త్రాలు కొనుగోలు.

**వృషభం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు.

**మిథునం:** పొదుపు పథకాలలో వైఫల్యం చెందకుండా జాగ్రత్తలు పాటించండి. అప్రయత్నంగా కార్యక్రమాలు పూర్తికాగలవు.

**కర్కాటకం :** చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దూరప్రాంతాల నుండి శుభ వర్తమానాలు అందుకుంటారు.

**సింహం:** నిర్మాణాత్మక, వ్యూహాత్మక విషయ వ్యవహారాలలో ఆచి తూచి నిర్ణయాలు తీసుకొండి.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కన్య :** ఏదయినా ఒక అద్భుత కార్యక్రమం చేసి నలుగురిలో అఖండ ఖ్యాతిని ఆర్జించాలనే కోరిక బలపడుతుంది.

**తుల :** కళారంగాల వారికి సన్మాన, సత్కారాలు పొందుతారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఆస్తి లాభం.

**వృశ్చికం:** సంతానం పేరు మీద స్థిరాస్తులు బదిలీ చేయడం లేక కొనుగోలు చేయడం జరుగుతుంది.విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**ధనుస్సు:** కార్యాలయంలో మీ ప్రతిపాదనలను అందరూ ఏకగ్రీవం ఆమోదిస్తారు. శ్రమ తగిన ప్రతిఫలాలు అందుకుంటారు.

**మకరం:** ఈ రోజు తనఖాలో ఉన్న వస్తువులను విడిపించుకుంటారు. ఆర్థికంగా ఎటువంటి ఒడిదుడుకులు ఉండవు.

**కుంభం:** ఆహారపు అలవాట్లలో కొద్దిపాటి మార్పు చేస్తారు. అహంభావం ధోరణి విడనాడడం వలన లాభపడతారు.

**మీనం :** కృత్రిమముగా, ప్రభుత్వ సంబంధమైన ఇబ్బందులు రావచ్చును. శుభవార్తలు అందుకుంటారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




మంగళవారం సింగపూర్‌లో సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో సాంకేతిక పరికరాలను తిలకిస్తున్న సిఎం చంద్రబాబు

## మూడోవారంలో మెగా పిటిఎం

\>> వారంలో పథకం అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు. జూన్ 29న షైనింగ్ స్టార్స్ కార్యక్రమం, జులై మూడో వారంలో మెగా పీటీఎం నిర్వహణకు సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల పని సర్దుబాటుపైనా సమావేశంలో చర్చించారు.

**ఉన్నత విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష**

రాష్ట్రంలో ఎప్ సెట్, పాలిసెట్, ఆర్ సెట్ వంటి 12రకాల కామన్ ఎంట్రన్స్ టెస్టులకు ఎటువంటి జాప్యం లేకుండా సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత సమయంలో అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే సెట్స్, పొరుగు రాష్ట్రాల కామన్ ఎంట్రన్స్ టెస్టుల తేదీలను కూడా గమనంలోకి తీసుకొని విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా రాష్ట్రంలోని వివిధ సెట్‌ల తేదీలను ఖరారు చేయాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో మెకానికల్, సివిల్ విభాగాల సీట్లకు డిమాండ్ ఉందని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్‌కు సంబంధించి 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88లక్షల సీట్ల భర్తీకిగాను ఎప్ సెట్ నోటిఫికేషన్‌కు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో యూనివర్సిటీల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్న థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్‌కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ, మేధావి స్కిల్ యూనివర్సిటీ, జెఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలతో చర్చల పురోగతిపై మంత్రి సమీక్షి ంచారు. జిఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటును వేగవంతం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్‌సిసి కార్యకలాపాలు, శిక్షణ, క్యాంపులు సమన్వయం చేయడానికి ఎన్‌సిసి స్టేట్ డైరెక్టరేట్‌ను మంజూరు చేసిన కేంద్రప్రభుత్వానికి మంత్రి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. దేశంలో ఎన్‌సిసి వ్యవస్థను బలోపేతం చేయడానికి, ఆంధ్రప్రదేశ్ యువతకు మరింత సైనిక శిక్షణ, ప్రోత్సాహం అందించడానికి ఈ ప్రత్యేక కేంద్రం ఉపకరించగలదని అన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె.శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్య కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాలకు కేంద్రం సహకారం

\>> భివృద్ధి శాఖలో అమలు చేస్తున్న కార్యక్రమాలను పవన్ కల్యాణ్ కేంద్ర మంత్రివర్యులకు వివరించారు. అనంతరం మీడియాతో పవన్ మాట్లాడుతూ 'విబి జి రాం జి కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్‌కు దేశంలో మూడవ అత్యధిక నిధుల కేటాయింపు కేంద్ర ప్రభుత్వ సహకారానికి నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ అన్ని విధాల అభివృద్ధి చెందడానికి గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చూపుతున్న చొరవ ఎనలేనిది. రాష్ట్రానికి అత్యధిక నిధులు కేటాయించడంలో తమ వంతు సహాయ సహకారాలు అందించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రితో సమావేశం అయ్యి రాష్ట్రం తరఫున కృతజ్ఞతలు తెలియజేశాం. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, జీవనోపాధి అకాశాలు మెరుగుపర్చేందుకు, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయి. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కేంద్ర మంత్రివర్యులతో సుదీర్ఘంగా చర్చించాం. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి రంగంలో ఆంధ్రప్రదేశ్ సాధించిన విజయాలను శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతుగా అమలు చేయడంలో రాష్ట్రం చూపుతున్న నిబద్ధతను కేంద్ర మంత్రి అభినందించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు, సోషల్ ఆడిట్ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడం తదితర అంశాల్లో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలిచింది. ఈ విజయాల కారణంగానే 2026 జూలై 1న నిర్వహించనున్నవిబి జి రాం జి ప్రారంభోత్సవ కార్యక్రమానికి, జాతీయ గ్రామ వికాస్ సమ్మేళనం నిర్వహణకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో వేసవి కాలంలో పశువులకు తాగునీటి కొరత తలెత్తకుండా చేపట్టిన నీటి తొట్టెల నిర్మాణాన్ని కేంద్ర మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు.
పెదపెంకి గ్రామంలో అమలు చేసిన మ్యాజిక్ డ్రెయిన్స్ కార్యక్రమం విజయవంతం అయిన విషయాన్ని వివరించాం. ఈ కార్యక్రమం ద్వారా పారిశుధ్యం, గ్రామీణ జీవన ప్రమాణాల మెరుగుదలలో సాధించిన ఫలితాల పట్ల కేంద్రవర్యులు ఆకర్షితులయ్యారు. ఈ నమూనాను మధ్యప్రదేశ్ లోని తన పార్లమెంటరీ నియోజకవర్గంలో అమలు చేయడానికి ఆసక్తిని వ్యక్తం చేశారు. గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం సిద్ధం చేస్తున్న 260 మోడల్ పంచాయతీల అభివృద్ధికి విబి జి రాం జి కార్యక్రమం కింద ప్రత్యేక సహకారం అందించాలని కోరగా చౌహాన్ సుముఖత వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధికి నిరంతర ప్రోత్సాహం అందిస్తున్న శివరాజ్ సింగ్ చౌహాన్ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. కేంద్ర సంకల్పంతో గ్రామీణ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.
గ్రామీణాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ సాధించిన విజయాలను కేంద్ర మంత్రి శివ రాజ్ సింగ్ చౌహాన్ ప్రస్తావించి ప్రత్యేక అభినందించినట్టు తెలిపారు. జులై 1న కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం వికసిత్ భారత్ – గ్రామ గౌరవ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వేదికగా మొదలు పెట్టాలని కేంద్రం నిర్ణయించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని అన్నారు.

## కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో పవన్ భేటీ



**విజయవాడ, జూన్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. మంగళవారం ఆయన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని మంచినీటి ఎద్దడి, కలుషితమవుతున్న నదుల పరిరక్షణ, జల్ జీవన్ మిషన్ అమలు వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఎపిలోని కొన్ని ప్రాంతాల్లో ఇంకా నీటి కొరత తీరలేదని పవన్ కల్యాణ్ కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ భేటీ విశేషాలను పవన్ కల్యాణ్ "ఎక్స్" వేదికగా వెల్లడించారు.
ఈ సందర్భంగా ఆయన ప్రజలకు స్థిరమైన మంచినీటి సరఫరా అందించడానికి గుజరాత్‌లోని సూరత్ నమూనాను అధ్యయనం చేయాలని అధికారులకు పవన్ సూచించారు. సూరత్‌లో పారిశ్రామిక వ్యర్థ జలాలను శుద్ధి చేసి మళ్లీ ఎలా విజయవంతంగా వినియోగిస్తున్నారో, అదే విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు.గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో నదీ జలాల స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పవన్ స్పష్టం చేశారు. పారిశ్రామిక కాలుష్యం వల్ల ఎపిలోని నదులు, జలవనరులు దారుణంగా దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలు వదిలే వ్యర్థాల వల్ల నదులు కలుషితం కాకుండా జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

## చేయిచేయి కలిపిన ట్రంప్, మోడీ

\>> వేదికపై ఒకరినొకరు పలకరించుకున్న మోడీ, ట్రంప్ కొద్దిసేపు చర్చించారు. సదస్సు సందర్భంగా బుధవారం ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సమావేశం జరగనున్నట్లు సమాచారం. జీ7 సదస్సులో పాల్గొనేందుకు ఫ్రాన్స్ చేరుకున్న ప్రధాని మోడీ, ప్రపంచ నాయకులతో కీలక అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలు పంచుకోవాలని ఎదురుచూస్తున్నానని తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్‌మీడియా వేదికగా సందేశం విడుదల చేశారు. ట్రంప్ ప్రభుత్వం భారతదేశంపై అదనపు సుంకాలు విధించడం, 2025 మే నెలలో భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన సైనిక ఉద్రిక్తతలను తగ్గించడంలో తన పాత్ర ఉందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో ఇరుదేశాల సంబంధాల్లో కొంత ఉద్రిక్తత నెలకొంది.అయితే గత నెలలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత పర్యటన అనంతరం ఇరుదేశాలు సంబంధాల పునరుద్ధరణ దిశగా చర్యలు ప్రారంభించాయి. ఒమాన్ తీరంలో జరిగిన అమెరికా దాడుల్లో ముగ్గురు భారత నావికులు మరణించిన ఘటన తర్వాత కూడా ఇరుదేశాల మధ్య చర్చలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో రుబియో, ప్రధాని మోడీతో సమావేశమై అధ్యక్షుడు ట్రంప్ తరఫున త్వరలో వైట్ హౌస్‌ను సందర్శించాలని ఆహ్వానించారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో అమెరికా వ్యూహానికి భారత్ కీలక స్తంభమని రుబియో పేర్కొన్నారు.ఇతర ప్రపంచ నేతలతోనూ సమావేశాలుజీ7 సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ పలు దేశాల అధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, భద్రత, వాణిజ్యం, ఇంధన సరఫరాలు తదితర కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి.

17-6Pg3exHMNWJQER_17-6Pg3exHMNWJQER.qxd 17/Jun/26 12:11 AM Page 1



# ప్రపంచ స్థాయి క్రీడా హబ్‌గా ఆంధ్రప్రదేశ్

**• మంత్రి నారా లోకేష్ • దక్షిణాఫ్రికా లెజెండరీ క్రికెటర్ జాంటీ రోడ్స్ మంత్రితో ప్రత్యేకంగా భేటీ**



దక్షిణాఫ్రికా లెజెండరీ క్రికెటర్ జాంటీ రోడ్స్ మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువతను క్రీడల వైపు ప్రోత్స హించేందుకు కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళిక తో ముందుకు వెళ్తోందని రాష్ట్ర విద్యా, ఐటీ, యువజన సర్వీసుల శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేసారు. ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు వడివడిగా అడుగులు వేస్తోందని వివరించారు. రాష్ట్ర విద్యా, ఐటీ, యువజన సర్వీసుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఒక కీలక సమావేశం నిర్వహించారు. ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఫీల్డర్‌గా చెరగని ముద్రవేసిన దక్షిణాఫ్రికా లెజెండరీ క్రికెటర్ జాంటీ రోడ్స్ మంత్రి నారా లోకేశ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మంత్రి నారా లోకేశ్‌ను జాంటీ రోడ్స్ మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిద్దరి మధ్య సమావేశం చాలా ఆత్మీయ వాతావరణంలో సాగింది. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధిపై ఇరువురు తమ ఆలోచనలను పంచుకున్నారు. యువతను క్రీడల వైపు ఏ విధంగా ప్రోత్స హించాలన్న దానిపై సుదీర్ఘంగా చర్చించారు. క్రీడా రంగంలో అద్భుతాలు సృష్టించడం ఎలాగో లోతుగా విశ్లేషించారు. క్రీడల ద్వారా యువతలో సానుకూల దృక్పథాన్ని పెంచే మార్గాలను అన్వేషించారు. ఈ భేటీ అనంతరం మంత్రి నారా లోకేశ్, జాంటీ రోడ్స్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్‌ను కలవడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. క్రికెట్‌లో ఫీల్డింగ్ అంటేనే ప్రపంచవ్యాప్తంగా ముందుగా జాంటీ రోడ్స్ గుర్తుకు వస్తారని కొనియాడారు. ఆయన ఆటపట్ల చూపించే అభిరుచి ఎంతో అద్భుతమని లోకేశ్ అన్నారు.

జాంటీ రోడ్స్ క్రమశిక్షణ ఎందరికో ఆదర్శం అని ఆయన కితాబిచ్చారు. ఎప్పుడూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలనే తపన జాంటీ రోడ్స్‌లో కనిపిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది యువ క్రీడాకారులకు ఆయన నిజమైన స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. రాష్ట్రంలో భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దాలని లోకేశ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం ప్రపంచంలోనే అత్యుత్తమ పద్ధతులను రాష్ట్రంలో అమలు చేయనున్నారు. అంతర్జాతీయ క్రీడా ప్రమాణాలను కూడా తీసుకురానున్నారు. ప్రపంచ స్థాయి శిక్షకులతో మన రాష్ట్ర క్రీడాకారులకు శిక్షణ ఇప్పించనున్నారు. ఈ దిశగా జాంటీ రోడ్స్ లాంటి దిగ్గజాల సలహాలు, సూచనలు ఎంతగానో ఉప యోగపడనున్నాయి. ఆధునిక సాంకేతికతను జోడించి క్రీడాకారుల నైపుణ్యాలను మెరుగు పరచనున్నారు.

# సిబిఎన్ 361 డిగ్రీస్ పుస్తకం ఆవిష్కరణ

**• దార్శనిక నేతగా చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలను విశ్లేషిస్తూ పుస్తకం**



**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** సిబిఎన్ ఏట్‌దా రేట్ ఆఫ్ 361 డిగ్రీస్.. పాలీమ్యాథ్ పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్‌లో ఆవిష్కరించారు. కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. పుస్తకం తొలి ప్రతులను సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులకు అందించారు. ఈ పుస్తకాన్ని సీనియర్ పాత్రికేయుడు శాఖమూరు శ్రీనివాస ప్రసాద్ రచించారు. దీనిని విశ్రాంత ఐఎఎస్ అధికారి కేవీ సత్యనారాయణ ఆంగ్లంలో అనువదించారు. దార్శనిక నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ సందర్భాల్లో తీసుకున్న నిర్ణయాలను విశ్లేషిస్తూ ఈ పుస్తకాన్ని రచించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పాలకులుగా గుర్తింపు ఉన్న సింగపూర్, న్యూజిల్యాండ్ మాజీ ప్రధానులు లీ క్వాన్ యూ, జేసిందా ఆర్నాడ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ నేతల తరహాలోనే సిఎం చంద్రబాబు నిర్ణయాలు తీసుకొంటున్నారని, ఎపి అభివృద్ధికి విజన్‌ల రూపకల్పనతో పాటు అమరావతి రాజధాని నిర్మాణంలో తీసుకుంటోన్న శ్రద్ధ దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని రచయిత శాఖమూరు శ్రీనివాస ప్రసాద్ వివరించారు. ఎపి రెరా మాజీ చైర్మన్ రామనాథ్ వివిధ సందర్భాల్లో వ్యక్తపరిచిన అభిప్రాయాల్లో బాహ్య ప్రపంచానికి తెలియని అంశాలను సిబిఎన్ 361 డిగ్రీస్ పుస్తకంలో ఆవిష్కరించినట్టు తెలిపారు. సింగపూర్ రూపకర్త లీ క్వాన్ యూ శతజయంతిని పురస్కరించుకుని విడుదల చేసిన వెండి నాణేన్ని సిఎం చంద్రబాబుకు అసోసియేషన్ ప్రతినిధులు బహూకరించారు. త్వరలోనే ఈ పుస్తకం తెలుగు, హిందీ సహా వివిధ భారతీయ భాషల్లో విడుదల చేయనున్నట్టు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. గతంలో వెలువడిన చంద్రబాబు ఎక్స్.0 పుస్తకం సాఫ్ట్ కాపీ 8 మిలియన్ల మేర డౌన్‌లోడ్ అయ్యిందని తెలిపారు. ఈ పుస్తకంలో పొందుపరచిన అంశాలు రాజకీయ పరిశోధకులు, నాయకత్వ లక్షణాలపై అధ్యయనం చేస్తున్న వారికి, మేనేజ్మెంట్ విద్య అభ్యసించే వారికి ఉపయుక్తంగా ఉందని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో రెరా మాజీ చైర్మన్ రామనాథ్, కెవి సత్యనారాయణ, శంకరప్రసాద్, సింగపూర్‌లోని తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.

# కూటమి విజయాలను ప్రతి గడపకు చేర్చాల్సిన బాధ్యత టిడిపి కేడర్ దే

**• మంత్రి నుంచి బూత్ స్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరూ జనంలోకి వెళ్లాల్సిందే**

**• ఈనెల 25నుంచి ఆగస్టు 10వరకు ప్రతిగడపకు వెళ్లి చేసిన మంచిని చెబుదాం**

**• సర్ ప్రక్రియలో ఒక్క ఓటు కూడా పోకుండా చూడాల్సిన బాధ్యత నాయకులదే**

**• టిడిపి ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో యువనేత లోకేష్ వీడియో కాన్ఫరెన్స్**

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలపై ప్రతిగడపకు వెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత పార్టీ కేడర్‌పై ఉందని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం కేంద్ర కార్యాలయం నుంచి టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో లోకేష్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఈనెల 25నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు 45రోజులపాటు ఎంపీ, ఎమ్మెల్యేల నుంచి బూత్ స్థాయి వరకు నాయకులంతా రాష్ట్రంలోని ప్రతిగడపకు వెళ్లి చేసిన మంచిని చెప్పాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వం చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేలా ప్రతి ఇంటికి కరపత్రాలు, బుక్ లెట్లు అందించాలన్నారు. కూటమిలోని జనసేన, బీజేపీ కేడర్ ను కలుపుకొని వెళ్లి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఇది అధినేత చంద్రబాబు ఆదేశంగా ఆయన చెప్పారు. చంద్రబాబునాయుడు అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్, దీంతోపాటు గత రెండేళ్లలో పెద్దఎత్తున చేపట్టిన సంక్షేమాన్ని జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కేడర్‌పై ఉందన్నారు. తల్లికి వందనం, దీపం 2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలండర్లు, దేశంలో మరేరాష్ట్రంలో లేనివిధంగా రూ.4 వేల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, ఆటో డ్రైవర్ల సేవలో, అన్నదాత సుఖీభవ వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామన్నారు. చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతే మనం చేసిన కష్టం బూడిదలో పోసిన పన్నీరుగానే మిగిలిపోతుందని తెలిపారు.

2014-19 నడుమ చేసిన మంచిపనులను చెప్పుకోలేక పోవడం, ప్రత్యర్థుల విషప్రచారం వల్లే ఓటమి పాలయ్యామని లోకేష్ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ప్రతిగడపకు వెళతామని తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో విజయోత్సవ సభలు నిర్వహించి కూటమి ప్రభుత్వ విజయాలపై ప్రజలను జాగృతం చేయాలన్నారు.

ఇప్పటికే ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై ప్రతి కార్యకర్త అప్రమత్తంగా వ్యవహరించాలి, దీనిపై ఇప్పటికే కేడర్‌కు శిక్షణా తరగతులు నిర్వహించడంతోపాటు బీఎల్ఏలను కూడా నియమించామని తెలిపారు. ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత నాయకులదేనని స్పష్టం చేశారు. శాసనసభ్యులు బీఎల్ఏలతో టచ్‌లో ఉండి, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలి, ఎక్కడైనా సమస్య తీవ్రంగా ఉంటే పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఓటర్ వెరిఫికేషన్ సెల్‌ను సంప్రదించాలని లోకేష్ చెప్పారు.



ప్రజా దర్బారులో నేరుగా అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేష్

# ప్రజల అర్జీలన్నీ పరిష్కరిస్తాం

**• ఎపి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్**

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** అర్జీలు స్వీకరించి, హామీలతో సరిపెట్టే తత్వం కూటమి ప్రభుత్వానికి లేదని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. స్వీకరించిన ప్రతి అర్జీని పరిశీలిస్తామన్నారు. వాటిని వెనువెంటనే పరిష్కరించే దిశలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి లోకేష్ 90వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. పల్నాడు జిల్లాకు అత్యంత ముఖ్యమైన వరికపూడిశెల ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వరికపూడిశెల జలసాధన సమితి ప్రతినిధులు మంత్రి లోకేష్‌కి విజ్ఞప్తి చేశారు. బుద్ధ యోగా ఫౌండేషన్ ద్వారా మోసపోయిన 1056 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్స్‌కు తగిన న్యాయం చేయాలని బాధితులు కోరారు. మూడేళ్లుగా తాము చేసిన సేవలను గుర్తించి తగిన న్యాయం చేయడంతో పాటు భవిష్యత్‌లో కూడా ఈ సేవలు ప్రభుత్వ పర్యవేక్షణలో కొనసాగించేలా చొరవ చూపాలని అభ్యర్థించారు. జంగారెడ్డిగూడెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో జరిగిన గోల్డ్‌లోన్ అవతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని బాధితులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. తాము కుదవ పెట్టిన బంగారం వస్తువుతో పాటు తూకంలో తేడాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గర్భిణీల ఆరోగ్య సంరక్షణకు నగదు బదిలీ పథకం ప్రవేశపెట్టడంతో పాటు మహిళల ఆత్మరక్షణకు ప్రతి నియోజకవర్గంలో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేయాలని ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. యర్రగొండపాలెం మండలం వెంకటాద్రిపాలెం పంచాయతీ సమగ్ర అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎన్.మల్లికార్జున నాయుడు కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

## పుంగనూరు టిడిపి నేతలతో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ టిడిపి నేతలు, కార్యకర్తలతో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్(సర్) ప్రక్రియపై మంత్రి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపైనా సమావేశంలో చర్చించారు. త్వరలోనే పార్టీ సంస్థాగత కమిటీలను పూర్తిచేస్తామని చెప్పారు. కార్యకర్తలపై నమోదైన అక్రమ కేసుల ఎత్తివేతకు చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గంలో పార్టీ పరంగా తలెత్తుతున్న సమస్యలను ఈ సందర్భంగా నేతలు, కార్యకర్తలు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. జోనల్ ఇంఛార్జ్, నియోజకవర్గ పరిశీలకులను పంపి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు.

## పదోన్నతి పొందిన అదనపు ఎస్పీలకు పోస్టింగ్‌లు

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** పదోన్నతి పొందిన పలువురు అదనపు ఎస్పీలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆ మేరకు డిజిపి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అనకాపల్లి అదనపు ఎస్పీ కె.వి.మహేశ్, అదనపు ఎస్పీ ఈగల్‌గా చొక్కా శ్రీనివాసరావు, విశాఖ అదనపు డిసిపిగా పి.రామచంద్రరావు, అనంతపురం అడ్మిన్ అదనపు ఎస్పీగా ముత్యాల నాగభూషణం, తిరుపతి అదనపు ఎస్పీ శాంతి భద్రతలుగా జె.బాబు ప్రసాద్, తిరుపతి అదనపు ఎస్పీ అడ్మిన్‌గా ఆర్ల శ్రీనివాసులు, తిరుపతి క్రైమ్ అదనపు ఎస్పీగా డి.బాలచంద్రారెడ్డిని నియమించారు. పదోన్నతి పొందిన పోలీసు అధికారులు వెంటనే విధుల్లో చేరవలసి ఉంటుంది.

## రేరా ట్రైబ్యునల్ సభ్యురాలిగా విద్యుల్లత

**పట్టణాభివృద్ధి రంగ అనుభవానికి మరో గౌరవం**



**విశాఖపట్నం, జూన్ 16 ప్రభాతవార్త:** పట్టణ ప్రణాళిక, నగరాభివృద్ధి రంగాల్లో విశేష అనుభవం కలిగిన సీనియర్ అధికారి విద్యుల్లతకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక బాధ్యత అప్పగించనున్నట్లు సమాచారం. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రేరా) ట్రైబ్యునల్ టెక్నికల్ సభ్యురాలిగా ఆమెను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ)గా పనిచేస్తున్న విద్యుల్లత స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకున్నట్లు తెలిసింది. తన సుదీర్ఘ ప్రభుత్వ సేవా కాలంలో ఆమె పట్టణాభివృద్ధి, నగర ప్రణాళిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కీలక విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేసి ప్రత్యేక గుర్తింపు పొందారు.ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాజకీయాలకు అతీతంగా విధి నిర్వహణలో నిబద్ధత, పనితీరు, ఫలితాలపై దృష్టి సారించే అధికారిగా విద్యుల్లతకు మంచి పేరు ఉంది. క్లిష్టమైన పట్టణాభివృద్ధి ప్రాజెక్టులు, ప్రణాళికా అంశాల్లో ఆమె చూపిన చొరవకు సహచర అధికారులు, ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు లభించాయి. రేరా ట్రైబ్యునల్‌లో టెక్నికల్ సభ్యురాలిగా ఆమె నియామకం జరిగితే, రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన వివాదాల పరిష్కారం, సాంకేతిక అంశాల పరిశీలన, పట్టణ ప్రణాళికకు సంబంధించిన కేసుల్లో ఆమె అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పరిపాలనలో సమర్థత, వృత్తిపరమైన నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన విద్యుల్లతకు ఈ బాధ్యత దక్కడం ఆమె సేవలకు లభించిన మరో గౌరవంగా భావిస్తున్నారు. రేరా ట్రైబ్యునల్ పనితీరు మరింత సమర్థవంతంగా మారడంలో ఆమె పాత్ర కీలకంగా ఉండనుందని అధికార వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## జనసేన జాయినింగ్స్ కమిటీ నియామకం

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన పార్టీలో కొత్తగా చేరేవారిని సమన్వయం చేసుకునేందుకు ప్రత్యేకంగా జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. 14 మంది సభ్యులతో ఆంధ్రప్రదేశ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కమిటీలో కొత్తగా రాజ్యసభకు ఎంపికైన లింగమనేని రమేశ్‌తో పాటు ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంతం నానాజీ, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, సామినేని ఉదయభాను, సీనియర్ నతేలు కొటికలపూడి చినబాబు హరిప్రసాద్, పెదపూడి విజయ్ కుమార్ , కొరికాన రవికుమార్, వంపూరు గంగులయ్య టీసీ వరుణ్, ఆరణ మదన్ సభ్యులుగా ఉంటారు. జనసేన పార్టీలో చేరుందకు ఆసక్తి కబనరుస్తున్న విద్యావంతులు, సామాజికవేత్తలు ఇతర పార్టీల నేతలతో పాటు తటస్థులను ఆహ్వానించేందుకు ఈ కమిటీ పని చేస్తుందన్నారు. త్వరలోనే జాయినింగ్స్ కమిటీ సమావేశం నిర్వహించి పార్టీలో చేరికలపై దిశానిరేద్శం చేయనున్నట్లు చెప్పారు. ఏపీ తరహాలోనే తెలంగాణలనూ జాయినింగ్స్ కమిటీ నియామకానికి సన్నాహాలు చేస్తున్నట్లు పవన్ తెలిపారు.

# మధురవాడకు మహర్దశ


**రూ.725 కోట్లతో తాగునీటి ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్**

**24 గంటల తాగునీటి సరఫరా దిశగా కీలక అడుగు.. లక్షలాది మందికి ప్రయోజనం**

**విశాఖపట్నం, జూన్ 16 ప్రభాతవార్త:** విశాఖ నగర పరిధిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ (జోన్II), పరిసర ప్రాంతాల ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతానికి 24 గంటల పాటు నిరంతరాయంగా తాగునీటిని సరఫరా చేసే లక్ష్యంతో రూపొందించిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.725.18 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఆధునిక తాగునీటి వ్యవస్థకు మార్గం సుగమమైంది.మధురవాడ, కొమ్మాది, ఎండాడ, కారాపాక, పరిసర ప్రాంతాల్లో జనాభా వేగంగా పెరుగుతుండటంతో తాగునీటి అవసరాలు కూడా గణనీయంగా పెరిగాయి. ప్రస్తుతం కొన్ని ప్రాంతా ల్లో నీటి సరఫరా అంతరాయాలు, తక్కువ ఒత్తిడితో నీటి పంపిణీ సమస్యలు ఎదురవు తున్నాయి. కొత్త ప్రాజెక్టు అమలులోకి వస్తే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతికతతో నీటి నిల్వ, శుద్ధి, పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు.ఈ మెగా ప్రాజెక్టు కోసం నిధులను మూడు వేర్వేరు వనరుల ద్వారా సమీకరించనున్నారు. కేంద్ర ప్రభుత్వ అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూ సీ ఎఫ్) నుంచి రూ.172.37 కోట్లు అందనున్నాయి. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ తన వాటాగా రూ.190.21 కోట్లు భరిస్తుంది. మిగిలిన రూ.362.60 కోట్లను గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ టర్మ్ లోన్ రూపంలో సమకూర్చనుంది.ఈ ప్రాజెక్టు అమలుతో మధురవాడ ప్రాంత ప్రజలకు రోజంతా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. నీటి కోసం నిల్వ చేసుకోవాల్సిన అవసరం తగ్గడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి. అలాగే వేగంగా విస్తరిస్తున్న నివాస కాలనీలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల అవసరాలకు కూడా ఈ ప్రాజెక్టు అండగా నిలవనుంది.నగర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపడుతున్న కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఇది ఒకటిగా నిలవనుంది. విశాఖను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక నగరంగా తీర్చిదిద్దే క్రమంలో ఈ తాగునీటి ప్రాజెక్టు ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత లక్షలాది మంది ప్రజలు నాణ్యమైన తాగునీటి సేవలను నిరంతరాయంగా

# రెండేళ్లలో శాంతి భద్రతలు, మహిళా రక్షణ, డ్రగ్స్ నియంత్రణలో గణనీయ పురోగతి

**హోం మంత్రి వంగలపూడి అనిత**



**సచివాలయం, జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్ళ కాలంలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల రక్షణ, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాలను అరికట్టడం, విపత్తుల నిర్వహణ, జైళ్ళ సంస్కరణలు, పోలీసు సంక్షేమం వంటి అన్ని రంగాల్లో సమగ్ర సంస్కరణలను చేపట్టి విశేష ఫలితాలు సాధించిందని రాష్ట్ర హోం వ్యవహారాలు మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి అనిత వంగలపూడి తెలిపారు.

మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రయోజనాలకు పరిమితమైన వ్యవస్థలను ప్రజా సేవా దృక్పదంతో పునర్మిస్తూ ప్రజలకు జవాబుదారీగా పనిచేసే పరిపాలన వ్యవస్థను ప్రభుత్వం నెలకొల్పిందన్నారు.నేరం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా,నేరం జరగకుండా ముందుగానే నిరోధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజల భద్రత, మహిళల గౌరవం, యువత భవిష్యత్తు, సమాజ శాంతి కోసం రాజీపడకుండా తమ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి స్పష్టంచేశారు. సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన నిఘా వ్యవస్థలు,శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, అంతర్‌శాఖ సమన్వయాన్ని మెరుగుపర్చడం ద్వారా రాష్ట్రంలో మొత్తం నేరాల శాతం సమారు 14.1శాతం మేర తగ్గిందన్నారు. శక్తియాప్ ద్వారా అత్యవసర సహాయం, మహిళలపై నేరాలకు ప్రత్యేక పర్యవేక్షణ అమలు చేయబడుతుందన్నారు. శక్తియాప్ ద్వారా ఇప్పటివరకు 11.15 లక్షలకు పైగా అత్యవసర ఎస్ఓఎస్ కాల్స్ అందాయని వాటిపై తక్షణ చర్యలు కూడా తీసుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు. తప్పిపోయిన చిన్నారులు, మహిళలు, వృద్ధులను గుర్తించి కుటుంబాలకు చేర్చేందుకు చేపట్టిన ఆపరేష్ ముస్కాన్ అత్యంతగా విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 8,396మంది తప్పిపోయిన వ్యక్తులను గుర్తించి, వారి కుటుంబాలకు తిరగి చేర్చడం జరిగిందన్నారు. అదనపు డిజి మధుసూధనరెడ్డి, హోంశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్, ఎస్‌పిఎఫ్ డిజి డాక్టర్ త్రివిక్రమ వర్మ, హోంశాఖ స్పెషల్ సెక్రటరీ విజయ్‌కుమార్, ఈగల్ చీఫ్ ఐజి రవికృష్ణ, ఐజీలు శ్రీకాంత్, రాజకుమారి, విపత్తుల నిర్వహణ శాఖ ఎండి ప్రకర్‌జైన్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ వెంకట రమణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



# ఏనుగులు వ్యధ.. ఎన్నాళ్లు అనుభవించాలి

**• ఎన్నో ప్రాణాలు బలిగొన్నాయి • పంట పొలాలకు తీవ్రనష్టం • రైతులను ఆదుకునే వారేరీ?**

**విజయనగరం, జూన్ 16 ప్రభాతవార్త:** గత కొన్ని సంవత్సరాలుగా అడవిలో ఉండవలసిన గజరాజులు సాధారణ గ్రామాలలో సంచరించడంతో ప్రజలు భయాందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టం ఏర్పడుతుంది. అరకొర ఫారెస్ట్ సిబ్బందితో గజరాజు ప్రజల బార్ కి రాకుండా కాపాడటం కష్టంగా తయారయింది. వన్యప్రాణులు పంట పొలాలలో సంచరించడంతో నోటి దగ్గరకొచ్చిన పంట బుగ్గిపాలవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పార్వతీపురం జిల్లా మక్కువ మండలంలో సుమారు పది గజరాజులు ధ్వంసం చేస్తూ పొలాల్లో అమర్చిన నీరు పంపుసెట్‌లు కూడా చెల్లాచెదురుచేస్తూ విధ్వంసం సృష్టించుతున్నాయి. అరకొరగా ఉన్న ఫారెస్టు సిబ్బంది గజరాజుల నుంచి వచ్చిన ధ్వజాన్ని వెనక్కి మళ్లించడంలో నిమగ్నమైన వారు కూడా మనుషులే కదా దీనిపై ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటుందో ఏమి తెలియ రాలేదు. ఎన్నాలిలా గజరాజులు దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవలసి వస్తున్న ఉప ముఖ్య మంత్రి ప్రత్యేక శ్రద్ధతో వీటినుంచి ప్రజలను కాపాడే చర్యలు చేపట్టాలని ఉభయజిల్లాలకు చెందిన ప్రజలు ఏకరువు పెడుతున్నారు. రెండు వారాలుగా డబ్బగడ్డ, సి బిల్లి పెద్దవలస పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగులు గుంపు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. గత వారం రోజులుగా మక్కువ మండలం కాముడువలస సిబిల్లి, గైసీల తదితర ప్రాంతాల్లో 8 ఏనుగులు గుంపు పామాయిల్, అరటి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పొలాల్లో ఉన్న వ్యవసాయ బోర్లను, డ్రిప్ ఇరిగేషన్ పైపులను ధ్వంసం చేయడంతో రైతులు తీవ్ర నష్టాలను చదివిచూస్తున్నారు అప్పులు చేసి వ్యవసాయంపై పెట్టుబడులు పెడితే ఈ ఏనుగులు ఎలా పాడు చేయడంతో జీర్ణించుకోలేక పోతున్నామని వాపోతున్నారు మరోవైపు పాడైన పంటల నష్టాలను అంచనా వేసేందుకు కూడా అధికారులు ముందుకు రావడంలేదని వాపోయారు. ఒకరిపై ఒకరు అధికారులు నెట్టుకుంటూ వస్తున్నారే తప్ప రైతులకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందట కాముడవలసకు చెందిన రైతు జీ.పోలినాయుడు వ్యవసాయ పొలంలో ఉన్న రెండు బోర్లను ధ్వంసం చేశాయి. పామాయిల్ చెట్లను పీకేయడంతో రైతుకు సుమారు లక్ష వరకు నష్టం జరిగి ఉంటుందని వాపోతున్నాడు. సిబిల్లి, పైసిల, పెద్దవలస తదితరప్రాంతాల్లో అరటి తోటలు ధ్వంసమయ్యాయి. ఏనుగులు గుంపును ఒడిశాలోకి పంపించేందుకు అటవీ శాఖ అధికారులు విశ్వప్రయత్నం చేస్తున్న అవి కదలడం లేదు. అలాగే గిరిజన ప్రాంతాల్లో ఉన్న వారంతా రాత్రిపూట గుంపు గ్రామంలోకి వస్తుందేమోనని భయంతో వణికిపోతున్నారు. ఏనుగులను ఇక్కడి నుంచి అడవుల్లోకి తరలించాలని గిరిజనులు కోరుతున్నారు. అలాగే పాడైన పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.


**ANANTAPURAMU MUNICIPAL CORPORATION**
**e-PROCUREMENT - Tender Notice**

| | | |
|---|---|---|
| 1. | Tender Notice No | 101 to 116/NCAP and 15th FC and GF/2026-27/TO |
| 2. | Scope of work | Providing of BT Rods , Road Improvement, CC Road |
| 3. | No. of Works | 16 Nos |
| 4. | Estimate Cost | Rs. 4.00 to 200 Lakhs |

Note : The details of tender may be seen on e - procurement market Place available @ https://tender.apeprocurement.gov.in.

sd/- Commissioner, Municipal Corporation, Anantapuramu

చెవిటి వాడు ఎవరు? మాట వినలేనివాడు కాదు. మంచి మాట విననివాడు.

న-ఆది శంకరాచార్యులు

# చిక్కుముడులు వీడినట్లేనా?

ఇల్లలకగానే కాదు ముందుంది ముసళ్ల పండుగ అన్న చందాన పశ్చిమాసియాలో శాంతి వీచికలకు ఇంకా టైం పట్టేట్టుంది. అయితే శాంతి ప్రక్రియ మొదలైంది కనుక కనుచూపు మేరలో యుద్ధానంతర ప్రభావాలు ఒక్కటొక్కటీ కనుమరుగై యుద్ధ విరమణ పర్యవసానాలు వెలుగులోకి వస్తాయని ఆశపడ్తుంటారు. యుద్ధ విరమణకు సానుకూల ఒప్పందం తుదిరూపు దిద్దుకుందనగానే భారతీయుల్లోనే కాదు యుద్ధ ప్రభావిత దేశాల్లో కూడా ఎంతో సంతోషం వ్యక్తమైంది. హర్మూజ్‌జలసంధి మార్గంలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు సాఫీగా జరిగితే బావుంటుందనే ఆలోచన మదిలో మొలకెత్తుతుంది. అంతర్జాతీయ ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. సోమవారం బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 4.7 శాతం తగ్గి 84 డాలర్లకు దిగువకు చేరింది. యుద్ధ నేపథ్యంలో క్రూడాయిల్ ధర 125 డాలర్లకు తాకడమే చెప్పుకోదగిన విపరిణామం. యుఎఇ, ఖతార్, కువైట్, బహ్రెయిన్ సౌదీ అరేబియా దేశాలపై ఇరాన్ దాడులకు తెగబడడంతో ముడి చమురు, సహజవాయులు తయారీ, సరఫరాకు ఆటంకమేర్పడింది. చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి తెరుచుకుంటోందంటేనే ప్రభావిత దేశాలు సంబరపడ్డాయి. అమెరికా ఇరాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందానికీ తమకూ సంబంధం లేదంటూ లెబనాన్‌పై ఇజ్రాయిల్ విరుచుకుపడటమొక్కటే ఈ ఒప్పందం ఎంతవరకు అమలులోకి వస్తుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయినా స్వయంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన భరోసాతో ఒప్పందాలు సంతకాల వరకు వచ్చాయి. చమురు ధరలు దిగిరావడంతో మదుపరుల్లో కాస్తంత ఊరట కలిగింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు బ్యారెల్ ముడిచమురు ధర 70 డాలర్ల వద్ద ఉండేది. మళ్లీ ఆ రేటును చేరుకుంటే తప్ప మార్కెట్ల మాయాజాలం నుంచి బయటపడడం. అలా జరిగినా రిటైల్ ధరలు తక్షణమే అదుపులోకి వస్తాయని కానీ, అనేక కారణాల చేత ప్రభావితమైన ధరలన్నీ ఆగమేఘాల మీద తగ్గిపోయే పరిస్థితి ఉంటుందని కానీ చెప్పలేం. యుద్ధం వెంబడి నిత్యావసర వస్తువులు ఆకస్మికంగా కొండెక్కాసాయి. అలా అని యుద్ధ విరమణ తర్వాత అంతే స్పీడ్‌లో ధరలు తగ్గించే యంత్రాంగమేదీ లేదు. అంతే వేగంగా పనిచేసే పరిస్థితి ఏర్పడదు. ఇంకా ధరలు పెరిగినా పాత స్టాక్‌లున్నాయి కనుక మరి కొన్నాళ్లు ధరలు తగ్గించలేరు. మరికొంత కాలం వినియోగదారుని నెత్తిన ధరల భారం తప్పదు. ఈలోగా ఈనాటి శాంతి ఒప్పందం నరపపంచ ఇంధన మార్కెట్లకు శుభపరిణామమే కావచ్చు కాని సామాన్య వినియోగదారునికి మాత్రం తీవ్ర మనోవేదనే. ఈ ఒప్పందాలన్నీ సజావుగా అమల్లోకి వచ్చినా హర్మూజ్ జలసంధి తెరచుకోవడమే కాదు. అక్కడ జలాల్లో దాచిన మందుపాతరలు (సీమైన్స్) తొలగించడం, డ్రోన్ భద్రతలను ఉపసంహరించుకుంటే తప్ప, అక్కడే ఆగి ఉన్న 500 నౌకలు జలసంధి మార్గం నుంచి తమ సొంతదేశ సముద్ర జలాల్లోకి మరలవు. దానికీ దీర్ఘకాలమే పట్టొచ్చు. గల్ఫ్ ప్రాంతంలో చిక్కుకున్న ఆ వాణిజ్య నౌకలన్నీ ఆయా దేశాలకు 'చేరిపోతే తప్ప' అలజడి తగ్గదు. భారత్ తన చమురు అవసరాలకు గల్ఫ్ దేశాల మీదనే ఆధారం. హర్మూజ్ తెరవగానే మరో మూడు నెలలకైనా చమురు తగ్గినా పాత ధరల అమల్లో ఉంటాయి. క్రమేపీ రవాణా ఖర్చులు తగ్గుతాయి. దానిపై ఎంతో కొంత ధరల తగ్గింపు ఉంటుంది. సామాన్యుడి వంటింటి ఖర్చు తగ్గుతుంది. చమురు విరివిగా, చౌకగా దొరికే అవకాశముంటే రవాణా ఖర్చులు ఆదా అవుతాయి. అదే జరిగితే 'కిచెన్ బడ్జెట్' తేలికవుతుంది. ఇంధన ధరలపై ప్రతికూల ప్రభావం కూడా తగ్గుతుంది. మొత్తానికి దిగుమతుల వ్యయం తగ్గడం వినియోగదారునికి ఊరటే. ఇరాన్ అణ్వాయుధీకరణపై ఇంకా అనిశ్చితి ఉండనే ఉంది. ప్రతిష్టంభనలో ఉన్న ఇరాన్ నిధులను అమెరికా డీఫ్రీజ్ చేయడం కూడా ముఖ్యమే. అసలు సిసలు 'పీఠముడి' ఈ రెండు అంశాలపైన ఉంది. ఈవ్యవహారంలో ఒప్పందం నాటి షరతుల మేరకు సజావుగా సాగితేనే పరిష్కారాలు ఫలవంతమౌతాయి. శాంతి వచనాలు వినేందుకు 19న స్విట్జర్లాండ్‌లోని జెనీవా అధికారిక కార్యక్రమంలోనే బయటపడతాయి. దాదాపు నాలుగు నెలల పశ్చిమాసియా కల్లోలానికి అంతిమఘడియలు సమీపించాయి. కానీ అన్నిదేశాలు,అన్నిషరతుల పాటింపు వంటిఅంశాలు కొలిక్కి వచ్చేసరికి మరికొన్ని నెలలు పట్టొచ్చు. తాజా అవగాహన అమలు జరిగితే పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాల పునరుద్ధరణ, నౌకాయాన, స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశమేర్పడ్తుందని భారత్ తరపున ప్రధాని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. శాంతియుత పరిష్కారం ద్వారా ఓ కీలకమైన అడుగుపడటం పట్ల ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీ గుటెరస్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ప్రాంతీయ స్థిరత్వానికి ప్రస్తుత శాంతి ఒప్పందం దోహదపడగలదని భావిస్తున్నట్లు యూరోపియన్ కమిషన్‌అధ్యక్షురాలు ఉరులాఅభిభాషణ. ప్రస్తుతం ఒప్పందవిశేషాలకు వర్చువల్ సంతకాల ద్వారా ఆమోద ముద్ర పడింది. హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఒమన్ దేశాలకున్న సార్వభౌమాధికారం విషయంలో అమెరికా స్పష్టతనివ్వడంలో ఇరాన్ కాస్త మెతకబడినట్లు ఉంది.ఒప్పందంపై డిజిటల్ సంతకాలు చేసినమరునాడు చమురుతో ఆయా దేశాల నౌకలు కదలికలు ప్రారంభమయ్యాయి.ఆది నుంచి అంతంవరకు శషభిషలు లేకుండా, ఒప్పందాలను చిక్కుముడులు పడకుండా అమలు చేయగలిగితే ప్రపంచానికే శుభపరిణామం కాగలదు.

అంధుని చేతికి ఆసరాగా ఊతకర్ర ఎంత అవసరమో, ఆపదలో ఉన్న వారికి ధైర్యం అంత అవసరం.



రామకృష్ణ పరమహంస

ఏ విషయమైనా కొత్తగా ఉన్నప్పుడే బాగుంటుంది. కాని స్నేహం మాత్రం పాతబడిన కొద్దీ బాగుంటుంది.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య

## ప్రజావాక్కు



### గృహిణుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

ఇంటిని సక్రమంగా నడిపించడం,కుటుంబ సభ్యుల ఆరోగ్యం, ఆహారం, పిల్లల సంరక్షణ, వృద్ధుల అవసరాలు చూసుకోవడం వంటి బాధ్యతలను నిర్వర్తించే గృహిణుల సేవలకు ఇప్పటికీ సరైన గుర్తింపు లభించడం లేదు. వేతనం లేకుండా వారు చేసే గృహకార్యం దేశ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా నిలుస్తున్నప్పటికీ, వారికి సామాజిక భద్రత మాత్రం అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో గృహిణులకు సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం అత్యంత ప్రాధాన్యంగా మారింది. గృహకార్యానికి విలువ ఇవ్వాల్సిన అవసరాన్నిసుప్రీంకోర్టు కూడా ప్రస్తావించడం గమనార్హం. గృహిణులు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని న్యాయస్థానం పేర్కొనడం సమాజ దృష్టికోణంలో పెద్ద మార్పుకు సంకేతం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### మోసాలను నియంత్రించలేమా?

ఆధార్ పేరు పెట్టి ప్రభుత్వాలు ప్రజలతో ఆడుకుంటూ ఉన్నారు. డేట్ ఆఫ్ బర్త్ చేంజ్ ఒకసారి, నేమ్ చేంజ్ లేదా స్పెల్లింగ్ కరెక్షన్స్ రెండుసార్లు పరిమితి పెట్టారు. టుయెర్ ఈజ్ హ్యూమన్ అంటారు. మానవ తప్పిదాలు సహజంగా జరుగుతాయి. స్పెల్లింగ్ మిస్టేక్స్ రావడం ప్రింట్ పొరపాట్లు జరగడానికి అవకాశాలుంటాయి. దేశం బోర్డర్లో ఉన్న ప్రజలకు కఠినమైన నిబంధనలు ఉండడం అర్థం ఉంటుందేమో కానీ అందరికీ ఇలా ఇబ్బంది పెట్టడం తగదు. అన్నింటికీ ఆధార్ ఉపయోగిస్తున్నారు. అన్నింటితో ఆధార్‌ని లింక్ చేస్తున్నారు. నిజానికి ఓటు వేయడానికి చేతి వేలి ముద్రలు, కన్నులు ఐరిష్ మ్యాచ్ అయితేదొంగఓట్లు వేయడానికి అసలుఅవకాశం ఉండదు.

- వి. రూపవతి, బొబ్బిలి

### వేతనాలు పెంచాలి

విద్యుత్‌శాఖలో గత రెండు దశాబ్దాలుగా ఎందరో విద్యావంతులు ప్రభుత్వం తమను పర్మినెంట్ చేస్తుందనే ఆశతో మీటర్‌రీడింగ్ పనులు చేస్తూవున్నారు.వారికి ఇప్పటికీ ఎదుగూ బొదుగూ లేకుండా కేవలం నెలకి పది వేల రూపాయలే ఇస్తున్నారట. వారు రోజుకు 8గంటలు పైగా డ్యూటీలు చేస్తున్నారు. సెలవులు కూడాతక్కువ. పదివేల రూపాయలతో లక్ష రూపాయల జీతం పొందే పర్మినెంట్ ఉద్యోగితో సమానంగా ఫుల్ టైం డ్యూటీలు చేస్తున్నారు. పెరిగిపోతున్న ధరలకుపదివేల రూపాయలు సరిపోవు.

- టి. సాంబశివరావు, గుంటూరు

### పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

పెరుగుతున్న వాహనాల సంఖ్య,మితిమీరిన వేగం కారణంగా నేడు రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఎందరో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రోడ్లను ప్రమాదరహితంగా మార్చడం అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం. రహదారి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించడం వల్ల కలిగే పరిణామాలు అత్యంత భయంకరంగా ఉంటున్నాయి. ప్రమాదాల నివారణకు రహదారుల రూపకల్పనలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రాత్రివేళల్లో తగినంత వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలుఏర్పాటు చేయాలి.గుంతలమయమైన రోడ్లను వెంటనే మరమ్మతు చేయడం ద్వారాచాలా ప్రమాదాలను నివారించవచ్చు.అలాగే,అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలపై కఠినమైన జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారి పట్ల ఎటువంటి మినహాయింపు ఉండకూడదు.

- కె. నారాయణస్వామి, హైదరాబాద్

### రైతుల కష్టాలు తీరేదెలా?

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు రైతులు పండించిన మొక్కజొన్న,వరి వంటిపంటలు కలలాల్లో కొనుగోలు చేయక తడిసిపోతుంటే మరోపక్క ప్రగతిపేరిట 99 రోజుల సంబరాలు చేస్తుంది. రైతులు తాము పండిచ పంటను కలలాల్లో పెట్టుకొని రోజులు తరబడి ఎదురు చూస్తున్న అధికారులు రావడం లేదంటూ కొనుగోలు చేయక రైతులు ఆవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.మరోవైపు ఈదురు గాలుల వల్ల మామిడి రైతులు నష్టపోతున్నారు. వారికి భరోసా కల్పించి ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పవచ్చు. రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది.

- ఎం. సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### సమాన పనికి సమాన వేతనం

భారతదేశంలో ఆర్థిక, సాంకేతిక రంగాలు వృద్ధి చెందుతున్నప్పటికీ లింగ వివక్ష రూపం మార్చుకుని కొనసాగుతోంది. క్షేత్రస్థాయి పరిశీలనలు భిన్నమైన వాస్తవాలను చూపుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయక పురుషాధిక్య ధోరణులు, బాల్యవివాహాలు, చదువు ఆపివేయడం వంటి సమస్యలున్నాయి. వ్యవసాయ రంగంలో సమానంగా శ్రమిస్తున్న

# సామాన్యుడికి భారంగా ప్రైవేట్ చదువు!

**ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక సదుపాయాలు, ఇంగ్లీష్ మాధ్యమం వంటి అవకాశాలను పెంచితే ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడటం తగ్గుతుంది. ఇలాంటి కఠిన చర్యలను ప్రభుత్వం తీసుకుంటేనే ప్రైవేటు బడుల్లో ఫీజుల నియంత్రణకు ముక్కు తాడు వేసినట్టు అవుతుంది. 'విద్యవ్యాపారం కాదు.. సామాజిక బాధ్యత' అనే భావనతో ప్రభుత్వం కఠిన నియంత్రణలు అమలు చేస్తేనే ప్రైవేటు బడుల్లో ఫీజులమోతకు అడ్డుకట్ట వడుతుంది. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థికస్థితి రెండింటినీ కాపాడే విధానాలు అవసరం. విద్య వ్యాపార వస్తువు కాదు. అది సమాజాన్ని తీర్చిదిద్దే శక్తి. విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రైవేటు పాఠశాలల ఫీజుల విషయంలో సమతుల్యత అవసరం. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థికస్థితి రెండింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం, విద్యాసంస్థలు, సమాజం కలిసి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది.**



డా.మోటె చిరంజీవి

విద్య అనేది ప్రతి చిన్నారి హక్కు. సమాజ అభివృద్ధికి, దేశ ప్రగతికి విద్యే పునాది. అయితే నేటి పరిస్థితుల్లో విద్య హక్కు కంటే వ్యాపారంగా మారిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు విద్యకు ప్రధాన కేంద్రాలుగా ఉండేవి. కానీ కాలక్రమేణా ప్రైవేటు విద్యాసంస్థల సంఖ్యపెరిగింది. నాణ్యమైన విద్య, ఇంగ్లీష్ మాధ్యమం, ఆధునిక సదుపాయాల పేరుతో తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని కొన్ని విద్యాసంస్థలు ఫీజులను ఇష్టానుసారంగా పెంచుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల పెంపు తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే అడ్మిషన్ ఫీజులు,ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు,యూనిఫాంలు, రవాణా ఛార్జీలు, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో వేల నుంచి లక్షల రూపాయల వరకు వసూలు చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పుడంతా జనాలు అమ్మో జూన్ నెల అనుకుంటున్నారు. ఇటు స్కూల్ ఫీజుల మోత మొదలైంది. ఇప్పటికిప్పుడు పాఠశాలల్లో ఎంతో కొంత ఫీజు కట్టాల్సి ఉంటుంది. మరోవైపు రైతన్నలకు పెట్టుబడి ఖర్చుల దిగులు పట్టుకుంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఏటా 10 శాతం నుండి 15 శాతం వరకు ఫీజులను పెంచుతూ తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారాన్ని మోపుతున్నారు. ప్రతి సంవత్సరం జూన్ నెలలో పాఠశాలల పునఃప్రారంభం వేళ అడ్మిషన్ల పేరుతో, పుస్తకాలు, డ్రెస్సుల పేరుతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలను నిలువునా దోచుకుంటున్నారు.మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి, పొదుపులను ఖర్చుచేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు ఉంటే ఆర్థిక ఒత్తిడి మరింత పెరుగుతోంది. కొంతమంది తల్లిదండ్రులు ఫీజుల కోసం వ్యక్తిగత రుణాలు తీసుకోవాల్సి వస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో సగటు వార్షిక ఫీజు రూ. 41,475 దాటిపోయింది. ఇది రాష్ట్రంలోని కనీస బీటెక్ ఫీజు (రూ.36,000) కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. గ్రామాల్లో సైతం సగటు స్కూల్ ఫీజు రూ. 35,104గా నమోదవుతోంది. పట్టణాలకు, గ్రామాలకు తేడా కేవలం ఆరువేల రూపాయలు మాత్రమే. ఎల్‌కేజీ, యూకేజీ చదువులకే కనీసం రూ.30,000 నుండి రూ. 50,000 వరకు వసూలు చేస్తున్నారు. హైస్కూల్ విద్యార్థులకైతే ఈ భారం రూ.80,000 పైమాటే. అదనపు వసూళ్ల దోపిడీ పుస్తకాలు,యూనిఫాంలదందా కనిపిస్తుంది. నిబంధనల ప్రకారం స్కూళ్లలో పుస్తకాలు అమ్మకూడదు. కానీ, ఐటీఐ ఒరియంటెడ్, ఐఐటీ లేదా నీట్ సిలబస్ పేరుతో ప్రైవేట్ పబ్లికేషన్ల పుస్తకాలను రూ. 10,000 నుండి రూ.12,000కు విక్రయిస్తున్నారు. కేవలం ట్యూషన్ ఫీజే కాకుండా యూనిఫాం, షూస్ కోసం రూ.4,000, స్కూల్ బస్సు ఛార్జీల కింద నెలకురూ.2,000 నుండిరూ. 3,000 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.జూన్ నెలలో ఇద్దరు పిల్లలున్న ఒక మధ్యతరగతి కుటుంబం కేవలం చదువుల కోసమే ఒకేసారి రూ. 1,00,000 నుండి రూ.1,50,000 వరకు సిద్ధం చేసుకోవాల్సి వస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ప్రైవేటు పాఠశాలల ఫీజు నియంత్రణ చట్టంపై ప్రభుత్వం నుంచి సరైన స్పష్టత కరవైంది. దీనివల్ల సుమారు 11వేల ప్రైవేటు స్కూల్స్‌లోని 32 లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఈభారాన్ని మోయాల్సి వస్తోంది. బోర్డుల ప్రదర్శన లేదు. పాఠశాలలో ఎంత ఫీజు వసూలు



చేస్తున్నారు, ఎలాంటి సౌకర్యాలున్నాయి అనే వివరాలను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలనే విద్యాశాఖ నిబంధనలను ఏ పాఠశాల పాటించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని బడులు కూడా తామేం తక్కువకాదంటున్నాయి. ఈ స్కూళ్లల్లో సగటు ఫీజు రూ.35,104గా ఉంది. అంటే పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ బడుల ఫీజులకు తేడా ఆరువేలే కావడం గమనార్హం. ఈ వివరాలు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించినవే. అసెంబ్లీకి సమర్పించిన సోషియో ఎకనామిక్ సర్వేలో ఈ వివరాలు సర్కార్ పొందుపరిచింది. ప్రాంతాలవారీగా, యాజమాన్యాల వారీగా సగటు ఫీజుల వివరాలు సర్కార్ ఈ నివేదిక ద్వారా వెల్లడించింది.గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వబడుల్లో తల్లిదండ్రులు చేస్తున్న ఖర్చు రూ.2,286మాత్రమే. అదే ఎయిడెడ్ బడుల్లోని తల్లిదండ్రులు రూ.28,420, ఇతర బడుల్లో రూ.4,907,నాన్‌గవర్నమెంట్ స్కూళ్లల్లో రూ.34,012 చొప్పున ఖర్చుచేస్తుండగా అదే ప్రైవేట్ బడుల్లోని తల్లిదండ్రుల వ్యయం రూ.35,104గా ఉంది. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లోని సర్కార్ స్కూళ్లల్లో తల్లిదండ్రులు చేస్తున్న ఖర్చు రూ.3,963 మాత్రమే. అదే ఎయిడెడ్ బడుల్లోని తల్లిదండ్రులు రూ. 32,951, ఇతర బడుల్లో రూ.3,260, నాన్ గవర్నమెంట్ స్కూళ్లల్లో రూ. 38,884 చొప్పున ఖర్చుచేస్తుండగా అదే ప్రైవేట్ బడుల్లోని తల్లిదండ్రుల వ్యయం రూ.41,475గా ఉంది. విద్యాసంస్థలు కూడా తమవైపు నుంచి కొన్ని కారణాలను చెబుతున్నాయి.ఉపాధ్యాయుల వేతనాలు, భవన నిర్వహణ, విద్యుత్, సాంకేతిక సదుపాయాలు, డిజిటల్ తరగతులు వంటి ఖర్చులు పెరిగాయని పేర్కొంటున్నాయి.అయితే ఈ ఖర్చుల పేరుతో అధిక ఫీజులు వసూలు చేయడం సమంజసమా అనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వం ఈ అంశంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరంఉంది. ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణకు స్పష్టమైన విధానం రూపొందించాలి. ఫీజుల పెంపుపై పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి.ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా పెరుగుతున్న ఫీజులను నియంత్రించడానికి ప్రభుత్వం పలు కఠినమైన పారదర్శకమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.రాష్ట్ర స్థాయిలో స్వతంత్ర ఫీజు నియంత్రణ కమిషన్ ఏర్పాటు చేసి, ప్రతి పాఠశాల వసూలు చేసే ఫీజులను పరిశీలించి ఆమోదించాలి.ప్రతి సంవత్సరం ఫీజుపెంపునకు గరిష్ట పరిమితి నిర్ణయించాలి. నిర్దిష్టశాతం కంటే ఎక్కువ పెంపు చేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేయాలి. పాఠశాలలు తమ ఫీజుల వివరాలను వెబ్‌సైట్‌లో, నోటీసు బోర్డులోతల్లిదండ్రులకు ముందుగానే వెల్లడించేలా నిబంధనలు అమలు చేయాలి. అడ్మిషన్ ఫీజు, డొనేషన్, డెవలప్‌మెంట్ ఫండ్,ప్రత్యేక కార్యక్రమాల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేయకుండా కఠినచర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులు పాఠశాల సూచించిన దుకాణాల నుంచే కొనాలనే బలవంతాన్ని తొలగించి, ఎక్కడైనా కొనుగోలు చేసే స్వేచ్ఛ కల్పించాలి. జిల్లా స్థాయిలో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, తల్లిదండ్రుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి. ప్రైవేటుపాఠశాలల ఆదాయం వ్యయాలపై ప్రతి సంవత్సరం ఆర్థిక ఆడిట్ నిర్వహించి, నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై జరిమానాలు విధించడం, గుర్తింపు రద్దు చేయడం వంటి చర్యలు తీసుకోవాలి.ఫీజుల నిర్ణయంలో తల్లిదండ్రుల ప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక సదుపాయాలు, ఇంగ్లీష్ మాధ్యమం వంటి అవకాశాలను పెంచితే ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడటం తగ్గుతుంది. ఇలాంటి కఠిన చర్యలను ప్రభుత్వం తీసుకుంటేనే ప్రైవేటు బడుల్లో ఫీజులనియంత్రణకు ముక్కు తాడు వేసినట్టు అవుతుంది.'విద్యవ్యాపారం కాదు.. సామాజిక బాధ్యత' అనే భావనతో ప్రభుత్వం కఠిన నియంత్రణలు అమలు చేస్తేనే ప్రైవేటు బడుల్లో ఫీజుల మోతకు అడ్డుకట్ట పడుతుంది. విద్యార్థుల భవిష్యత్తు,తల్లిదండ్రుల ఆర్థికస్థితి రెండింటినీ కాపాడే విధానాలు అవసరం. విద్య వ్యాపార వస్తువు కాదు.అది సమాజాన్ని తీర్చిదిద్దే శక్తి.విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రైవేటు పాఠశాలల ఫీజుల విషయంలో సమతుల్యత అవసరం.విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థికస్థితి రెండింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం, విద్యాసంస్థలు,సమాజం కలిసి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది. ●

# స్పష్టతే న్యాయానికి నిజమైన బలం

తరిగోపుల నారాయణస్వామి

భారత పార్లమెంటు ద్వారా రూపొందించబడే ప్రతి చట్టం ప్రజల జీవన విధానంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. అయితే ఆ చట్టం ఎప్పటి నుంచి అమలులోకి వస్తుంది? 'ఎవరికి వర్తిస్తుంది?', గత ఘటనలకు కూడా వర్తిస్తుందా లేదా?' వంటి అంశాలు స్పష్టంగా చట్టంలో పొందుపరచబడకపోతే న్యాయవ్యవస్థలో, పరిపాలనలో, ప్రజల జీవితాలలో అనేక గందరగోళాలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యకు మూలకారణం చట్ట నిర్మాణ సమయంలో ప్రారంభ తేదీ, వర్తింపు పరిధులను అత్యంత స్పష్టంగా పేర్కొనకపోవడమే. ప్రజాస్వామ్యంలో చట్టం రూపొందించడం ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత.అందువల్ల ప్రతి చట్టంలో ఈ చట్టం ఫలానా తేదీ నుంచి అమలులోకి వస్తుంది. ఈ తేదీ తర్వాత జరిగే నియామకాలు, సంఘటనలు లేదా లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుంది అనే అంశాలను స్పష్టంగా పేర్కొనడం తప్పనిసరి చేయాలి. ఇది కేవలం సాంకేతిక అంశం కాదు, ప్రజల న్యాయ హక్కుల రక్షణకు సంబంధించిన మౌలిక అవసరం. చట్టంలో స్పష్టత లేకపోతే న్యాయస్థానాలు చట్ట ఉద్దేశ్యాన్ని విశ్లేషించి వ్యాఖ్యానించాల్సి వస్తుంది. కొన్ని సందర్భాలలో ఆ వ్యాఖ్యానాలు చట్టం అమలులోకి రాకముందు ఉన్న పరిస్థితులకు కూడా వర్తించేలా మారవచ్చు. దీనివల్ల ప్రజలు, ఉద్యోగులు, సంస్థలు అనిశ్చితికి గురవుతారు.ఉదాహరణకు విద్యా హక్కు చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయ అర్హత పరీక్ష అంశంపై అనేక న్యాయ వివాదాలు తలెత్తాయి. కొత్త అర్హతలు పాత నియామకాలకు వర్తిస్తాయా లేదా అనే ప్రశ్న కోర్టుల ముందుకు వెళ్లింది. చట్టం వర్తింపు పరిధి మరింత స్పష్టంగా ఉండి ఉంటే ఇలాంటి వివాదాలు చాలా వరకు నివారించబడేవి.అలాగే సమాచార హక్కు చట్టం, వస్తు సేవల పన్ను చట్టం, దివాలా చట్టం ఆధార్ చట్టం, వివిధ భూ సంస్కరణ చట్టాలు వంటిఅనేక చట్టాల అమలులో కూడా ప్రారంభదశలో వ్యాఖ్యాన భేదాలు,అమలు గందరగోళాలు,న్యాయ వివాదాలు కనిపించాయి. ఈ ఉదాహరణలన్నింటిలో ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. చట్టం ప్రారంభ తేదీ, వర్తింపు పరిధి, గతానికి వర్తింపు అంశాలు ఎంత స్పష్టంగా ఉంటే అంత తక్కువ వివాదాలు ఉంటాయి. స్పష్టత లేకపోతే కోర్టులు జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. దీనివల్ల సంవత్సరాల పాటు కేసులు కొనసాగి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇక్కడ మరో ముఖ్యమైన అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పటికే అమలులో ఉన్న కొన్ని చట్టాలలో ఈ విధమైన అనిశ్చితి లేదా సందిగ్ధత ఉంటే, ప్రజాప్రతినిధులు వాటిని అలాగే వదిలేయకుండా సవరణలు చేయాలి. అవసరమైతే చట్ట సవరణ ద్వారాఈ చట్టం ఫలానా తేదీ నుంచి అమలులో ఉన్నవారికే వర్తిస్తుంది, లేదా ఈ తేదీకి ముందు జరిగిన సంఘటనలకు వర్తించదు అనేస్పష్టమైన నిబంధనలను చేర్చాలి.ఇలా చేస్తే సంబంధిత వర్గాల ప్రజలు,ఉద్యోగులు,సంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోతాయి.అంతేకాకుండా న్యాయస్థానాలపై పడుతున్న భారం కూడా తగ్గుతుంది. ప్రజాస్వామ్యంలో మంచి చట్టం అంటే కఠినమైన చట్టంకాదు, స్పష్టమైన చట్టం. ప్రజలు, అధికారులు, న్యాయస్థానాలు ఒకే విధంగా అర్థం చేసుకునే చట్టమే ఉత్తమ చట్టం. అందువల్ల భవిష్యత్తులో రూపొందించే ప్రతి చట్టంలో ప్రారంభ తేదీ, వర్తింపు పరిధి, గతానికి వర్తింపుపై స్పష్టమైన నిబంధనలు తప్పనిసరి చేయాలి. అలాగే ఇప్పటికే ఉన్నసందిగ్ధ చట్టాలను సవరించి స్పష్టత తీసుకురావాలి. చట్టం ప్రజల కోసం ఉండాలి, ప్రజలను అయోమయంలో పడేయడానికి కాదు. స్పష్టతే న్యాయానికి నిజమైన బలం. ●

# 'కాక్రోచ్'ల అపర సృష్టి మస్క్‌దేనా?



సరికొండ రవీంద్రనాథ్

భారతదేశంలోనే కాదు యూరప్‌తోసహా అనేక దేశాల్లో కాక్రోచ్ పుట్టలను సృష్టించిన చరిత్ర ఎలాన్ మస్క్‌ది. పారిస్ నుంచి ఢిల్లీ వరకూ, బ్రస్సెల్స్ నుంచి మలేషియా వరకూ అన్నిదేశాలూ మస్క్‌వల్ల ఎదోరకమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. అనేక దేశాలు మస్క్ ఆన్‌లైన్ ఫ్లాట్ ఫాంలను నిషేధించాయి. ఎఐ వేదిక గ్రోక్ ద్వారా ప్రముఖుల అశ్లీల వీడియోలు చేసి అపఖ్యాతిపాలు చేయడం. ఇదే ఎలైన్ మస్క్ సోషల్ మీడియా ప్లాట్ ఫాంల అజెండా. ప్రముఖులు ఎప్పుడు తన దుష్ప్రచారానికి దొరుకుతారా అని ఎదురుచూస్తున్న మస్క్‌కు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ 'కాక్రోచ్' వ్యాఖ్యలు అవకాశంగా దొరికాయి. అయితే ఆయన తన ఉద్దేశ్యం గురించి వివరణ కూడా ఇచ్చారు. ఎక్స్ వేదికగా అభిజీత్ దీప్కే అకౌంట్ ఓపెన్ చేయడం రెండు లక్షల ఫాలోవర్స్ రావడం రాత్రికి రాత్రి జరిగిపోయింది. మొదట ఎక్స్‌లో కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో అభిజీత్ దీప్కే అకౌంట్ ఓపెన్ చేయగానే ఫాలోయర్లు రెండు లక్షల మందికి పెరిగిపోయారు. అసాధారణంగా ఫాలోయర్లు పెరగడం, మరో వైపు, వివాదానికి చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ కేంద్ర బిందువు కావడంతో భారత దేశ హోం శాఖ అప్రమత్తమై ముందు జాగ్రత్తగా అకౌంట్‌ను తాత్కాలికంగా సీజ్ చేయించింది. తర్వాత దీని వివరాలు తెలుసుకుని అకౌంట్‌ను కొనసాగించడానికి అనుమతించారు. కాక్రోచ్ జనతా పార్టీ సీజ్ కావడంతో కాక్రోచ్ ఈజ్ బ్యాక్ అనే పేరుతో ఎక్స్‌లోనే మరో అకౌంట్‌ను అభిజీత్ ప్రారంభించాడు. మస్క్ ఎక్స్ వ్యవహార శైలిపై ఇప్పటికే దేశంలో అనేక ఫిర్యాదులున్నాయి. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహించే పోస్టులను తొలగించాలని సహాయోగ్ సెన్సార్ విభాగం కోరినా మస్క్ ఎక్స్ ఖాతరు చేయలేదు. దీనితో మస్క్ ఎక్స్‌కు హోం శాఖ ఈ ఏడాది జనవరి రెండోతేదీన నోటీసులు జారీ చేసింది. ఆ కడుపు మంటతోనే మస్క్ కాక్రోచ్ ఉద్యమానికి భారీ ప్రచారాన్ని ఇచ్చినట్టు అనుమానిస్తున్నారు. భారత హోంశాఖ 'ఫేక్' ఫాలోయర్స్ పై విచారణ మొదలు పెట్టడంతో ఎక్స్‌పై ప్రభుత్వ చర్య ప్రారంభం అవుతుందన్న అనుమానంతో కావచ్చు. అకౌంట్‌ను ఇన్‌స్టాగ్రామ్‌కు మార్చారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పది రోజుల్లో రెండు కోట్ల మంది ఫాలోయర్స్ చేరారు. ఇది అసాధారణమైన పెరుగుదలగానే సైబర్ నిపుణులు భావిస్తున్నారు. సాధారణంగా కంపెనీల మార్కెటింగ్ కుట్రలు, కుతంత్రాలకు ఉపయోగించే బోట్ నెట్ వర్క్‌లు, ఎక్స్‌మేటా డేటా సెంటర్లు అల్ గోరథమ్స్ ప్రమోషన్ ద్వారా ఫేక్‌లతో ఫాలోయర్ల సంఖ్య అసాధారణంగా పెంచుతారు. ఎలాన్ మస్క్, ట్రంప్ లాంటి వారు కావాలనుకుంటే డేటా సెంటర్లలోనే ఆలోరిథమ్స్‌లో మాయ చేయడం కష్టమేమీ కాదు. ఇటువంటి కుట్రల కోసమే సోషల్ మీడియా ఫ్లాట్ ఫాంలను అమెరికా ఉపయోగించుకుంటోంది. బోట్ నెట్ వర్క్‌లు, ఆటో కంప్యూటరైజ్డ్ ప్రాసెస్ లేకపోతే పది రోజుల్లో కోటి నలభై



లక్షల 'వర్టికల్ గ్రోత్' సాధ్యం కాదని సైబర్ నిపుణుల అంచనా. దేశ రాజధానిలో జరిగిన కాక్రోచ్‌ల నిరసన ప్రదర్శన రెండు వాస్తవాలను తేటతెల్లం చేస్తోంది. ఒకటి ఇండిగో, నీట్ లాంటి జాతీయ విపత్తులు సంభవించినా భాధ్యులైన మంత్రులపై చర్యలు తీసుకోని ప్రధాని నరేంద్ర మోడీ మొండి స్వభావం.రెండు దేశంలోని కీలకమైన, సమస్యలను ఆధారం చేసుకుని అస్థిరత సృష్టించడానికి విదేశీ శక్తుల ప్రయత్నం. కోట్లాది మంది ప్రజలను క్షోభకు గురిచేసే పరిణామాలపై ప్రధాని నరేంద్ర మోదీ నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం తప్పున్నర.భావప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేయడం, ఇతర దేశ రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం, రాజకీయ నాయకులకు సంబంధించి, ప్రజలకు సంబంధిం చిన డేటా చోరీలు చేయడం ఎలాన్ మస్క్ అసలు వ్యాపారం. ఈ కారణంగానే ఆయన నడుపుతున్న ఎక్స్‌ఎఐ గ్రోక్ నును అనేక దేశాలు నిషేధించాయి. భారత ప్రభుత్వంతో కూడా మస్క్ ఎక్స్‌కు తీవ్రమైన విభేదాలున్నాయి. సోషల్ ప్రపంచ వ్యాప్తంగా ఎలెన్ మస్క్ హీనమైన, అరాచకమైన చర్యల గురించి కొంచెం మీడియాలతో బాటు అన్ని ఆన్ లైన్ ఛానల్స్‌లో ప్రసారం చేసే సమాచారాన్ని భారత ప్రభు త్వ సంస్థ సహయోగ్ సెన్సార్ చేస్తుంది. చట్ట, ప్రజావ్యతి రేక సమాచారం ఉంటే దీన్ని వెంటనే తొలగించమని సహ యోగ్ కోరుతుంది. సోషల్ మీడియాలకు, ఇతర సంస్థలకు నోటీసులు ఇస్తుంది. ఇలా నిబంధనలు విధించడం మస్క్‌కు ఇష్టం లేదు.ఎలాన్ మస్క్ టెస్లా, స్టార్లింక్ వంటి తన ఇతర వ్యాపారాలను భారత దేశంలోకి విస్తరించాలని భావిస్తున్నాడు. భారత రాజ్యాంగాన్ని గౌరవించని ఏ డిజిటల్ ఫ్లాట్ ఫాంను అనుమతించబోమని భారత్ తెగేసి చెప్పింది.భారత చట్టాలకు లోబడి పని చేస్తామని హామీ ఇచ్చిన తర్వాతనే మెటా, గూగుల్ వంటి ఇతర టెక్ దిగ్గజాలకు అనుమతు లొచ్చాయి. బ్లూటిక్ ప్రీమియం బాడ్జిల పేరుతో యూజర్లను మోసం చేస్తూండటంతో డిజిటల్ సర్వీసెస్ యాక్ట్ (డిఎస్ ఎ) కింద యూరోపియన్ యూనియన్ మస్క్‌కు 1500 కోట్ల రూపాయల జరిమానా విధించింది. వినియోగదారుల అనుమతి తీసుకోకుండా 6కోట్ల మందికి పైగా యూరోపియన్ వినియోగదారుల వ్యక్తిగత పోస్టులను మస్క్ గ్రోక్ చౌర్యం చేసింది. దీనిపై విచారణ జరుగుతోంది. ఎక్స్ అల్గారిథమిక్ మోసాలు, డీప్ ఫేక్లపై ఫ్రాన్స్, భారతదేశం, మలేషియా, టర్కీలలో విచారణ జరుగుతోంది. బాలల పోర్న్ వీడియోలు, ఎఐతో బ్లూ ఫిలింలు చేసి ప్రసారం చేయడం, హింసాత్మకమైన తీవ్రవాద సంస్కృతిని ప్రోత్సహించే వీడి యోలు ప్రసారం చేయడంపై కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. ఎంతో స్నేహితు లమని చెప్పుకునే అరబ్ దేశాలు కూడా మస్క్‌ఎక్స్‌ను తమ దేశాల్లో అడుగుపెట్టనీయడం లేదు, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాల్లో ప్రత్యక్షంగానే మస్క్ పాల్గొంటాడనే కారణంగానే అనేక దేశాలు ఎక్స్‌ను బహిష్కరిస్తున్నాయి. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# విధుల్లో నిర్లక్ష్యం నలుగురు సస్పెన్షన్

## ..మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన ఆదేశాలు



గుంటూరు, జూన్ 16, ప్రభాతవార్త ప్రతినిధి: నరసరావుపేటలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు సిబ్బందిపై మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన చర్యలు తీసుకున్నారు. యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహించిన ఇన్‌ఛార్జి ఏఈ వీరాంజనేయులుతో పాటు, ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమానికి హాజరుకాని ముగ్గురు బీఎల్‌వోలను సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## పెట్రోల్ బంకు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి

బాపట్ల, జూన్16, ప్రభాతవార్త, ప్రతినిధి: బాపట్ల జిల్లా కేంద్రం పురపాలక సంఘం ద్వారా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. బాపట్ల పట్టణం పరిధిలో పాత బస్టాండ్ కూడలి వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న పురపాలక సంఘం ద్వారా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకు నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్, ఆర్డీఓ లతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పురపాలక సంఘం ద్వారా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఈ పెట్రోల్ బంకు భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా నిర్మిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులకు పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ ఇక్కడ అందుబాటులో ఉంచాలన్నారు. బుధవారం నాటికల్లా పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం 2 ఏళ్ల పాలన సందర్భంగా నిర్వహించే నమ్మకం సభ కు సంబంధించి స్థలాన్ని పట్టణం పరిధిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం కమిషనర్ హసిని, ఆర్డీఓ హరి కుమార్, తహసిల్దార్ షేక్ షాలీమా, మున్సిపల్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.



**ప్రభుత్వ కార్యక్రమాల అమలులో సమన్వయంతో పనిచేయాలి...**

ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ సూచించారు. భూపరిపాలన, రెవెన్యూ శాఖలకు సంబంధించిన 22ఏ, వెబ్‌ల్యాండ్, రీసర్వే, పీజీఆర్ఎస్, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, సీజనల్ కండిషన్స్, నీట్ పరీక్షలు తదితర అంశాలపై సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో సీసీఎల్ఏ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి ్మ పాల్గొన్నారు. బాపట్ల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, జిల్లా వ్యవసాయ అధికారిణి ఎ. లక్ష్మి ్మ, మార్క్‌ఫెడ్ డీఎం కారుణశ్రీ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ డి. సాంబశివరావు, డీఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికగా మహిళా గ్రీవెన్స్ - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జూన్ 16, ప్రభాతవార్త :గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మహిళల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునేందుకు ప్రత్యేక వేదికగా మహిళా గ్రీవెన్స్‌ను నిరంతరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళల నుంచి ప్రధానంగా గృహ హింస, వేధింపులు, విద్య, ఉపాధి, ఆరోగ్యం, స్థానిక అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ఇప్పటివరకు వచ్చిన సమస్యల్లో దాదాపు 80 శాతం సమస్యలకు పరిష్కారం అందించామని, ప్రతి వారం వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా ప్రత్యేక బృందం పనిచేస్తోందని తెలిపారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో వికాస్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తోందని, స్వర్ణాంధ్ర2047 లక్ష్యంతో అభివృద్ధి, ఉపాధి, విద్య, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గత రెండేళ్లలో రహదారులు, పారిశుధ్యం, డ్రైనేజీ, స్ట్రీట్ లైటింగ్, ఆరోగ్య సదుపాయాలు, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. సుమారు 1,500 మందికి జాబ్ మేళాల ద్వారా ఉద్యోగాలు కల్పించామని, రూ.500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మహిళా గ్రీవెన్స్, కార్యకర్తల గ్రీవెన్స్, ప్రజా గ్రీవెన్స్, ఫీల్డ్ విజిట్ల ద్వారా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.



## అభాగ్యులు, ఆపన్నులకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోంది

గుంటూరు, జూన్ 16, ప్రభాతవార్త :గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం రూ.13 లక్షల విలువైన 17 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి అభాగ్యులు, ఆపన్నులకు అద్భుతమైన చేయూతగా నిలుస్తోందని అన్నారు. వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపశమనం కలిగిస్తోందని తెలిపారు. సహాయనిధి చెక్కులు అందుకున్న ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ముఖ్యమంత్రి సహాయనిధి, ఎన్టీఆర్ వైద్య సేవల అమలుపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఆసుపత్రి బిల్లుల చెల్లింపులను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు అవసరమైన వారికి సహాయనిధి చెక్కులు త్వరితగతిన అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటివరకు 597 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.8 కోట్ల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రాణాలకు సంబంధించిన అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని, ఇలాంటి సంక్షేమ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి లబ్ధిదారుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.




## బీ.ఎల్.ఓలు బాధ్యతగా వ్యవహరించాలి

గుంటూరు, జూన్ 16, ప్రభాతవార్త : గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో బూత్ లెవల్ ఆఫీసర్లు బీ.ఎల్.ఓలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా కృషి చేయడంతో పాటు, నిరక్షరాస్యులు మరియు అవగాహన లేని వారికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో బీ.ఎల్.ఓ ద్వారా ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్వయంగా తమ ఎన్యుమరేషన్ ఫారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన రాజ్యాంగబద్ధ హక్కు అని, ప్రజలు సార్ ప్రక్రియకు పూర్తి స్థాయిలో సహకరించి తమ ఓటును పదిలపరచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి సందేహాలు లేదా ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు అండగా తెలుగుదేశం పార్టీ నాయకులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అవసరమైతే తన క్యాంప్ కార్యాలయాన్ని కూడా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ప్రతి అర్హుడి ఓటు జాబితాలో కొనసాగడం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో అవసరమని, ఈ ప్రక్రియను విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.

## హిందూ ఫార్మసీ కళాశాలలో నూతన విద్యా విధానం పై అధ్యాపకులకు శిక్షణ

గుంటూరు విద్య జూన్ 15 ప్రభాతవార్త: హిందూ ఫార్మసీ కళాశాలలో అధ్యాపకులకు ఇంటర్నల్ క్వాలిటీ ఆ న్సూ రెన్స్ సెల్ (ఐ క్యు ఎ సి) ఆధ్వర్యంలో స్వల్ప కాలిక శిక్షణా కార్యక్రమం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం తెలిపారు. ఈ ఫాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రాంనకు ముఖ్య వక్త గా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా కమిషనరేట్ డాక్టర్ కోగంటి విజయబాబు విచ్చేసి ఎన్ ఈ పి ఖి మరియు ఫలితాల ఆధారిత పాఠ్యప్రణాళిక అమలుఖి అనే అంశం పై ప్రసంగించారు. ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ మెడలీన హంటర్ ప్రతిపాదించిన పాఠ్య ప్రణాళిక మరియు రూపకల్పన గురించి వివరించారు. ఈ కార్యక్రమమునకు వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మాడి, డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య కళాశాల సిబ్బంది మిస్టర్ ఎం. శ్రీధర్ తదితరులు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతంగా జరగటానికి సహకరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు , మరియు కార్యదర్శి డాక్టర్ ఎస్. మధుసూదన రావు ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ కోగంటి విజయబాబు ని శాలువా మరియు మొమెంటో తో సత్కరించారు.



# గుంటూరు వార్త



## ఆర్టీసీ బస్టాండులో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

గుంటూరు జూన్ 16 ప్రభాత వార్త ప్రతినిధి : గుంటూరు ఆర్టీసీ బస్టాండును జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ కల్పిస్తున్న కనీస వసతులు, పరిశుభ్రతను , వివిధ బ్లాక్ లను పరిశీలించారు. బస్టాండ్ ఆవరణలోని మరుగుదొడ్లు, త్రాగునీటి కుళాయిలను, దుకాణాలను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ బస్టాండ్ లోపల, బయట




వాతావరణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండాలని; సురక్షితమైన తాగునీరు అందించాలని , పరిసరాలు బాగుంటేనే ప్రజలు నమ్ముతారని స్పష్టం చేశారు. మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్ల నిర్వహణను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, అన్ని కుళాయిలు పని చేసేలా చూడాలని ఆదేశించారు. జూలై నెలాఖరు నాటికి టాయిలెట్స్ లో కొత్త టైల్స్ అమర్చాలన్నారు. అలాగే ప్లాస్టిక్ టాప్ లను తొలగించి స్టీల్ టాప్ లను ఏర్పాటు చేయాలని ఆర్ టీ సీ , ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. బస్టాండ్ అంతటా తగినన్ని డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ ప్రాంగణంలోని హోటళ్లు, క్యాంటీన్లలో టీ, వాటర్ బాటిళ్లు, ఇతర వస్తువుల విక్రయాలను, వాటి నాణ్యతను తనిఖీ చేసి, హోటళ్లను పూర్తి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

## ఎరువుల కొరత రాకుండా స్పెషల్ టాస్క్ ఫోర్స్

### జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ

గుంటూర, జూన్ 16 ప్రభాత వార్త ప్రతినిధి : జిల్లాలో రైతులకు యూరియా, డీఏపీ తదితర ఎరువుల కొరత రాకుండా జిల్లా, మండల స్థాయిలలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సాయికాంత్ తెలిపారు. కలెక్టరేట్లో జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎరువుల నిల్వలు, పంపిణీ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షిస్తూ అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ఎరువులు అందలేదని ఏ ఒక్క రైతు నుండి ఫిర్యాదు వచ్చినా, సంబంధిత అధికారుల పై కఠిన చర్యలు ఉంటాయన్నారు. రెవిన్యూ, వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు ప్రతి మండలంలో సమావేశం నిర్వహించి యూరియా సక్రమ పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు.



## కూటమి ప్రభుత్వం పాలనలోనే ప్రజల సంక్షేమం:మంత్రి అనగాని

రేపల్లె, జూన్ 16, ప్రభాతవార్త:రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి దృష్టితో కూటమి ప్రభుత్వం పాలన సాగుతున్నదని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. పట్టణంలోని ఎంసిఎ హాలులో మంగళవారం కూటమి ప్రభుత్వం రెండేళ్ళ నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అభివృద్ధి పరంగా 30 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిపోయామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడ



భవిష్యత్‌కు పునాది వేసే విధంగా నిరంతరం శ్రమించడం ప్రజల అదృష్టమన్నారు. దోచుకో దాచుకో అనే విధంగా వైసీపీ పాలన కొనసాగిందని ఆయన విమర్శించారు. పొదుపు సంఘాలకు పునాదులు వేసిన ఘనత చంద్రబాబుదేనని ఆయన తెలిపారు. గొడ్డలిపార్టీ అధ్యక్షుడు విధ్వంసకరమైన పరిపాలన చేసి రూ.లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్ళిపోయాడని ఆయన ఆరోపించారు. సూపర్ 6 పథకాల గురించి చెప్పినప్పటికీ 100 పథకాలను అమలు చేశామని చెప్పారు. ఆస్తులకు భంగం కలిగించే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా విధి విధానాలను రూపొందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. పాసుపుస్తకాలు, సరిహద్దు రాళ్ళపై ఉన్న సైకో జగన్ బొమ్మలను తొలగించి 24 లక్షల ప్రభుత్వ రాజముద్రతో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తి ప్రజల ఆస్తులకు భరోసా కల్పించామని చెప్పారు. గత వైకాపా పాలనలో నిర్వీర్యమైన రెవెన్యూ వ్యవస్థను సంస్కరణలతో బలోపేతం చేసి ఆన్‌లైన్ ద్వారా పారదర్శక సేవలను అందుబాటులోకి తెచ్చామని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని 6 కోట్ల ప్రజలకు భవిష్యత్‌పై నమ్మకం, అభివృద్ధిపై ఆశ కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని సత్యప్రసాద్ వివరించారు. రాబోయే రోజులలో రేపల్లె ప్రాంతంలోనే ఉద్యోగాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, కూటమి నాయకులు అన్నాబత్తుని జయలక్ష్మి, సలగల రాజశేఖరబాబు, అనగాని శివప్రసాద్, పంతాని మురళీధర్, జి.వి.నాగేశ్వరరావు, ఎం.రామకృష్ణ, ఎం.భాస్కరరావు, వి.వెంకటేశ్వరరావు, కొలసాని రాము, టి.ఏడుకొండలు, రేపల్లె రామాంజనేయులు, రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపిడివో సిహెచ్.రవిబాబు, సిడిపివో ఎం.సుచిత్ర, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మెగా డిఎస్సి మీద వస్తున్న ఆరోపణల పై హైకోర్టు సిట్టింగ్ జడ్జి చే న్యాయ విచారణ జరిపించాలి

గుంటూరు విద్య జూన్ 15 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డి ఎస్ సి 2025 లో అక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయాని, అభ్యర్థులు నుండి లక్షలాది రూ.. వసూలు చేసారని, దీని వెనుక రాష్ట్ర మంత్రులు ఎం ఎల్ ఏ ల హస్తం ఉన్నదని , కోట్ల రూపాయలు చేతులు మారాయని వస్తున్న పలు అవినీతి ఆరోపణలు పైన సిట్టింగ్ హై కోర్టు జడ్జి లేదా సిబిఐ చే న్యాయవిచారణ జరిపించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి. కృష్ణ స్వరూప్ డిమాండ్ చేసారు. ఈ సందర్బంగ జరిగిన మీడియా సమావేశం లో మాట్లాడుతూ.. డి ఎస్ సి నిర్వహణ తుది జాబితా ప్రకటన మీద ఆరోపణలు వస్తున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు విచారణ చేయటం లేదని ప్రశ్నించారు. విచారణ జరిగితే రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ప్రమేయం బయటకు వస్తుందన గుబులు తో రాష్ట్ర సర్కార్ ఉన్నదన్నారు. డీఎస్సీ లో అవినీతి అక్రమాలు జరిగాయని ఆరోపణలు వస్తునందున తక్షణం విచారణ జరిపించాలని కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు.

# ఖరీఫ్‌కు సమాయత్తం

## పొలం పనులపై దృష్టిపెట్టిన రైతులు: ముందస్తు పత్తిపంట సాగు

కారంపూడి, జూన్ 16 ప్రభాతవార్త: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పొలం పనులపై దృష్టిపెట్టారు. మండలంలో సుమారు 12,500 హెక్టార్ల సాగుభూమి ఉంది. ఈ ఏడాది వర్షాలు సానుకూలంగా ఉంటాయని వాతావరణ శాఖ తెలపడంతో రైతులు ఖరీఫ్‌కు సమాయత్తం అయ్యారు. ఇప్పటి వరకు ఎండలు ఎక్కువగా ఉండటంతో ఇళ్లకే పరిమితమైన రైతులు వర్షాలు కురుస్తుండటంతో పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. మే నెలలోనే రైతులు 2 వేల హెక్టార్లలో పత్తిపంట సాగు చేశారు.



మండలంలో ప్రధానంగా వరి, మిర్చి, కంది, పత్తి పంటలనఉ సాగు చేస్తుండగా గతేడాది వరిగ, మొక్కజొన్న పంటలపై దృష్టిపెట్టారు. మిర్చికి తగినంత గిట్టుబాటు ధర ఉన్నప్పటికీ దోమ, బొబ్బర ముడత వస్తుందని మొక్కజొన్నకు ప్రాధాన్యత ఇచ్చారు. సాగర్ కుడి కాలువ నీరు సాగుకు ఇస్తే వరి



పంట సాగు చేయడానికి రైతులు సిద్ధమవుతునానరు. రుతుపవనాలు కూడా రాష్ట్రంలోనికి ప్రవేశించడంతో సాగర్ జలాశయానికి పుష్కలంగా నీరు వస్తే నీటి విడుదలకు జలవనరుల శాఖ సిద్ధంగా ఉంది. ప్రస్తుతం తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశారు.

**నకిలీ విత్తనాలు అరికట్టాలి:** నకిలీ విత్తనాలపై వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అందించాలని రైతు సంఘం నేతలు కోరుతున్నారు.

**సబ్సిడీపై విత్తనాలు:** ఈ ఏడాది రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించనున్నట్లు వ్యవసాయశాఖ అధికారి పోట్ల నరసింహారావు తెలిపారు. జీలుగలు, పిల్లిమిసర, జనుము అందించనున్నట్లు తెలిపారు. రైతులు వినియోగించుకోవాలని కోరుతున్నారు.

## యార్డులో మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

### మిర్చియార్డు చైర్మన్ అప్పారావు

గుంటూరు జూన్ 16 ప్రభాత వార్త ప్రతినిధి :గత ప్రభుత్వ హయాంలో గుంటూరు మిర్చి యార్డులో డ్రైనేజి వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు, వ్యాపారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు పేర్కొన్నారు. వర్షాకాలంలో యార్డు ప్రాంగణంలో నీరు నిల్వ ఉండి రాకపోకలకు ఆటంకం కలగడంతో పాటు పారిశుధ్య సమస్యలు



తలెత్తుతున్న నేపథ్యంలో చైర్మన్ మంగళవారం యార్డులో పర్యటించి డ్రైనేజి వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించారు. కాలువలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించి సమస్యలను గుర్తించిన ఆయన, యార్డులో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కాలువల శుభ్రత, మరమ్మత్తు పనులను వేగవంతంగా చేసి రైతులు, వ్యాపారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని, యార్డులో ఉన్న మౌలిక వసతుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా చైర్మన్ తెలిపారు. గుంటూరు మిర్చి యార్డును పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని, రైతుల సంక్షేమం , వ్యాపారుల సౌకర్యాలకే తమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు.

## విజిబుల్ పోలీసింగ్

గుంటూరు క్రైమ్, జూన్16, ప్రభాతవార్త: గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లాలో రాత్రి వేళల్లో విజిబుల్ పోలీసింగ్‌ను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గుంటూరు టోల్‌గేట్ సమీపంలో ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులు, రద్దీ ప్రాంతాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గుంటూరు జిల్లా పోలీసులు నిరంతరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది జాతీయ రహదారులపై ప్రయాణిస్తున్న లారీలు, బస్సులు మరియు ఇతర వాహనాలను నిలిపి, డ్రైవర్లకు కొద్దిసేపు విశ్రాంతి కల్పిస్తూ, నీటితో ముఖం కడిగించి అప్రమత్తం చేస్తున్నారు. అలసటతో డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉండటంతో“స్టాప్ వాష్ అండ్ గో” కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాత్రి సమయంలో ప్రయాణించే డ్రైవర్లు అలసటగా అనిపించినప్పుడు వాహనాలను సంబంధిత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. రోడ్డు మార్జిన్‌లో వాహనాలు నిలిపివేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, అటువంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అలాగే, అతి వేగంగా వాహనాలు నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, అధిక ప్రయాణికులతో వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.

## అమర్నాథ్ గౌడ్ కు నివాళులర్పించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 16, ప్రభాతవార్త :వైసీపీ ప్రభుత్వంలో పదేళ్ల బాలుడు పదో తరగతి బాలుడు అమర్నాథ్ గౌడ్ హత్య వైసిపి పతనానికి నాంది పలికిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. వైసీపీ హయాంలో హత్యగావించబడిన అమర్నాథ్ గౌడ్ మృతి చెంది మూడేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక బస్టాండ్ ఎదురుగా గల గౌత లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు జరిగిన తీవ్ర అన్యాయం ప్రతి గుండెనూ ఇప్పటికీ కలచి వేస్తోందన్నారు. తన సోదరిపై వైసీపీ నేత వేధింపులు ప్రశ్నించిన పదో తరగతి బాలుడు అమర్నాథ్ గౌడ్ పై పెట్రోల్ పోసి పాశవికంగా హత్య చేయడం దారుణమన్నారు. బీసీ వర్గాల పట్ల వైసిపి వైఖరికి ఈ దుర్మార్గపు చర్య అద్దం పడుతుందన్నారు.



## 20 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 16, ప్రభాతవార్త :పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ సంజీవనిగా మారిందని గుంటూరు తరపు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసిర్ అన్నారు. మంగళవారం గుంటూరు తూర్పు కార్యాలయంలో 51 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.20 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే నసీర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో అందిస్తున్నామని తెలిపారు. స్థానిక మా కార్యాలయంలో 51 మంది లబ్ధిదారులకు 20 లక్షల రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశాం. అనుకోని అనారోగ్యం కుటుంబాన్ని కుంగదీసిన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలిచిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు రూ.11 కోట్లకుపైగా విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందించామని తెలిపారు. ఇది పేద ప్రజల ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని చెప్పారు. రాష్ట్రానికి తలమానికంగా ఉన్న గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ కు తలదన్నేలా చేశామని తెలిపారు. ప్రభుత్వం నిధుల కేటాయింపుతోపాటు దాతల సాయంతో అన్ని వార్డులను బలోపేతం చేస్తున్నామన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## ఉద్యోగంతోనే సమాజంలో గుర్తింపు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 16, ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం తమ ఉజ్వల భవిష్యత్ కోసమే కంపెనీలు, సంస్థలతో కలిసి జాబ్ మేళాలతో ఉపాధి కల్పిస్తోందనే వాస్తవాన్ని యువత గ్రహించాలని, ఎక్కువ జీతభత్యాలు ఆశించకుండా, ముందు జీవితాలు చక్కదిద్దుకునే ఆలోచన చేయాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, తన సహాయ సహకారాలతో స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్ లో ఏర్పాటుచేసిన ఏపీఐఐసీ మెగా జాబ్ మేళాను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి ప్రత్తిపాటి మంగళవారం ప్రారంభించారు. అనంతరం మేళాకు హాజరైన యువతీ యువకులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.



అనంతరం కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగంతోనే యువతకు గుర్తింపు, గౌరవం.. పోటీ ప్రపంచంలో గెలిచే దిశగా జిల్లా యువత తమ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, అందివచ్చే ఎలాంటి అవకాశాన్ని అయినా సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాటి యువతకు సూచించారు. ఉద్యోగంతోనే జీవితానికి గుర్తింపు, విలువ, సమాజంలో గౌరవంతో పాటు పేరు ప్రతిష్టలు ఉంటాయనే నిజాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని, కలలను గమనించి, సమయాన్ని వృథా చేయకుండా యువత ముందుకు సాగాలని ప్రత్తిపాటి సూచించారు. నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టాలని, అప్పుడే వారి జీవితాలకు ఉద్యోగ భద్రత లభిస్తుందని ప్రత్తిపాటి సూచించారు. పెద్ద ఎత్తున ప్రభుత్వం తీసుకొచ్చే పెట్టుబడులు, పరిశ్రమలతో రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రత్తిపాటి చెప్పారు. ముఖ్యమంత్రి కష్టం, మంత్రి లోకేశ్ వినూత్న ఆలోచనలతోనే 23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. 25 లక్షల ఉద్యోగాలు అందించే దిశగా ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోందని, ఆ లక్ష్యం పూర్తైతే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యే ఉండదని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై పారిశ్రామిక వర్గాల్లో ఉన్న సానుకూల దృక్పథం, విశ్వసనీయత వల్లే పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం మేటిగా నిలుస్తోందన్నారు. నేటి జాబ్ మేళాకు టెక్ మహీంద్రా, జోయ్ అలుక్కాస్, కియా మోటార్స్, హెటిరో డ్రగ్స్, టాటా ఎలక్ట్రానిక్స్, ఫ్యూచర్ ఐటీ సొల్యూషన్స్, డిక్సన్, టాటా కేపిటల్, రిలయన్స్, జియో, బ్యాంక్ఆఫ్ బరోడా, ఎంఆర్ఎఫ్ వంటి ప్రఖ్యాత కంపెనీల రావడం శుభ పరిణామమని, యువతకు మంచి ఉపాధిఅవకాశాలు లభిస్తాయని ప్రత్తిపాటి ఆశాభావం వ్యక్తం చేశారు.జగన్ విధ్వంస ఆలోచనలే రాష్ట్ర ప్రగతికి అడ్డుగోడలు జగన్..ఆయన పార్టీ రాష్ట్రానికి ప్రమాదకరంగా మారారని విధ్వంసపు ఆలోచనలతో రాష్ట్ర ప్రగతికి అడ్డుగోడలుగా తయారయ్యారని,, నిరుద్యోగుల కలలను నిజం చేస్తున్న ప్రభుత్వంపై వారు చేస్తున్న దుష్ప్రచారాన్ని యువత తిప్పికొట్టాలని ప్రత్తిపాటి సూచించారు. జగన్ తన ఎన్నికల ప్రచారానికి వాడుకున్న మెగా డీఎస్సీ కలను లోకేశ్ కేవలం ఏడాదిలోనే డీఎస్సీ నియామక ప్రక్రియను పూర్తి చేసి తన సమర్థత నిరూపించుకున్నాడని ప్రత్తిపాటి పేర్కొన్నారు. జగన్ విధ్వంస పంథా, ఆయన పార్టీ ఆలోచనలు మారకపోతే వచ్చే ఎన్నికల్లోనూ వైసీపీకి 2024 ఫలితాలే మిగులుతాయన్నారు. జగన్ రాష్ట్ర యువతను మత్తుకు బానిసల్ని చేసి, వారి జీవితాలను చీకట్లపాలు చేశాడని, ఏపీని గంజాయి, మాదకద్రవ్యాలకు కేరాఫ్ గా మార్చాడని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే నెలలో దివ్యాంగులకు ప్రత్యేక జాబ్ మేళా : కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా గత రెండేళ్లలో నియోజకవర్గంలో 1500 మంది నిరుద్యోగులకు కంపెనీల ఆఫర్ లెటర్లు వచ్చాయని, 600 మంది ఉద్యోగాల్లో చేరారని, నేటి జాబ్ మేళాలో 2000కు పైగా ఉద్యోగాలకు అర్హులను ఎంపిక చేయడం జరుగుతోందని పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా పేర్కొన్నారు. ఈ రెండేళ్లలో జిల్లాలో 6,500 ఉద్యోగాలు భర్తీ చేసినట్టు ఆమె చెప్పారు. వచ్చే నెలలో దివ్యాంగులకు ప్రత్యేక జాబ్ మేళా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. నైపుణ్య పోర్టల్ లో యువత తమ వివరాలు నమోదు చేసుకొని మంచి ఉద్యోగాలు పొందాలని ఆమె సూచించారు.కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, ఎమ్మార్వో వేణు గోపాలరావు, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, టీడీపీ నాయకులు బత్తినేని శ్రీనివాసరావు, కొత్త కోటేశ్వరరావు, షేక్ మస్తాన్ వలి, మురకొండ మల్లిబాబు, నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారులు తమ్మాజీ రావు, రామాంజనేయులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాటిని కలిసిన కనమర్లపూడి రమేష్



చిలకలూరిపేట, జూన్ 16, ప్రభాతవార్త: ఇటీవల ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో నిర్వహించిన వైశ్య లైంలైట్ కార్యక్రమంలో మోస్ట్ పాపులర్ మెన్ అవార్డుకి విజేతగా గెలుపొందిన చిలకలూరిపేట పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు కనమర్లపూడి రమేష్ అవార్డు తీసుకున్న అనంతరం శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును ఆయన స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది, ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు అవార్డు సాధించిన రమేష్‌ను దుస్సాలువతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియచేసారు...

## 'మన ఊరి ఐరా సందడి' పోస్టర్ ఆవిష్కరణ

చిలకలూరిపేట, జూన్ 16, ప్రభాతవార్త: ప్రముఖ యూట్యూబ్ ఛానల్ ఐరా నూతనంగా నిర్వహిస్తున్న మన ఊరి ఐరా సందడి పండగ చేసుకో ప్రోగ్రాం పోస్టర్‌ను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆవిష్కరించారుర. త్వరలో చిలకలూరిపేట నియోజకవర్గంలో ఈ ప్రోగ్రాంను ఎంతో గ్రాండ్ గా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.




## సిఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి: ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట, జూన్ 16, ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడి రెండు సంవత్సరాల అయిన సందర్భంగా పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణములోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన విజయోత్సవ లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ...ప్రభుత్వం గత రెండు సంవత్సరాల కాలంలో చాలా అద్భుతాలు చేసింది. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ఈ రాష్ట్రాన్ని



గతంలో జరిగిన విధ్వంసం నుండి అభివృద్ధిలో పయనింప చేయడం జరుగుతోంది. అమరావతిని ఏ రకంగా నాశనం చేయాలా అని చెప్పి జగన్ మోహన్ రెడ్డి గారు కంకణం కట్టుకోవడం మనం అందరం చూసాం.2019 నుండి 24 దాకా ఇష్టారాజ్యంగా ఇబ్బందులు పెట్టి అమరావతిలో అభివృద్ధి కార్యక్రమాలు అన్నీ కూడా నిలువరించడం జరిగింది. మూడు రాజధానులు అన్నాడు ,అమరావతి మునిగిపోయిద్ది అన్నాడు ఇలా రకరకాలుగా రెచ్చగొట్టడానికి ప్రయత్నం చేయడం జరిగింది. అమరావతి అభివృద్ధి చెందితే అన్ని జిల్లాలకు ఇక్కడనుండి అభివృద్ధి ఫలాలు అందుతాయని రాష్ట్రమంతా అభివృద్ధి చెందుతుందని అనే ఉద్దేశం తోటి దాన్ని జరగనీయకూడదని ఆనాడు జగన్మోహన్ రెడ్డి అన్ని రకాలుగా కూడా ఇబ్బంది పెట్టడం కోసం ప్రయత్నం చేస్తే, అక్కడున్న మహిళలు గానీ, రైతులు గానీ అందరూ కూడా ఎన్నోఉద్యమాలు చేశారు. 2024లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయినాక అద్భుతమైనటువంటి కట్టడాల నిర్మాణం జరుగుతూ ఉన్నాయన్నారు. లక్షల కోట్ల రూపాయలతో అభివృద్ధి జరుగుతూ ఉంది. రాజధానిగా ఉన్న అమరావతిని మార్చే కుట్రలకు ఇక అవకాశం లేకుండా ఆంధ్ర రాష్ట్రానికి అమరావతిని శాశ్వత రాజధానిగా చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్ ఉభయ సభలలో దానిని చట్ట రూపంలో తీసుకువస్తే, మరలా జగన్మోహన్ రెడ్డి మావిగన్ అంటున్నారని. ఆయన యొక్క ఉద్దేశ్యం అమరావతిలో ఎవరు పెట్టుబడి పెట్టకూడదు, అభివృద్ధి జరగకూడదు అనేది ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ,జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా ,పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు , జిల్లా శాసనసభ్యులు, జిల్లా అధ్యక్షులు షేక్ జానీసైదా ,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 10వ వార్డు 167బూత్ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

చిలకలూరిపేట, జూన్ 16, ప్రభాతవార్త: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా 10వ వార్డు పరిధిలోని 167 పోలింగ్ బూత్ పరిధిలో బూత్ లెవల్ ఆఫీసర్ తో కలసి వెరిఫికేషన్ ఫారం లను ఇంటింటికి తిరిగి పంపిణీ చేసి వివరాలను ఎలా నమోదు చేయాలో వివరిస్తున్న టీడీపీ బూత్ లెవల్ ఏజెంట్ లు .బూత్ కన్వీనర్ పాల్గొన్నారు.



## ఉప్పలపాడులోని జగనన్న కాలనీలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్

నరసరావుపేట క్రైమ్, జూన్ 16 ప్రభాతవార్త : స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన మరియు నేర నియంత్రణ కోసం పోలీసులు కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు మంగళవారం నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో డీఎస్పీ ఎం.హనుమంతరావు పర్యవేక్షణలో పోలీసులు సోదాలు నిర్వహించారు. సంఘవ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురి చేసే వారిని గుర్తించి ప్రజలకు మేమున్నాము అనే భరోసా కల్పిస్తూ కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం చేపట్టడం జరిగింది. పోలీసు అధికారులు మరియు సిబ్బంది బృందాలుగా ఏర్పడి రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, పాత కేసులు ఉన్న నిందితులపై ప్రత్యేక నిఘా పెట్టారు. వారి ఇళ్లు, పరిసర ప్రాంతాలలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల సందర్భంగా జగనన్న కాలనీలో సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు 29 స్వాధీనం చేసుకున్నారు. పోలీసు అధికారులు ప్రజలతో సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కాలనీలో ఉన్న పరిస్థితుల గురించి డీఎస్పీ హనుమంతరావు ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించి, మాదక ద్రవ్యాల వినియోగం వలన జరిగే అనర్థాల గురించి వివరించారు. కాలనీ లో అపరిచిత వ్యక్తులు ఎవరైనా ఉన్న పక్షంలో 112 కు కాల్ చేయాలని తెలిపారు. గ్రామం లోని రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, అనుమానితులు మరియు పాత కేసులలోని నిందితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో అకారణంగా గొడవలు సృష్టిస్తే సహించేది లేదని, ఏ చిన్న సమస్య ఉన్న పోలీసు వారి దృష్టికి తీసుకురావాలని కోరారు. గొడవలు సృష్టించే వారి మీద జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట 1వ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ షేక్.టి.ఫిరోజ్, 2వ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ప్రభాకర్, రూరల్ సర్కిల్ సిఐ సుబ్బారావు, ఎస్ ఐలు కిషోర్, శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## స్మార్ట్ వ్యవసాయంతో రైతులకు సాంకేతిక భరోసా: ఎమ్మెల్యే అరవింద బాబు

నరసరావుపేట, జూన్ 16 ప్రభాతవార్త : వ్యవసాయాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానిస్తూ రైతుల ఆదాయాన్ని పెంచడం, సాగు ఖర్చులను తగ్గించడం, నీటి వనరులను సమర్థంగా వినియోగించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని హెచ్6 ఇన్ హోటల్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన "స్మార్ట్ అగ్రి కస్టమర్ మీట్"లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవానికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని వివరించారు. రైతుల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని, ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూగర్భ జలాల అభివృద్ధి, ఆధునిక సాగు పద్ధతుల ప్రోత్సాహం, డిజిటల్ వ్యవసాయ సేవల విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లాలో రైతులకు ఎస్‌బీఐ గణనీయ స్థాయిలో ఆర్థిక సహకారం అందిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జిల్లాలో రూ.100 కోట్లకు పైగా వ్యవసాయ రుణాలు అందించడంతో పాటు, సాఫ్ట్ అగ్రి టెక్ భాగస్వామ్యంతో మరో రూ.200 కోట్ల రుణాలు మంజూరు చేయడం రైతు రంగానికి ఊతమిచ్చే చర్యగా అభివర్ణించారు. రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కృష్ణా-గోదావరి నదుల అనుసంధాన ప్రాజెక్టును ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో చేపట్టిందన్నారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రవికుమార్ సేవలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అభినందించారు.



## బొందిలి కులాన్ని ఓబీసీ లో చేర్చాలని వినతి



నరసరావుపేట టౌన్,జూన్ 16 ప్రభాతవార్త : తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం నందు బీసీ డెడికేటెడ్ కమీషన్ చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రా కు బొందిలి కులాన్ని కేంద్రం ఓ.బి.సి లో చేర్చాలని నాయకులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో క్షతి రఘునాథ్ సింగ్ , శ్రీనివాస్ సింగ్, బట్టు ఏడు కొండలు, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర బొందిలి కార్యనిర్వహక కార్యదర్శి బొంది లి శ్రీనివాస్ సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభా లో బొందిలి కులం సుమారు 3 లక్షల మంది ఉన్నారని తెలిపారు.దామాషా ప్రకారం ఒక ఎమ్మెల్యే స్థానం లేదన్నారు.ఎమ్మెల్సీ నైనా కేటాయించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 33 రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

## రాష్ట్ర వ్యాప్తంగా ట్రాన్స్‌పోర్ట్ వాహనాల శిక్షణా సంస్థలు అర్ధాంతరంగా నిలిపివేతతో సమస్యలు

నరసరావుపేట క్రైమ్,జూన్ 16 ప్రభాతవార్త : రవాణాశాఖా ఉన్నతాధికారులు హఠాత్తుగా ఈ నెల 10 వ తేదీన ట్రాన్స్పోర్ట్ వాహనాల శిక్షణ ఇచ్చే సంస్థల లో బయో మెట్రిక్ ద్వారానే శిక్షణ తీసుకునే వారు హాజరు లో (పరి వాహన సారథి) వాహనాలు 15 సంవత్సరాలు దాటినవి అని కారణం చూపుతూ నిలుపుదల చేయడం జరిగిందని రోడ్డు సేఫ్టీ ఎన్జీవో అధ్యక్షులు ఆర్కే దుర్గ పద్మజ అన్నారు. ఈ అంశంపై ముందస్తు సమాచారం కానీ సమయం కానీ ఇవ్వకుండా ఈ విధముగా నిలుపుదల చేయడం తగదన్నారు. హెవీ వాహనాలు డ్రైవింగ్ శిక్షణ ఇచ్చే సంస్థల యజమానులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి హెవీ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు స్థాపించిన వారి పట్ల రవాణా శాఖ ఉన్నతాధికారులు రాత్రి రాత్రికి ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. మరోక్రప్రక్క స్వయం ఉపాధి కోసమే హెవీ డ్రైవింగ్ శిక్షణ మరియు లైసెన్స్ కొరకు ఎదురుచూసే యువతకు దారి తేన్ను లేకుండా పోయిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హెవీ డ్రైవింగ్ శిక్షణ ఇచ్చే సంస్థలు 95 మూతపడ్డాయి. ఈ అంశంపై రోడ్డు సేఫ్టీ ఎన్జీవో సంస్థలు రవాణా శాఖ అధికారులకు మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి తమ లేఖ ద్వారా ఈ అంశాన్ని వివరించి అర్ధాంతరంగా హెవీ డ్రైవింగ్ శిక్షణ సంస్థలపై విధించిన లాక్ ను తొలగించి కనీసం ఒక మూడు మాసాలు వాహనాలను మార్చుకోవటానికి అవకాశం ఇవ్వాలని కోరారు. నిజానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల్లో 15 సంవత్సరాలు దాటిన వాహనాలను గ్రీన్ టాక్స్ చెల్లించి రోడ్డుపై నడుపుకోవచ్చని తెలిపింది ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 15 సంవత్సరాలు నిండిన భారీ వాహనాలు గ్రీన్ టాక్స్ రూపంలో అత్యధిక మొత్తం టాక్స్ చెల్లించి నడుపుతున్నారు.ఇదే అంశం హెవీ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలకు కూడా వర్తిస్తుంది.అయితే అర్ధాంతరంగా పరివాహన్ పోర్టల్ లో శిక్షణ తీసుకునే వారికి లాక్ విధించడం అత్యంత దారుణమైన విషయమని రోడ్డు సేఫ్టీ ఎన్జీవో సమస్త ప్రెసిడెంట్ ఆర్ కనకదుర్గ పద్మజా తెలిపారు. ఇటువంటి చర్యల వలన క్షేత్రస్థాయిలో ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేక భావం కలుగుతుంది అనుటలో సందేహం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా రవాణా శాఖ స్పందించి సమస్య పరిష్కరించాలని ఎన్జీవో కోరుతుందని పేర్కొన్నారు.

## 'సర్' కార్యక్రమంపై అవగాహన



సత్తెనపల్లి, జూన్ 16, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని 23వ వార్డు నందు 71 వ పోలింగ్ స్టేషన్ పరిధిలోని వేంకటపతి కాలనీ ఏరియా లో 'సర్' కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమం బిఎల్ఓ రేవతి ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని వైసీపీ మీడియా ప్యానెలిస్ట్ చిట్టా విజయభాస్కరరెడ్డి గారు పరిశీలించి అధికారులకు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది . ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్ఆర్ సిపి బిఎల్ఎ సంకుల తిరుపతిరావు పోలింగ్ బూత్ ఏజెంట్ లు కస్తల అశోక్ , రెహమాన్, బాజీ ఇతర పార్టీ బిఎల్ఎలు నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

## ఢిల్లీ వేదికగా సేవా గళం: పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజాశ్రేయస్సుకై కదిలిన మండలనేని చరణ్ తేజ

చిలకలూరిపేట, జూన్ 16, ప్రభాతవార్త: దేశ రాజధాని ఢిల్లీలో జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఐదు రాష్ట్రాల ముఖ్య నాయకులతో అత్యంత ప్రతిష్టాత్మకంగా సేవా గళం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు వివిధ ప్రాంతాల నుండి ప్రముఖులు హాజరు కాగా, ప్రధాత మండలనేని చరణ్ తేజకు ప్రత్యేక ఆహ్వానం లభించింది. ఈ ప్రతిష్టాత్మక వేదికపై చరణ్ తేజ పాల్గొనడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.సేవా గళంలో కీలక చర్చలు.. గళం విప్పిన చరణ్ తే జఈ సమావేశంలో దేశ, రాష్ట్ర పురోభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా పలు కీలక విషయాలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఇందులో భాగంగానే చరణ్ తేజ కూడా పాల్గొని, తనదైన శైలిలో గళం విప్పారు. స్థానిక సమస్యలను, ప్రజల ఆకాంక్షలను ఈ జాతీయ స్థాయి వేదికపై ఆయన సమర్థవంతంగా ప్రస్తావించి అందరి దృష్టిని ఆకర్షించారు."టార్చ్ బేరర్స్ కరచాలనం".. ఒకరు దేశ ప్రయోజనాల కోసం, మరొకరు స్థానిక భవిష్యత్ కోసం! ఈ సమావేశంలో పవన్ కళ్యాణ్, చరణ్ తేజల కలయిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒకరు దేశ ప్రయోజనాల కోసం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం పరితపించే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అయితే.. మరొకరు స్థానిక ప్రజల భవిష్యత్తు కోసం, క్షేత్రస్థాయి ప్రగతి కోసం అహర్నిశలు శ్రమించే యువ యోధుడు నేని చరణ్ తేజ. ఈ ఇద్దరు టార్చ్ బీరర్స్ కరచాలనం చేసుకున్న దృశ్యం.. వారిద్దరి లక్ష్యం ఒక్కటేనని, అది "ప్రజా శ్రేయస్సే" అని చాటిచెప్పింది.ఇద్దరు యోధుల కలయిక.. ప్రజా క్షేమమే పరమావధి సమాజంలో మార్పు కోసం, ప్రజల కష్టాలను తీర్చడం కోసం అహర్నిశలు శ్రమించే ఈ ఇద్దరు నాయకుల కలయిక రాబోయే రోజుల్లో సరికొత్త మార్పులకు సంకేతంగా నిలిచింది. పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, చరణ్ తేజ స్థానిక స్థాయిలో ప్రజా సేవలో మరింత దూసుకుపోవడానికి ఈ ఢిల్లీ పర్యటన సరికొత్త ఉత్తేజాన్ని ఇచ్చిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



## సత్తెనపల్లిలో ఘనంగా 'రెండేళ్ల నమ్మకం..అభివృద్ధి సంక్షేమం' విజయోత్సవ సభ

సత్తెనపల్లి, జూన్ 16, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం కాకతీయ కల్యాణ మండపంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ,నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ,మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మ రెడ్డి, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ , నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ,వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తదితరులుపాల్గొన్నారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ, బీసీలపై కక్ష కట్టిన గొడ్డలి పార్టీ తన అక్కను వేధిస్తుంటే, తట్టుకోలేక నిలదీసిన బీసీ బిడ్డ అమర్నాథ్ గౌడ్‌ను కట్టేసి, కాల్చి చంపేసి






మూడేళ్లు అవుతోందని, గొడ్డలి పార్టీ చేతిలో తీరని అన్యాయానికి గురైన బీసీ కుటుంబానికి అండగా టిడిపి నిలిచిందన్నారు. అమర్నాథ్ గౌడ్ 3వ వర్ధంతి సందర్భంగా నాయకులు నివాళులర్పించారు. చంద్రబాబు పై తప్పుడు కేసులు పెట్టి జైలుకు అప్పటి సిఎం జగన్ పంపారన్నారు. అంతేకాకుండా వైకాపా పాలనలో ఉపాధ్యాయులను బ్రాందీ షాపు దగ్గర నిలబెట్టారన్నారు.

## మునిసిపాలిటీ పైపులు లీకేజీ: నీరు వృధా



సత్తెనపల్లి, జూన్ 16, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం 23వ వార్డు వెంకటపతి కాలనీ లో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్ పక్కన ఉన్నటువంటి రోడ్డు నందు ప్రతిరోజు మున్సిపల్ పైపులు లీకేజీ అయ్యి నీరు వృధాగా రోడ్ మీదకు వస్తున్నాయి ఎన్నిసార్లు చెప్పినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు..ఆక్కడ నివాసం ఉంటున్న స్థానిక ప్రజలు నడుచుకుంటూ వెళ్లే పాదాచారులు ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు నీరు వృధా కాకుండా సమస్యను మున్సిపల్ అధికారులు వెంటనే పరిష్కారం చేయాలని అక్కడ నివాసం ఉంటున్న స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## సత్తెనపల్లి మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం: తారకరామ సాగర్ వాకింగ్ ట్రాక్ వద్ద ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం

సత్తెనపల్లి, జూన్ 16, ప్రభాతవార్త: పట్టణ ప్రజల ప్రాణాలంటే మున్సిపల్ శాఖ అధికారులకు లెక్క లేకుండా పోయింది. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకుండా, ఏదైనా పెద్ద ప్రమాదం జరిగే వరకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటూ స్థానిక ప్రజలు, మార్నింగ్ వాకర్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సత్తెనపల్లి పట్టణంలోని తారకరామ సాగర్ వద్ద ఉన్న వాకింగ్ ట్రాక్ నిత్యం వందలాది మంది ప్రజలు, వృద్ధులు, మహిళలు, పిల్లలతో రద్దీగా ఉంటుంది. అయితే, ఈ వాకింగ్ ట్రాక్ పక్కనే ఉన్న ఒక ఎలక్ట్రికల్ ఐరన్ (ఇనుప) స్తంభానికి విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యాయి. ఆ ఇనుప స్తంభం నుండి నిరంతరం నిప్పురవ్వలు ఎగసిపడుతున్నాయి. ఇనుప స్తంభం కావడంతో దానికి విద్యుత్ ప్రవహించే (కరెంట్ షాక్) ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. పట్టించుకోని మున్సిపల్ అధికారులు ఈ ప్రమాదకర పరిస్థితిపై అక్కడికి వచ్చే వాకర్స్, స్థానికులు పలుమార్లు మున్సిపల్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా సరే, అధికారులలో ఎటువంటి చలనం లేదు. "ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి, ఎవరైనా ప్రాణాలు కోల్పోయాక గానీ అధికారులు నిద్ర లేవరా?" అని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ముఖ్యంగా చీకటి పడ్డాక లేదా ఉదయాన్నే వాకింగ్‌కు వచ్చే వారికి ఈ నిప్పురవ్వలు సరిగ్గా కనిపించక, పొరపాటున ఆ ఇనుప స్తంభాన్ని తాకితే జరిగే నష్టానికి బాధ్యులెవరని వాకర్స్ ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రాణాలను గాలికి వదిలేసిన మున్సిపల్ అధికారుల తీరుపై సత్తెనపల్లి పట్టణ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఆ విద్యుత్ వైర్ల షార్ట్ సర్క్యూట్ సమస్యను పరిష్కరించి, తారకరామ సాగర్ వాకింగ్ ట్రాక్ వద్ద ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



## ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటిన టిడిపి నేత పెదకరిముల్లా



సత్తెనపల్లి, జూన్ 16, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణ 27 వ వార్డు మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రధాన ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు , మరియు ఉపాధ్యాయులతో కలిసిగపల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ ఉపాధ్యక్షులు సయ్యద్ పెద కరిముల్లా తదితరులు మొక్కలు నాటారు. స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.


## నిరుపేదలకు అనప్రసాద వితరణ

సత్తెనపల్లి, జూన్ 16, ప్రభాతవార్త: అన్నదాన ధర్మ సత్రం, సొలస దీని ధర్మకర్త పెద్దలు గుర్రం కోటి వీరయ్య ఆర్థిక సహాయంతో, భరతమాత అన్నప్రసాధ వితరణ పథకం 809వ రోజు 121 మంది నిరుపేదలకు ఉచితంగా భోజనం అందించటం జరిగింది .పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోనీ యానాది కాలనీలో మంగళవారం మధ్యాహ్నం 121 మంది నిరుపేదలకు భరతమాత అన్నప్రసాధ వితరణ పథకం 80, 9వ రోజు మరియు అన్నదాన ధర్మ సత్రం, సొలస వారి ఆధ్వర్యంలో మరియు వారి ఆర్థిక సహాయంతో ఈ సంవత్సరము వీరు ఆరు రోజులు అన్నప్రసాధం అందించమనగా దీనిలో భాగంగా రెండవ రోజు ఈ రోజు అనగా మంగళవారం ఉచితంగా పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనాటి దాతలకు మరిముఖ్యంగా పెద్దలు ధర్మకర్త గుర్రం కోటి వీరయ్య, వీరి కుమారుడు ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం సత్తెనపల్లి పెద్దల కమిటీ సభ్యులు గుర్రం పార్థసారథి ధర్మపత్ని గీతాంజలి మరియు సేవలు అందించిన ధమ్మాలపాటి బాల వెంకటేశ్వర్లు టీం కు హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.



## ఘనంగా వీడ్కోలు సత్కారం

చిలకలూరిపేట, జూన్ 16, ప్రభాతవార్త: పట్టణంలోని పెదనందిపాడు మార్గంలో వున్న రోమన్ క్యాథలిక్ (ఆర్సియం)చర్చి సంఘ కాపరి రెవరెండ్ ఫాదర్ పూదోట థామస్ స్టాటన్ మంగళవారం కనపర్రు బావి రెక్టర్ చర్చికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సంఘస్తులు ఆయనను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. సంఘ పెద్దలు డా.చుక్క విన్సెంట్ పాల్ మాట్లాడుతూ కొద్దికాలం మాత్రమే పనిచేసినప్పటికీ స్థానిక సంఘస్థుల మదిలో స్థిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. వీరు సంఘానికి చేసిన సేవలను స్మరించారు. ఈ కార్యక్రమంలో ఆర్సియం చర్చి సంఘస్తులతో పాటు. చార్లెస్ కాన్వెంట్ స్టాఫ్, మదర్ సుపీరియర్ శాంతి , ప్రిన్సిపాల్ సుప్రియ, మత కన్యలు,



థెరిస్సా యూత్ సభ్యులు, మహిళా సభ్యులు పాల్గొని ఆయనకు వీడ్కోలు పలికారు.

## 21న ఉచిత కంటి వైద్య శిబిరం



యద్దపాడు, జూన్ 16, ప్రభాతవార్త : సామాజిక సాంస్కృతిక వేదిక(బాసట) యద్దపాడు వారి అధ్వర్యంలో ఎల్వి ప్రసాద్ వైద్య విజ్ఞాన సంస్థ వారి వెంకటలక్ష్మీ నేత్రాలయం కారంచేడు వారి సహకారంతో ఈ నెల 21వ తేది అదివారం యద్దపాడు గ్రామంలోని పిఅర్ విజ్ఞాన కేంద్రం నందు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. అలోకం వెంకాయమ్మ, పెద్దబ్బాయ్య చారిటబుల్ అధ్వర్యంలో నిర్వహించటం జరుగుతుందని, ట్రస్టు నిర్వాహకులు అలోకం పెద్దబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా అయన వివరిస్తూ అలోకం వెంకాయమ్మ చతుర్ద సంస్కరణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేస్తున్నామని, ఈ శిబిరంలో కంటి రెటీనా పరీక్షలు ఉచితంగా నిర్వహించబడతాయన్నారు. ఈ సందర్భంగా బాసట సభ్యులతో కలసి ఉచిత కంటి వైద్య శిబిరం గోడపత్రికలను అవిష్కరించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో విస్తృతంగా ప్రచారం ప్రారంభించటం జరిగిందన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో బూత్ లెవల్ ఏజెంట్లు విధిగా పాల్గొనాలి



యద్దపాడు, జూన్ 16, ప్రభాతవార్త : ఓటరు జాబితా సవరణకు సంబంధించి యద్దపాడు మండల వైఎస్ఆర్‌సిపి బూత్ లెవల్ ఏజెంట్లు అందరూ విధిగా పాల్గొని తమకు కేటాయించిన బూత్‌లలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన వివరాలు అధికారుల దృష్టికి తీసుకొని పోవాలని మండల వైయస్ఆర్‌సిపి మండల అధ్యక్షుడు వద్దేపల్లి నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా అయన వివరిస్తూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ప్రక్రియ కాబట్టి ప్రతి అర్హుడైన వ్యక్తి ఓటరు జాబితాలో పేరు నమోదు అయ్యేలా అలాగే జాబితాలో ఉన్న లోపాలను గుర్తించి సరిదిద్దేలా బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్దాయిలో చురుకుగా పనిచేయాలన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం

నరసరావుపేట క్రైమ్, జూన్ 16, ప్రభాతవార్త: : గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానిక చిత్రలాయ సెంటర్ లోని ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రక్కనే గుర్తించినట్లు టూ టౌన్ పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసులు మాట్లాడుతూ సుమారు 7075 సంవత్సరాల వయసు కలిగి గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి పడిఉండగా అక్కడ వున్నవారు పోలీస్ లకు కాల్ చేసి చెప్పినారు.అక్కడే చాలా రోజుల నుండి బిక్షాటన చేస్తూ, అక్కడే తిని నిద్రపోతుంటాడు అని చెప్పినారు. సదరు శవమును నరసరావుపేట ఏరియా హాస్పిటల్ మార్చురిలో పెట్టడమైనది. సదరు మనిషిని గుర్తు పట్టిన యడల నరసరావుపేట 2 టౌన్ పోలీస్ స్టేషన్ సంప్రదించాలని కోరారు.

## 18న స్వర్ణ గ్రామ ఆరోగ్యదర్శిని

నరసరావుపేట,జూన్ 16 ప్రభాతవార్త : జూన్ 18 న జిల్లాలోని అన్ని గ్రామాల్లో స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కనీసం 200 మందితో గ్రామ సభలు నిర్వహించి



గ్రామంలోని ఆరోగ్య సమస్యలను క్రోడీకరించాలన్నారు. మంగళవారం స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని, యోగాంధ్ర, జలధార తదితర అంశాలపైనా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. షుగరు, బీపీ వంటి జీవన శైలి జబ్బులు, బాలలు, విద్యార్థుల్లో పోషకాహార లోపాలు గుర్తించి నమోదు చేయాలన్నారు. పంచాయతీ సెక్రటరీలు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం లు, అంగన్వాడీ సిబ్బంది, డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించుకుని స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ నెల స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శినిలో ముఖ్యంగా పల్స్ పోలియో నిర్వహణ విజయవంతం చేయాలన్నారు. కోటప్పకొండలో 19 న అమరావతిలో పర్యాటక ప్రదేశాల్లో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. చెరువులలో డీసిల్టింగ్ అనంతరం ఆ మేరకు నీటినిల్వ సామర్థం పెరగాలన్నారు. జలధార కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసే కూలీలకు త్రాగునీరు, మజ్జిగ, నీడ కోసం ప్రత్యేక ఏర్పాటు చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాలు ఇచ్చారు.

## బిసిలపై వైకాపా దమనకాండ : ఎమ్మెల్యే అరవిందబాబు ఆగ్రహం

నరసరావుపేట, జూన్ 16 ప్రభాతవార్త : గత వైసీపీ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలపై యథేచ్ఛగా దాడులు జరిగాయని, ఆ దమనకాండకు బాపట్ల జిల్లా అమర్నాథ్ గౌడ్ హత్యే ప్రత్యక్ష సాక్ష్యమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మండిపడ్డారు. మంగళవారం గుంటూరు రోడ్డులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో దివంగత అమర్నాథ్ గౌడ్ 3వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమర్నాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం



ఎమ్మెల్యే అరవిందబాబు మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో బీసీలపై కనికరం లేకుండా ఊచకోత కోశారు. చెరుకుపల్లి మండలం రాజోలు ఉప్పాలవారిపాలేనికి చెందిన బీసీ యువకుడు అమర్నాథ్ గౌడ్‌ను తన అక్కను వేధిస్తున్న వైసీపీ మూకలను ప్రశ్నించినందుకు పెట్రోల్ పోసి దారుణంగా హతమార్చారు. ఇది వైసీపీ గొడ్డలి పార్టీ రాజకీయాలకు పరాకాష్ట అని అన్నారు. అమర్నాథ్ కుటుంబానికి ఆయన మృతి తీరని లోటని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు, బీసీ మహిళా నాయకులు పాల్గొన్నారు. క్యాండిల్స్ వెలిగించి నిరసన తెలియజేశారు.

## వెల్లటూరు తిరునాళ్లలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావు పేట,జూన్ 16 ప్రభాతవార్త : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శితిది సభ్యులు, వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ఆహ్వానం మేరకు నియోజకవర్గంలో పల్నాడు జిల్లా



వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు.బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామంలో జరుగుతున్న సుబ్బా గురుయోగేంద్ర స్వామి తిరునాళ్ల సందర్భంగా స్వామిని దర్శించుకు న్నారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తో పాటు వినుకొండ నియోజకవర్గ పరిశీలకులు బాసు లింగారెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలను సందర్శించారు. గ్రామంలో పార్టీ నాయకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం స్థాయి నాయకులు మండలం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అరాచక పాలనపోయి రెండేళ్లు: ఎంపీ లావు, ఎమ్మెల్యే 'యరపతినేని'

గురజాల, జూన్ 16 ప్రభాతవార్త : అరాచక పాలన, వైసీపీ ప్రభుత్వ గద్దె దిగి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా గురజాల నియోజకవర్గం దాచేపల్లి పట్టణంలోని మార్కెట్‌యార్డులో మంగళవారం నిర్వహించిన రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం బహిరంగ సభలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ పాలకులు సంక్షేమం కాకుండా కేవలం కక్ష రాజకీయాలు చేశారని, కూటమి ప్రభుత్వం



అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే నిరుద్యోగులకు డీఎస్సీని తీసుకొచ్చామని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని, ఉచిత గ్యాస్ సిలిండరు, పెన్షన్ పెంపు వంటి సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. రానున్న మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిపథంలో దూసుకుపోతుందని, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, కేంద్రంలో మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి అండగా ఉన్నారన్నారు. అలాగే సూపర్ సిక్స్ పథకం ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులు కూటమి ప్రభుత్వానికి, ఎంపి, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కటకం అంకారావు, టీడీపీ యువనేత యరపతినేని నిఖిల్, గురజాల నియోజకవర్గ పరిశీలకుడు మహమ్మద్ మోసింగ్, వెన్నా సాంబశివారెడ్డి, డాక్టర్ ఉన్నం మల్లిఖార్జునరావు, మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, దాచేపల్లి నేతలు తంగెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అమర్నాథ్‌గౌడ్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే 'యరపతినేని'

పిడుగురాళ్ళ, జూన్ 16 ప్రభాతవార్త : గత ప్రభుత్వం వైసీపీ నేతల దాడిలో హత్యకు గురైన అమర్నాథ్‌గౌడ్ చిత్రపటం వద్ద మంగళవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



నివాళులర్పించారు. తన అక్క హేమశ్రీని వేధించిన వైసీపీ సానుభూతి పరులను ప్రశ్నించినందుకు బీసీ వర్గానికి చెందిన అమర్నాథ్‌గౌడ్‌ను వైసీపీ సైకోలు పెట్రోలు పోసి సజీవదహనం చేశారని గుర్తు చేశారు. బాధిత కుటుంబానికి టీడీపీ అండగా ఉందన్నారు. హేమశ్రీ ఉన్నత విద్యకు సీఎం చంద్రబాబునాయుడు పూర్తి బాధ్యత వహించి అండగా నిలిచారన్నారు. గతంలో కూడా ఎంతో మంది బాధితులకు టీడీపీ అండగా నిలిచిందన్నారు.

## 18 ఏళ్లు నిండిన వారు హక్కుకు అర్హులు

మాచర్ల, జూన్ 16 ప్రభాతవార్త: ఓటర్ లిస్టుపై ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ సర్ ప్రక్రియ మంగళవారం పట్టణంలో ప్రారంభించారు. బూత్ నెం.58లో ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను బీఎల్ఓలు అందజేశారు. 18 ఏళ్లు



దాటిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓటర్ల సవరణలు, మార్పులు, చేర్పులు సర్ ప్రక్రియలో సరిచేసుకోవచ్చని సూచించారు. ఓటర్ల నుంచి సేకరించిన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సర్ ప్రక్రియ జూన్ 15 నుంచి జులై 14 వరకు జరుగుతుందన్నారు. ఓటర్లు తమ ఓటును సరిచూసుకోవాలని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే సరిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎల్ఓ, బూత్ ఇన్‌ఛార్జి, పల్నాడు జిల్లా పార్లమెంటరీ సెక్రటరీ షేక్ జానీ బాష, ఓటర్లు పాల్గొన్నారు.

## జగన్ పాలనలో బీసీలపై ఊచకోత: ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల, జూన్ 16 ప్రభాతవార్త: జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలపై కనికరం లేకుండా ఊచకోతకు దిగారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. బాపట్ల జిల్లా రాజోలు ఉప్పాలవారి పాలెంకు చెందిన బీసీ యువకుడు అమర్నాథ్ గౌడ్‌పై వైసీపీ గూండాలు



అత్యంత దారుణంగా దాడిచేసి, హతమార్చిన వైనాన్ని గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడ్డలి పార్టీ ధ్యేయం బీసీ, ఎస్సీ, ఎస్టీలను భయభ్రాంతులకు గురిచేసి వేధించడమేనని విమర్శించారు. అక్కను ఏడిపిస్తున్న వైసీపీ మూకలను ప్రశ్నించిన అమర్‌నాథ్‌ను పెట్రోలు పోసి, తగులబెట్టి దారుణంగా హత్య చేశారని వాపోయారు. ఏది ఏమైనా అమర్‌నాథ్ మృతి ఆ కుటుంబానికి పూడ్చని లోటు అని తెలియజేస్తూ.. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు.

## అమరనాథ్ హత్య బాధాకరం



మాచర్ల, జూన్ 16 ప్రభాతవార్త: బాపట్ల జిల్లా రాజోలు ఉప్పాలవారిపాలెంకు చెందిన బీసీ యువకుడు అమర్‌నాథ్ గౌడ్‌ను వైసీపీ గూండాలు అత్యంత కిరతంగా హత్య చేయడం బాధాకరమని పట్టణ టీడీపీ అధ్యక్షులు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సొసైటీ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో అమర్నాథ్ గౌడ్ 3వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 30 వేల మంది బీసీలను వైసీపీ వేధించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీల బీసీ నాయకులు కొమెర లాల్‌కృష్ణ, కొమెర అనంతరాములు, శాంతి, అనురాధ, దుర్గ, బత్తుల కుమార్, చందుగౌడ్, రంగయ్య, శివ, బత్తిన రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయంలో సీట్ల ఖాళీలు



మాచర్ల, జూన్ 16 ప్రభాతవార్త: స్థానిక కేంద్రీయ విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బీఆర్‌వీకే స్వామి తెలిపారు. 5వ తరగతిలో ఎస్సీ కేటగిరీలో 2, ఎస్టీ కేటగిరీలో 3, జనరల్ కేటగిరిలో 6 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే 4వ తరగతిలో ఎస్టీ కేటగిరీలో ఒక సీటు అందబాటులో ఉందని పేర్కొన్నారు. అర్హతన కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 20లోపు పాఠశాలలో అందజేయాలని ప్రిన్సిపల్ సూచించారు.

## వివాదాస్పద భూమిపై రెవెన్యూ కోర్టు



మాచర్ల, జూన్ 16 ప్రభాతవార్త: హైదరాబాదుకు చెందిన యాదా వెంకటేశ్వర్లుతోపాటు మరో 12 మందికి చెందిన భూమిని కొంతమంది దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని బాధితులు ఫిర్యాదు చేశారు. గురజాల ఆర్డీవో ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు వివాదాస్పద భూమి పత్రాలను పరిశీలించారు. రెవెన్యూ కోర్టు నిర్వహించారు. సర్వే అనంతరం సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తహశీల్దారు కిరణ్‌కుమార్ తెలిపారు.

## 19న విజయోత్సవ సభను జయప్రదం చేయండి: ఎమ్మెల్యే

మాచర్ల, జూన్ 16 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 19న మాచర్లలో నిర్వహించే విజయోత్సవ సభను జయప్రదం చేయాలని కూటమి పార్టీలశ్రేణులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా సభా వేదిక



ఏర్పాటుకు పలు ప్రాంతాలను పరిశీలించారు. కారంపూడి, రెంటచింతల మండలాల్లో పర్యటించిన ఎమ్మెల్యే అక్కడున్న పార్టీ నేతలతో సమీక్షించారు. అనంతరం స్థానిక కేసీపీ ఆడిటోరియంలో మాట్లాడారు. చంబల్ లోయలో ప్రజా విజయపతాకం ఎగురవేసి, కూటమికి పట్టం కట్టి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా ప్రజలు, అభిమానులు, సంక్షేమ లబ్ధిదారులు, శ్రేయోభిలాషులు పెద్దసంఖ్యలో ఈ విజయోత్సవ సభలో పాల్గొని, కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్, మాచర్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ మధుయాదవ్, పార్టీ సీనియర్ నాయకులు యెనుముల కేశవరెడ్డి, మద్దిగపు పెద్ద వెంకటరామిరెడ్డి, చిన్న వెంకటరామిరెడ్డి, బీజేపీ నాయకులు కాశీపతి, కాంతికుమార్, జనసేన నాయకులు లాల్ కృష్ణ, వజ్రంనాయక్, మదార్‌సాహెబ్, మాచర్ల వాసు, కంభంపాటి అనిల్, చంటి తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టులపోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



విజయపురిసౌత్, జూన్ 16 ప్రభాతవార్త: స్థానిక ఏపీఆర్‌డీసీలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ డా॥ జి.వెంకటరామిరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లీషు 2, గణిత శాస్త్రం 1, ఫిజిక్స్ 1, కెమిస్ట్రీ 1, హిస్టరీ 1, పొలిటికల్ సైన్స్ 1, కామర్స్ 5, కంప్యూటర్ సైన్స్ 2, లైబ్రేరియన్ 1, ఫిజికల్ డైరెక్టర్ 1, స్టాటిస్టిక్స్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఎస్ఈటీ, ఎన్ఈటీ, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు ఉండాలన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9963223164, 7989557046 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,జూన్16,ప్రభాతవార్త: సత్తెనపల్లిలో జరిగిన కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సభలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన అరాచకాలు,అవినీతి,దోపిడీలను



గమనించిన ప్రజలు ప్రజాస్వామ్య వజ్రాయుధం ఓటు హక్కుతో ఆ పార్టీని తునాతునకలు చేసి ఎన్డీఏ కూటమిని 94 శాతం మెజారిటీతో (164 స్థానాల్లో) గెలిపించి చారిత్రాత్మక విజయాన్ని అందించారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవంతో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చడమే ధ్యేయంగా పెట్టుకున్నారని,2047 నాటికి ప్రతి కుటుంబం తలసరి ఆదాయాన్ని రూ. 53 లక్షలకు పెంచడమే కాకుండా ఖిఇంటికో పారిశ్రామికవేత్తనుఖి తయారుచేయడమే ఆయన ఆశయమని వివరించారు. కష్టసమయంలో చంద్రబాబుకు తోడుగా నిలిచిన పవన్ కళ్యాణ్ బంధం శ్రీరామునికి లక్ష్మణుడిలాంటిదని, రాబోయే 20 ఏళ్ల పాటు ఈ కూటమి బలంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశవిదేశాల్లో భారత ఖ్యాతిని పెంచుతూ సుపరిపాలన అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని, సత్తెనపల్లి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ అనుభవాన్ని ఆయన కొనియాడారు. గత 201419 మధ్య ఎంతో అభివృద్ధి చేసినా, వైసిపి మాయమాటలు, నవరత్నాల ఆశలు మరియు విషప్రచారాల వల్లే తాము 2019లో ఓడిపోయామని విశ్లేషించారు. జగన్ మోహన్ రెడ్డికి కౌన్సిలర్ అయ్యే అర్హత కూడా లేదని, ఆయన హయాంలో నాసిరకం మద్యం వల్ల లక్షలాది మంది ఆరోగ్యం పాడై ప్రాణాలు కోల్పోయారని, యువతను గంజాయికి బానిసలుగా మార్చారని తీవ్రంగా విమర్శించారు. కూటమి నేతలందరూ సమన్వయంతో,సమిష్టిగా ముందుకు సాగి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

## వినుకొండ ప్రజలకు ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మేడం శ్రీనివాసరెడ్డి సేవలు

### ప్రతి నెల మూడవ మంగళవారం వినుకొండ తిరుమల హాస్పిటల్‌లో వైద్యం

వినుకొండ,జూన్16,ప్రభాతవార్త: హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రముఖ యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మేడం శ్రీనివాసరెడ్డి ఇకపై ప్రతి నెల మూడవ మంగళవారం వినుకొండ పట్టణంలోని తిరుమల హాస్పిటల్ నందు రోగులకు అందుబాటులో ఉంటారు. ఈ మేరకు





మంగళవారం తిరుమల హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తాను ఈ ప్రాంతానికి చెందిన నూజెండ్ల మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన వ్యక్తిని అని గుర్తు చేసుకున్నారు. తన సొంత ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ప్రతి. నెల మూడవ మంగళవారం ఇక్కడకు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రధానంగా కీళ్ల నొప్పులు మరియు ఎముకలకు సంబంధించిన సమస్యలతో బాధపడే వారికి ఆయన చికిత్స అందించనున్నారు. ముఖ్యంగా: మోకాళ్ల సమస్యలు,భుజం నొప్పులు,నడుము నొప్పి, వెన్నెముక సమస్యలు ఇతర అత్యాధునిక ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు,కార్పొరేట్ ఆసుపత్రి అనగానే సామాన్యులు ఖర్చుకు భయపడే పరిస్థితి ఉంది. కానీ యశోద హాస్పిటల్స్ ఆ భయాన్ని పోగొట్టేలా అడుగులు వేస్తోంది. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఇతర ఆసుపత్రుల కంటే అతి తక్కువ ఖర్చుతోనే అత్యాధునిక వైద్య సేవలు అందించడమే మా ప్రథమ ప్రాధాన్యత," అని డాక్టర్ శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే వినుకొండ ప్రాంతానికి చెందిన పలువురికి యశోద హాస్పిటల్‌లో విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఎముకలు,కీళ్ల సమస్యలతో బాధపడే వినుకొండ మరియు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారితో పాటు హైదరాబాద్ యశోద హాస్పిటల్ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ వీరంకి వెంకటేశ్వరరావు మరియు అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ తిమోతి,హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హోంమంత్రిపై వైసీపీ నేత వ్యాఖ్యలు తెదేపా తీవ్రంగా ఖండిస్తున్నాం

మంగళగిరి, జూన్ 16, ప్రభాతవార్త: రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పట్ల వైసీపీ నాయకుడు గుడివాడ అమర్నాథ్ చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కుత్తికొండ ధనంజయరావు పేర్కొన్నారు



ప్రజలు తిరస్కరించిన తర్వాత వైసీపీ నాయకులు పూర్తిగా రాజకీయ నిరాశలోకి వెళ్లిపోయారని అమర్నాథ్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడే ధైర్యం లేక, ప్రభుత్వ కార్యక్రమాలపై విమర్శించే అంశాలు లేక, మహిళా మంత్రులపై వ్యక్తిగత దూషణలకు దిగడం వైసీపీ విష సంస్కృతికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న హోంమంత్రి అనిత పై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు, మహిళా గౌరవంపై జరిగిన దాడి. మహిళలను గౌరవిస్తామని చెప్పుకునే వైసీపీ నాయకులు ముందుగా తమ పార్టీ నేతల నోళ్లకు అదుపులో పెట్టుకోవాలని విమర్శించారు గుడివాడ అమర్నాథ్ వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని హోంమంత్రి అనిత కు, రాష్ట్ర మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు లేకపోతే మహిళా లోకం, రాష్ట్ర ప్రజలు ఆయన వ్యాఖ్యలకు తగిన సమాధాన చెప్తారన్నారు.

## ఎస్ఐఆర్..పై నియోజకవర్గ బిజెపి ముఖ్య నేతలతో సమావేశం

మంగళగిరి, జూన్ 16, ప్రభాతవార్త: మంగళగిరి పట్టణ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఎస్ ఐ ఆర్ సంబంధించి నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జోనల్ ఇన్చార్జి రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు పాల్గొని మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్, బిఎల్ఏ నియామకం పూర్తిచేసి ఎస్ఐఆర్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి దొంగ ఓట్లు లేకుండా చూసుకోవాలని బూతు స్థాయి లో పార్టీ





బలపడినప్పుడే పార్టీ బలపడు తుందని అందరూ సమన్వయంతో పనిచేయాలని తెలియజేశారు. మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరావు ఆధ్వర్యం లో జరిగిన ఈ సమావేశానికి గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్రా శివన్నారాయణ, జాతీయ స్పైసస్ బోర్డ్ మెంబర్ ఎస్ ఐఆర్ జిల్లా కన్వీనర్ కొత్తూరు సుబ్బారావు, బిఎల్ఏ వన్ జిల్లా కార్యదర్శి పంచుమర్తి ప్రసాద్, వివర్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్ జగ్గారపు శ్రీనివాసరావు, కిసాన్ మోర్చారాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై వి సుబ్బారావు, ఓబీసీ మోర్చా కోస్తాంధ్ర జోనల్ ఇంచార్జ్ తుల్లి మిల్లి రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు టి ఈశ్వర్ నాయుడు, రూరల్ అధ్యక్షులు మణికంఠ, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు శివ రామకృష్ణ, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బుల్ల రాజారావు, బొక్క నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

## మహిళలను వ్యక్తిగత దూషణ చేయడం సరికాదు..

పెదకూరపాడు, జూన్ 16, ప్రభాతవార్త: మహిళల రాజకీయ సాధికారతకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని పల్నాడు జిల్లా టిడిపి ఉపాధ్యక్షురాలు షేక్ ముంతాజ్ అన్నారు. మంగళవారం మండల టిడిపి కార్యాలయంలో మహిళలతో కలిసి ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హోం మంత్రి అనిత పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమర్నాథ్ పై మండిపడ్డారు.



మహిళలు రాజకీయంగా మరింత ముందుకు రావాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువనేత మంత్రి నారా లోకేష్ బాబు 33 శాతం రిజర్వేషన్ కల్పించి వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నారం అన్నారు.దళిత మహిళగా ఉన్నత విద్యను అభ్యసించి, రాజకీయంగా ఎన్నో పోరాటాలు చేసి రాష్ట్ర హోంమంత్రిగా ఎదిగిన వంగలపూడి అనిత పై వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్ నాద్ చేసిన వ్యాఖ్యలు అత్యంత నిచమన్నారు. ఆయన వ్యాఖ్యలు రాష్ట్రంలోని మహిళలతో పాటు దేశంలోని ప్రతి మహిళను అవమానించే విధంగా ఉన్నాయన్నారు.రాజకీయంగా ప్రత్యర్థులను ఎదుర్కోలేక వ్యక్తిగత అంశాలు,వ్యక్తిగత హననం, దుస్తులు, మేకప్ వంటి విషయాలను ప్రస్తావించడం తగదని ఆమె పేర్కొన్నారు. ఒక నాయకుడు మహిళల గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఏ పార్టీ లీడరైనా, అధ్యక్షుడైనా వారికి బుద్ధి చెప్పాలన్నారు.మహిళలను గౌరవించడం నేర్చుకుని తర్వాత రాజకీయలు చేయాలన్నారు. అమర్నాథ్ ఫోటోలకు కోడిగుడ్లతో కొట్టి బుద్ధి చెప్పారు. ఈ కార్యక్రమంలో కల్పన, రాజ్యలక్ష్మి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు

## మార్పు తీసుకురావడం కోసం కృషి చేయాలి

పెదనందిపాడు జూన్ 16(ప్రభాతవార్త): విజ్ఞాన కేంద్రాలు సమాజం లోని మహిళలు, యువకులు,విద్యార్థుల ఆలోచనలలో మార్పు తీసుకురావడం కోసం కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె. ఎస్.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం లో జరిగిన కుట్టు శిక్షణ ఏడవ బ్యాచ్ ప్రారంభ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా కుట్టు శిక్షణ 7 వ బ్యాచ్ ని ప్రముఖ పారిశ్రామిక వేత్త దాసరి శేషగిరిరావు, పూర్వ శాసన మండలి సభ్యులు కె. ఎస్.లక్ష్మణరావు లు కలిసి ప్రారంభించారు.సభకు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షత వహించారు.లక్ష్మణరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ,ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాల్సిన



అవసరం ఉందని, అందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు మాట్లాడుతూ, విజ్ఞాన కేంద్రం చేస్తున్న కృషి అభినందనీయమని, వారు చేసే ప్రతి కార్యక్రమానికి తాను తోడ్పాటునందిస్తానని అన్నారు. పారిశ్రామికవేత్త అరవపల్లి కృష్ణ మాట్లాడుతూ ఒకప్పుడు పెద్ద పెద్ద కుటుంబాలు కూడా సాఫీగా సాగిపోయేవని,నేడు చిన్న చిన్న కుటుంబాలు కూడా నడవడం కష్టం గా ఉందని అన్నారు. సభాధ్యక్షులు, విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ, విజ్ఞాన కేంద్రం స్థాపించిన 2023 నుండి పేద, మధ్యతరగతి ప్రజలకు, పిల్లలకు ఉపయోగపడే విధంగా కుట్టు శిక్షణ, సమ్మర్ క్యాంప్ లు నిర్వహిస్తున్నామని తెలిపారు.పలు సమస్యలపై సెమినార్ లు, రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసి ,ప్రజలకు అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు.రాబోయే కాలంలో మరిన్ని బహుముఖ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాట్స్ వారి సహకారం మరువలేనిది అన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కందుల శ్రీనివాసరావు అతిథులను వేదిక పైకి ఆహ్వానించారు. ఈ సభలో విజ్ఞాన కేంద్రం నాయకులు నూతి సుబ్బారావు, ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, నల్లమోతు రాజేంద్ర, పసుపులేటి శేషగిరిరావు,లావు వెంకట నాగేశ్వరరావు, కుట్టు శిక్షణ టీచర్ కొర్రపాటి లక్ష్మి , కుట్టు శిక్షణ అభ్యసించే మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### పెదనందిపాడులో ఘనంగా షిరిడి సాయిబాబా 27 వ వార్షికోత్సవ వేడుకలు

పెదనందిపాడు జూన్ 16 (ప్రభాతవార్త) ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా ధూప దీప నైవేద్యాలతో దేవతారాధన చేస్తే ఫలితం ఉంటుందని. నిలకడలేని పూజలు వృధా అని పెదనందిపాడు షిరిడి సాయిబాబా విగ్రహ దాత. ఆధ్యాత్మికవేత్త. పారిశ్రామికవేత్త శ్రీరామ్ రామ్మోహనరావు (విజయవాడ) అన్నారు. మంగళవారం పెదనందిపాడు షిరిడి సాయి మందిర్ 27వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన పూజల్లో వారు పాల్గొని 108 రకాల స్వీట్స్ 108 రకాల ఫ్రూట్స్ తో షిరిడి సాయిబాబా కు. శ్రీ హనుమాన్ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఈ పూజలను సాయి మందిర్ ప్రధాన అర్చకులు గౌతం పాండే. సిరి రామ్ పాండే లు స్థానిక ప్రముఖ పారిశ్రామికవేత్తలు అరవపల్లి కృష్ణ లక్ష్మీ



నాగేంద్రం . దాసరి శేషగిరిరావు కుసుమాంబ. దాసరి సత్యనారాయణ వసుంధర దేవి. అరవపల్లి రామ సుబ్బారావు ఉదయలక్ష్మి దంపతులతో పాటు. తడవర్తి సురేష్ బాబు. కొత్త శేషగిరిరావు. మరో 108 మంది మహిళలచే హనుమాన్ చాలీ షతో పాటు. పరివార దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో బాబా గారికి పల్లకి సేవ నిర్వహించారు ఈ సేవలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో దాసరి శివ. సకలా వీరేంద్ర గుప్తా. పెద్ది శ్రీనివాస్. నున్న శ్రీనివాస్ గుప్తా. వసంతరావు. నాగేశ్వర స్వామి. అర్జున్ రావు. ధనలక్ష్మి.రమాదేవి. కృష్ణకుమారి. పలు భక్త భజన సమాజముల వారు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడు అరెస్ట్



తాడేపల్లి ,జూన్16 ,ప్రభాతవార్త: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న నిందితుడు విపురి అక్షయ్ వద్ద నుంచి 5 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లి, మంగళగిరి, విజయవాడ ప్రాంతాల్లో దొంగతనం చేసినట్లు సిఐ వీరేంద్ర బాబు తెలిపారు. ప్రజలు తమ వాహనాలను సురక్షిత ప్రాంతాల్లో పార్క్ చేయాలని, వాహనాలకు భద్రతా పరికరాలు వినియోగించాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పోలీస్ పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని కోరారు.

## స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2026లో భాగంగా ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ.

క్రోసూరు( జూన్ 16 (ప్రభాతవార్త): స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2026 లో భాగంగా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్య అధికారులు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2026 కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాగవరంలో వైద్య అధికారులు రవికుమార్, అనిల్ కుమార్ లు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులలో డయేరియా కారణంగా సంభవించే మరణాలను పూర్తిగా నిర్మూలించటమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం అని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల సమన్వయంతో వైద్య సిబ్బంది పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిబ్బందిని కోరారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, సురక్షితమైన త్రాగునీటి వినియోగం, పారిశుధ్య చర్యలు మరియు డయేరియా నివారణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని



సిబ్బందినీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ జూన్ 16 నుండి జులై 31, 2026 వరకూ మండల వ్యాప్తంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఐదేళ్ల లోపు చిన్నారి కుటుంబానికి ఆశా కార్యకర్తల ద్వారా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు మరియు జింక్ మాత్రలను పంపిణీ చేయడం, అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంస్థలు మరియు అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ జింక్ కార్నర్లను ఏర్పాటు చేయటం వంటి చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలందరూ పరిశుభ్రత పాటిస్తూ డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే ఓ ఆర్ ఎస్ మరియు జింక్ మాత్రలు ఉపయోగించటంతోపాటు సమీప ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలన్నారు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని శాంసన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. వైద్య అధికారులు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు

## ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య :ఎంఈఓ జయంత్ బాబు.

తెనాలి జూన్16(ప్రభాతవార్త): ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరిగిందని తెనాలి మండల విద్యాశాఖాధికారి జయంత్ బాబు తెలిపారు.సోమవారం ఆయన కొత్తపేట



లోని రావి సాంబయ్య మున్సిపల్ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాల తీరును పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో వసతులు, విద్యాబోధన ఎలా ఉందనే అంశాలను అడిగి తెలుసుకున్నారు.పాఠశాలల్లో పిల్లల విద్యాబోధనకు అనువైన ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

## పారిశుధ్య పనుల పర్యవేక్షణ: మున్సిపల్ కమీషనర్

తెనాలి మున్సిపాలిటీ జూన్16(ప్రభాతవార్త): మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు మంగళవారం పట్టణం లోని ప్యాడిసన్ పేట, ఐతానగర్ తదితర ప్రాంతాలలో ఆరోగ్యశాఖ అధికారి



డాక్టర్ మొవ్వ ఏసుబాబు తో కలిసి పర్యటించారు. అక్కడ జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయా ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దానితోపాటు పాల్యాద్రి కాలువలో పేరుకుపోయిన పూడికను (డీసిల్టింగ్) వెంటనే తొలగించాలని సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్ వారికి సూచనలు అందజేశారు. పారిశుద్ధ్య నిర్వహణ, కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కమీషనర్ వెంట సచివాలయ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయంతంగా పూర్తి చేయాలి

పొన్నూరు, జూన్ 16,ప్రభాతవార్త: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(స్పెషల్ ఇంటెని వ్ రివిజన్) కార్యక్రమాన్ని విజయవంతం పూర్తి చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు



సహకరించాలని నియోజకవర్గ ఓటు నమోదు అధికారి, సమగ్ర శిక్షణ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఇడుపులపాటి పద్మావతి కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో బిఎల్వోలు ఇంటింటికి తిరిగి ముందుగా ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారన్నారు. బిఎల్వోలు ఇచ్చిన ఫారాలను ఓటర్లు పూర్తి చేసి, మళ్ళీ బిఎల్వోలు ఇంటి వద్దకు వచ్చినప్పుడు అందజేయాలి ్న ఉంటుందన్నారు. బిఎల్వోలతో బిఎల్యేలు కూడా సమన్వయం చేసుకొని సర్వేపూర్తిస్థాయిలో పక్కాగా, పారదర్శకంగా సాగేందుకు రాజకీయ పార్టీల నాయకులు శ్రద్ధ పెట్టాలన్నారు. పొన్నూరు, చేబ్రోలు తహశీల్దారులు మహమ్మద్ జియావుల్ హక్, కళ్ళెం శ్రీనివాసశర్మ, మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, పట్టణ ప్రణాళికాధికారి రఘురాం, తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ షేక్ కరీముల్లా, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ నల్లపు మౌనిక, కంప్యూటర్ ఆపరేటర్లు సయ్యద్ లాల్, షేక్ సిరాజుద్దీన్, నాయకులు మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబూరావు, తానికొండ లక్ష్మీనారాయణ చౌదరి, యరసాని నాగభూషణం, అందె దిలీప్, గోపిశెట్టి వాసు, చింతలపూడి మురళీకృష్ణ తదితరులున్నారు.

## ప్రతి ఒక్కరూ సర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పొన్నూరు, జూన్ 16,ప్రభాతవార్త: ప్రతి ఓటరు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైకాపా, టిడిపికి చెందిన బిఎల్యేలు షేక్ మహమ్మద్(మాము), షేక్ బాజ్జి కోరారు. బిఎల్వోలు ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తున్నారు. బిఎల్వోలతో పాటు ఆయా పార్టీల



బిఎల్యేలు కూడా ఇంటింటికి తిరుగుతూ ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తున్నారు. 2002లో ఓటర్ల జాబితాకు సంబంధించిన వివరాలను, ప్రస్తుత వివరాలను ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేసి ఫారాలను మళ్ళీ బిఎల్వోలకు ఇవ్వాలని వారు కోరారు.

## ఆటిజం సెంటర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

పొన్నూరు, జూన్ 16,ప్రభాతవార్త: ఆటిజం సెంటర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఇడుపులపాటి పద్మావతి ఆదేశించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. పాఠశాల ఆవరణలో



జరుగుతున్న ఆటిజం సెంటర్ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో అసంపూర్ణంగా ఉన్నటువంటి మూడు గదుల నిర్మాణం కూడా పూర్తి చేసి వినియోగంలోని తేవాలన్నారు. జిల్లాలో నిడుబ్రోలు, అంగలకుదురు, చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనూ, గుంటూరు బ్రాడిపేట శారదానికేతన్ ప్రాథమిక పాఠశాలలో ఈ కేంద్రాల ఏర్పాటు జరుగుతుందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. స్టాకు పాయింట్‌కు వచ్చిన పుస్తకాలను సక్రమంగా అన్ని పాఠశాలలకు పంపించారా..?లేదా..? అనే విషయాలను అడిగి తెలుసుకొన్నారు. రికార్డులను పరిశీలించారు. మండల విద్యాశాఖాధికారులు దూపం రాజు, కొల్లి విజయభాస్కర్ తదితరులున్నారు.

## ప్రారంభమైన మొహర్రం వేడుకలు



పొన్నూరు, జూన్ 16,ప్రభాతవార్త: మత సామరస్యానికి ప్రతీక అయిన హజరత్ మొమమ్మద్ మనుమలు హజరత్ ఇమామే హసన్ హజరత్ ఇమామే హుస్సేన్ వారి త్యాగాలను స్మరిస్తూ జరుగుతున్న మొహర్రం వేడుకలను పట్టణంలోని దహెరా మసీద్ వద్ద ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీర్ల చావిడిలో పీర్లను వివిధ రకాల రంగు రంగుల పూలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పీర్లను తిలకించి మొక్కులు తీర్చుకొంటున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మొల్లా కరీమ్ ఆధ్వర్యంలో మొల్లా హైదర్, మొల్లా గబ్రబ్‌బాషా, మొల్లా సంధాని, మొల్లా నజీర్, మొల్లా ఖలీల్‌బాషా, మొల్లా జలీల్, బాజి, నసీర్, రహంతుల్లా, షేక్ గౌస్, అల్లాబక్షి, ఖాజా, ఆర్షద్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

పొన్నూరు, జూన్ 16,ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో కల్పిస్తున్న అన్ని వసతులను, సౌకర్యాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని మండల



విద్యాశాఖాధికారులు దూపం రాజు, కొల్లి విజయభాస్కర్ సూచించారు. స్థానిక నేతాజీనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను విద్యాశాఖాధికారుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు పోర్టిఫైడ్ రైస్‌తో కూడిన నాణ్యమైన సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. రోజుకొక మెను చొప్పున పౌష్టికరమైన ఆహారపదార్థాలను అందిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాకుమాను లాజర్‌బాబు, ఉపాధ్యాయుడు ఎం.గౌతమ్ పాల్గొన్నారు.

## సుస్థిరాభివృద్ధి గ్రామాలుగా తీర్చిదిద్దాలి


పొన్నూరు, జూన్ 16,ప్రభాతవార్త: అన్ని గ్రామాలను సుస్థిరాభివృద్ధి గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజలు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా పంచాయితీ అధికారి బివి నాగసాయికుమార్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని సీతారామపురం జాతీయస్థాయి పంచాయితీరాజ్ అవార్డు్కు ఎంపికైన



సందర్భంగా జిల్లా పంచాయితీ అధికారి గ్రామాన్ని సందర్శించి ప్రజలను, సిబ్బందిని, అధికారులను అభినందించారు. ఆరోగ్యకర గ్రామంలో యోగ ఒక భాగమని ప్రపంచ యోగా దినోత్సవం జూన్ 21ని విజయవంతం చేయాలన్నారు. జాతీయస్థాయిలో హెల్త్ విలేజ్‌కింద సీతారామపురం గ్రామ పంచాయితీ ఎంపిక కావడానికి ఉన్న అవకాశాలను గ్రామస్తులు సమన్వయంతో ప్రథమ బహుమతి కోటిరూపాయలు గ్రామ పంచాయితీ అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, వెలుగు ఏపిఎం జోయిబాబు, పాండ్రపాడు వైద్యాధికారి, మాజీ సర్పంచి చుండి పద్మావతి, గ్రామ పెద్దలు ఉయ్యూరు శ్రీనివాసరావు, మండూరి నవీన్, వెలినేని సత్యనారాయణ, మొవ్వా రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్ల సమస్యల పరిష్కరించాలని మంత్రికి వినతి


రేపల్లె, జూన్ 16, ప్రభాతవార్త:ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆశ వర్కర్ల



యూనియన్(సిఐటియు) రేపల్లె నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు సిహెచ్.మణిలాల్ మంగళవారం రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. రేపల్లె పట్టణంలో 50 వేల మంది జనాభా నివసిస్తున్నందున 4 అర్బన్ హెల్త్ సెంటర్లు మాత్రమే పనిచేస్తున్నాయని ప్రతి 2 వేల మందికి ఒక ఆశ వర్కర్ సేవలందించాల్సి ఉందని ఆయన వివరించారు.గత 5 సంవత్సరాలుగా రేపల్లె పట్టణంలో కేవలం 15 మంది ఆశ వర్కర్స్ మాత్రమే పనిచేస్తున్నారని అదనంగా 20 మందిని నియమించాలని ఆయన కోరారు.సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్,సిఐటియు యూనియన్ నాయకులు కొప్పుల గోపి,ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా పరిష్కారమే ధ్యేయం

### బాపట్ల మున్సిపల్ కమిషనర్ హాసిని స్పష్టం



బాపట్ల,జూన్16,ప్రభాతవార్త,ప్రతినిధి: పట్టణ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, అందుబాటులో ఉన్న వనరుల మేరకు దశలవారీగా పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఎం.హాసిని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పట్టణంలోని వివేకానంద కాలనీలో ఉన్న మున్సిపల్ పార్కును కమిషనర్ సందర్శించారు. పార్కు నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, ఇదే పనితీరును కొనసాగిస్తూ పార్కు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

## వీబీ గ్రామ్ జి జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం

బాపట్ల,జూన్16,ప్రభాతవార్త,ప్రతినిధి: రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధిని మరింత పరుగులు పెట్టించేందుకు ఉద్దేశించిన వీబీ గ్రామ్ జి జిల్లా స్థాయి శిక్షణకారుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో జూన్ 16, 17 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమాన్ని రాష్ట్రంలోని మూడు ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ల ఆన్‌లైన్ విధానం ద్వారా గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ మల్లెల శివ ప్రసాద్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటరావు పాల్గొని శిక్షణార్థులకు దిశానిర్దేశం చేశారు.

**ప్రజా భాగస్వామ్యంతోనే ప్రగతి..** ప్రారంభ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ.. వీబీ గ్రామ్ జి యొక్క దూరదృష్టి, లక్ష్యాలు, అమలు వ్యూహాలను సమగ్రంగా వివరించారు. గ్రామీణాభివృద్ధిలో వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయం అలాగే ప్రజల భాగస్వామ్యంతో కూడిన అభివృద్ధి ఎంత కీలకమో ప్రత్యేకంగా నొక్కి చెప్పారు.

రంగంలోకి 91 మంది మాస్టర్ ట్రైనర్లు: ఈ ప్రతిష్ఠాత్మక శిక్షణ కార్యక్రమంలో మూడు నిగిది కేంద్రాల పరిధిలో మొత్తం 91 మంది జిల్లా శిక్షణకారులు స్టేట్ రిసోర్స్ పర్సన్స్ మాస్టర్ ట్రైనర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## అమర్నాథ్ గౌడ్‌కి నివాళిగా తెదేపా నేతల కొవ్వొత్తి ర్యాలీ

తెనాలి జూన్16(ప్రభాతవార్త): గత వైసీపీ ప్రభుత్వంలో అమానుషంగా పాశవికంగా అల్లరి మూకల దాడిలో ప్రణాళి కోల్పోయిన బీసీ బిడ్డ అమర్నాథ్ గౌడ్ మూడవ వర్ధంతి సందర్భంగా తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి చిట్టి ఆంజనేయస్వామి గుడి వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలు అమర్నాథ్ గౌడ్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పట్టణ



తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు పణిదపు దుర్గా మాట్లాడుతూ, శాసనమండలి సభ్యులు తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సూచనలతో బీసీ బిడ్డ అమర్నాథ్ గౌడ్ కి నివాళి అర్పిస్తూ తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అల్లరిమోకల దాడిలో ప్రాణాలు కోల్పోయిన డీఎస్సీ బిడ్డ అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి ఆనాటి వైసిపి ప్రభుత్వం ఎటువంటి సాయం చేయలేదని బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తూ సాగించిన అరాచక పాలనను ప్రజలు నీటికి మరువలేదని వైసీపీ పార్టీకి బీసీలు శాశ్వతంగా సమాధి కట్టారని దుర్గా తీవ్రంగా దుయ్యబట్టారు. బీసీలకు రాజ్యాధికారం కల్పించింది తెలుగుదేశం పార్టీ నే అని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ అన్న ఎన్టీఆర్ బీసీలకు రాజకీయంగా గుర్తింపు తీసుకువచ్చి వారిలో నాయకత్వాన్ని పెంచి బీసీలకు అండదండగా నిలబడిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని ప్రజలు ఎల్లప్పుడూ టిడిపికి అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొద్దూస్ పార్టీ సీనియర్ నాయకులు వసంతం అశోక్ జొన్నాదుల మహేష్ గిరి గణేష్ కేసన కోటేశ్వరరావు పరుచూరి రమ్య గుమ్మడి భావన వేమూరి శేషగిరిరావు ఎదర పూర్ణచంద్ పలువురు పార్టీ నేతలు తెలుగు మహిళలు పెద్ద ఎత్తున బీసీ సోదరులు పాల్గొన్నారు.

## ఓటర్ల వెరిఫికేషన్ నిష్పక్షపాతంగా నిర్వహించండి: డా. సాంబశివుడు

తెనాలి జూన్16(ప్రభాతవార్త): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓట్ల వెరిఫికేషన్ జనగణన కార్యక్రమాన్ని ప్రభుత్వం నిష్పక్షపాతంగా నిర్వహించాలని తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం ఓట్ల చోరీ చేస్తుందని కావున అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఇప్పటికైనా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా అర్హులైన ఓటర్లను గుర్తించి అనర్హుల ఓటర్లు



తీసివేయాల్సిందిగా అందుకు ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతగా పనిచేయాలన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరపున బిఎల్ఏ గా ఆసక్తి కలిగిన వారు కాంగ్రెస్ అభిమానులు ఎవరైనా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చునని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఒక బలీయమైన శక్తిగా మారబోతుందని త్వరలో రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవ్వబోతుందని డాక్టర్ సాంబశివుడు పేర్కొన్నారు. తెనాలి టౌన్ ప్రెసిడెంట్ పొన్నూరు నాగ సూర్య శేశి ధర్, తెనాలి మండల ప్రెసిడెంట్ పినపాటి స్టీవెన్ బాబు,పెనుగొండ శివకుమార్, భీమా రమేష్, కడిదం కోటేశ్వరరావు,వేజెండ్ల శంకర్రావు బి.శ్రీను,ఎన్. మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెనాలి ట్యాంక్ బండ్ పై లచ్చన్న విగ్రహానికి భూమి పూజ

తెనాలి జూన్16(ప్రభాతవార్త): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులురైతు బాంధవుడు అణగారిన వర్గాల ఆశాజ్యోతి,కీ.శే.డా:సర్దార్ గౌతు లచ్చన్న నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని తెనాలి ట్యాంక్ బండ్ పై లచ్చన్న జయంతి రోజైన ఆగస్టు 16న ఆవిష్కరించేందుకు ఈరోజు విగ్రహ భూమి పూజ



కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు నేతృత్వంలో జరిపి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా కేసన మీడియాతో మాట్లాడుతూ, ఉద్యమాల నిప్పు కణిక లచ్చన్న 17 ఏండ్ల ప్రాయంలోనే స్వాతంత్రోద్యమంలో దుమికిన యువకిశోరమన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అందుకే బడుగుల ఆరాధ్య దైవమైన డా: సర్దార్ గౌతు లచ్చన్న నిలువెత్తు విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై జయంతి రోజుకు పూర్తి చేసి ఆవిష్కరించాలని నిర్ణయించినట్లు శంకరరావు తెలియజేశారు . జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు తుళ్లూరు శ్రీనివాసరావు, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ కేసన కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు కేసన స్వాములు, చెన్ను శ్రీనివాసరావు, దొంతగాని శ్రీనాథ్, తుళ్లూరు మాధవరావు, కుంభం బాలాజీ, మోర్ల శ్రీనివాస్, బెల్లంకొండ సురేష్, పంది నారాయణరావు, వాకా సాంబశివరావు తెనాలి పలువురు బీసీ నాయకులు పాల్గొని లచ్చన్న విగ్రహాన్ని తెనాలి ట్యాంక్ బండ్ పై సకాలంలో పూర్తి చేసి ఆ మహనీయునకు ఘన నివాళులర్పిస్తామన్నారు.

## బుద్ధాం గ్రామంలో పొలం సంరక్షణ ప్రచారం

కర్లపాలెం,జూన్16,ప్రభాతవార్తఫ బుద్ధాం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఖేత్ బచావో అభియాన్ (పొలం సంరక్షణ ప్రచారం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం, బాపట్ల ఎడిఎ హుస్సేన్ మాట్లాడుతూ భూసారాన్ని కాపాడుకునేందుకు మట్టి పరీక్షల ఆధారంగానే ఎరువుల వినియోగం జరగాలని, నానో యూరియా మరియు పచ్చిరొట్ట ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. మండల వ్యవసాయ అధికారి సుమంత్ కుమార్ ఏ.ఈ.ఓ భాగ్యలక్ష్మి ్మ మరియు గౌస్ భాషా, జుతితి తిరుమలేశ్ , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వ్యవసాయ పనులు

కర్లపాలెం,జూన్16,ప్రభాతవార్త, కర్లపాలెం మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.రైతులు తమ పొలాలను దున్నుకుంటూ ఈ సంవత్సరం ఖరీఫ్ కి సిద్ధం చేసుకుంటున్నారు. పొలాల్లో ఉన్న పిచ్చి మొక్కలను ఏరివేయటం గాలులకు రాలి పడిన తాటి ఆకులు తాటి మట్టలను తీసివేసి వ్యవసాయానికి పొలాలను దుక్కి దున్నుకుంటూ సిద్ధం చేసుకుంటున్నారు. పెంటపోగు తోలుకొని భూమిని సారవంతం చేసుకుంటూ ఖరీఫ్ కి సిద్ధమవుతున్నారు. ఈ సంవత్సరమైనా సకాలంలో ఎరువులు రైతులకు అందుబాటులో ఉండాలని రైతులు కోరుతున్నారు .

## ప్రతి పౌరుడు,ఉద్యోగి నిత్యం యోగా సాధన చేయాలి

కర్లపాలెం,జూన్16,ప్రభాతవార్త: .అంతర్జాతీయ యోగా డే సందర్భంగా మంగళవారం సూర్య వెంచర్స్ బుద్ధం రోడ్ కర్లపాలెం లో ఎంపిడివో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగినాయి మండల పరిధి లో వున్న అన్ని సచివాలయ కార్య దర్శులు, మిగతా సిబ్బంది ్ల వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్య కర్తలు, ఆశలు పెద్ద మొత్తం లో పాల్గొని యోగా చేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర ప్రభుత్వ ఆయుర్వేద వైద్య శాల పేరలి యోగ సాధకుడు (యోగ గురువు) అల్లాడి రవికుమార్ యోగ ఆసనాలు వేసినారు . ఎంపిడివో అద్దురీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి, ప్రతి పౌరుడు నిత్యం యోగా సాధన చేయాలి యోగ మన భారతీయ సంపద భారతీయ ఋషులు ఆవిష్కరించిన అద్భుతమైన ఆరోగ్య సాధనం అని కొనియాడారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య శాల వైద్యులు, కర్లపాలేం మండల యోగాంధ్ర మానిటరింగ్ అధికారి పాతూరి సిద్ధార్థ మాట్లాడుతూ జూన్ 21న అందరూ యోగాలో పాల్గొని అంతర్జాతీయ యోగా డే ను విజయవంతం చేయాలని కోరారు ప్రతి ఒక్కరు రిజిస్ట్రేషన్ కావాలని అన్నారు.

## శ్రీ భార్గవి విద్యార్థి ముజిమిల్ కు ఘన సన్మానం

కర్లపాలెం,జూన్16,ప్రభాతవార్త: కర్లపాలెం మండల కేంద్రంలోని శ్రీ భార్గవి హై స్కూల్ కు చెందిన విద్యార్థి సయ్యద్ ముజేమిల్ ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షలలో 590 మార్కులు సాధించడంతోపాటు రాష్ట్రస్థాయిలో వక్స్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో 55వ ర్యాంకు సాధించినట్లు



పాఠశాల సెక్రెటరీ కరస్పాండెంట్ పేరాల వెంకట సురేష్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో 55 ర్యాంక్ సాధించిన ముజే మిల్ కు ఇంటర్మీడియట్ విద్యను పూర్తిగా ఉచితంగా అందజేసేటువంటి విధంగా విజయవాడ తాడిగడప లోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో సీటును అలర్ట్ చేసినట్లు వక్స్ బోర్డ్ అలాట్మెంట్ లెటర్ తో పాటు ప్రత్యేకంగా సన్మానించడం జరిగింది. పాఠశాల ప్రిన్సిపల్ పి లక్ష్మి ్మ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు వేణు చక్రవర్తి, మస్తాన్, రిజ్వాన ప్రేమావతి సునీత, లావణ్య,. లతా తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షలు అత్యంత బాధ్యతతో పకడ్బందీగా నిర్వహించాలి



బాపట్ల,జూన్16,ప్రభాతవార్త,ప్రతినిధి: నీట్ పరీక్షలు అత్యంత బాధ్యతతో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. నీట్ పరీక్ష, రెండేళ్ల నమ్మకం, ప్రకృతి వ్యవసాయం అంశాలపై మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ పరీక్ష ఈ నెల 21వ తేదీన చీరాల మండలంలో రెండు పరీక్ష కేంద్రాలలో జరుగుతుందన్నారు. 590 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారన్నారు. ఈ నెల 20వ తేదీన మోక్ డే నిర్వహించాలన్నారు. ప్రశ్న పత్రాలు వైమానిక దళం అధికారులు జిల్లాకు తీసుకువస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నీట్ పరీక్షలను నిర్వహిస్తుందన్నారు. పరీక్షా కేంద్రంలో 5జి జావర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓఎంఆర్ పద్ధతిలో పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే ప్రతి అభ్యర్థి ఆధార్ కార్డు నిశితంగా పరిశీలించాలని, బయోమెట్రిక్ హాజరు తీసుకోవాలన్నారు. పోలీసుల బందోబస్తు ఉండాలన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

17-6Pg5_17-6Pg5.qxd 16/Jun/26 10:51 PM Page 1



# రూ.75వేల సహకార రుణాలు మాఫీ


## తమిళ సిఎం విజయ్ సంచలన నిర్ణయం

### పంటరుణాలు తీసుకొన్న రైతులకు భారీ ఊరట



**చెన్నై,జూన్ 16:** తమిళనాడు రైతాంగానికి ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం భారీ తీపి కబురు అందించింది. సహకార బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న అన్నదాతలకు పెద్ద ఎత్తున ఊరటనిస్తూ రుణమాఫీ పథకంలో సవరణలు చేస్తూ మంగళవారం ప్రకటించింది. గతంలో ప్రకటించిన నిబంధనలపై రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలు, నిరసనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం అందరికీ ప్రయోజనం చేకూరేలా ఈ పథకం పరిధిని మరింతగా విస్తరించింది. తాజా మార్పుల ప్రకారం సహకార బ్యాంకుల నుంచి రూ. 75,000 వరకు పంట రుణాలు తీసుకున్న సన్న, చిన్న, పెద్ద రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ వర్తింపజేయనున్నారు. రూ. 75,000 కంటే ఎక్కువ మొత్తంలో రుణాలు కలిగి ఉన్న రైతులకు సైతం ప్రభుత్వం అండగా నిలిచింది. అలాంటి రైతులకు ఒక్కొక్కరికి రూ. 35,000 చొప్పున రుణ విముక్తి కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. నిజానికి గత నెలలోనే విజయ్ ప్రభుత్వం రుణమాఫీపై ప్రాథమిక ప్రకటన చేసింది. ఆ నిబంధనల ప్రకారం సన్నకారు రైతులకు రూ. 50 వేల వరకు పూర్తి మాఫీ, చిన్న రైతులకు రూ. 50 వేల లోపు రుణాలపై 50 శాతం మాత్రమే మాఫీ ఇవ్వాలని భావించారు. అలాగే రూ. లక్ష వరకు రుణాలున్న పెద్ద రైతులకు కేవలం రూ.5వేల వరకు మాత్రమే రాయితీ ఇస్తామన్నారు. అయితే ఈ అరకొర మాఫీపై రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరసనలకు దిగింది. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ముఖ్యమంత్రి విజయ్ సోమవారం సచివాలయంలో ఉన్నతధికారులతో అత్యవసర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రైతుల డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం పాత నిబంధనలను పక్కనబెట్టి మరింత ఉదారంగా కొత్త మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ తాజా సవరణల నిర్ణయం వల్ల తమిళనాడు వ్యాప్తంగా దాదాపు 14.43 లక్షల మంది రైతు కుటుంబాలకు అపారమైన ఆర్థిక లబ్ధి చేకూరనుంది. కాగా ఈ నిర్ణయంతో రాష్ట్రప్రభుత్వ ఖజానాపై రూ. 5,932కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడనుంది. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను క్షుణ్ణంగా అంచనా వేసిన తర్వాతే రైతుల సంక్షేమాన్ని కాంక్షించి ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. మరోవైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు ఎక్కడా విఘాతం కలగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. రుణమాఫీకి సంబంధించి సహకార బ్యాంకులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పూర్తి మొత్తాన్ని రాబోయే 45 నుంచి 60 రోజుల్లోగా పూర్తిగా చెల్లిస్తామని అధికారికంగా ప్రకటించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంపై తమిళనాడు రైతు సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

### విడాకుల కేసు ఆగస్టు 7కు వాయిదా



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ఆయన భార్య సంగీత స్వర్ణలింగంల విడాకుల వ్యవహారంలో న్యాయస్థానంలో మరోసారి ప్రతిష్టంభన ఎదురైంది. వీరిద్దరి వివాహ రద్దు పిటిషన్‌పై సోమవారం చెంగల్పట్టు కుటుంబ న్యాయస్థానం లో జరగాల్సిన విచారణ మళ్లీ వాయిదా పడింది. ఈ విచారణకు అటు ముఖ్యమంత్రి విజయ్ కానీ, ఇటు సంగీత కానీ వ్యక్తిగతంగా హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను ఆగస్టు 7వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నాటి కోర్టు విచారణకు విజయ్, సంగీత ఇద్దరూ రాలేదు. వారి తరఫు న్యాయవాదులు మాత్రమే కోర్టుకు హాజరై ప్రస్తుత పరిస్థితులను న్యాయమూర్తికి వివరించారు. ఇరుపక్షాల ముఖ్య వ్యక్తులు అందుబాటులో లేకపోవడంతో విచారణ ప్రక్రియ ఆశించిన విధంగా ముందుకు సాగలేదు. దీంతో అసంతృప్తి వ్యక్తం చేసిన న్యాయమూర్తి కేసు తదుపరి విచారణను ఆగస్టు నెలకు పొడిగించారు. ఈ కేసులో ఇలాంటి ఆలస్యం జరగడం ఇదే మొదటిసారి కాదు. గత కొన్ని నెలలుగా ఈ విడాకుల పిటిషన్ వరుస వాయిదాలతో నలుగు తోంది. అంతకుముందు జరిగిన పలు విచారణల సందర్భాల్లోనూ విజయ్, సంగీత కోర్టుకు రాలేదు. ప్రతిసారీ వారి లీగల్ రిప్రజెంటేటివ్స్ మాత్రమే హాజరవుతూ వస్తున్నారు. అంతకుముందు ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం కేసును జూన్ 15వ తేదీ అంటే సోమవారం రోజుకు వాయిదా వేసింది. అయితే ఈసారి కూడా వారిద్దరూ రాకపోవడంతో కేసు మరింత కాలం ముందుకు పడేలా చేసింది.

# హర్ముజ్‌ను దాటిన ఐదు నౌకలు

## జలసంధిపై పట్టు సడలించిన అమెరికా

### అంతర్జాతీయ జలాల్లోకి రాకపోకలు




**వాషింగ్టన్, జూన్ 16:** అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం అధికారికంగా ఖరారు కానున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇంతకాలం హర్ముజ్ జలసంధిని దిగ్బంధించిన అమెరికా పట్టు సడలించింది. దాంతో కనీసం ఐదు ఇరాన్ నౌకలు ఆ జలసంధిని దాటి, అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిన తర్వాత ఆ ప్రభావం హర్ముజ్ జలసంధిలో రాకపోకలపై పడింది. అమెరికా, దాని మిత్ర దేశాల నౌకలను ఇరాన్ అడ్డుకోగా ఇరాన్ పోర్టుల నుంచి రాకపోకలు సాగించే నౌకలను అడ్డగిస్తూ అమెరికా దిగ్బంధనం ప్రకటించింది. అటు ఇరాన్, ఇటు అమెరికా హర్ముజ్‌ను దిగ్బంధించడంతో ప్రపంచ దేశాలు ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయాయి. ఇప్పుడు శాంతి ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, ఇరాన్ బృందానికి నాయకత్వం వహించిన ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ ఘాలిబఫ్ సంతకాలు చేశారు. డిజిటల్ రూపంలో ఈ సంకతాలు జరగ్గా, శుక్రవారం స్విట్జర్‌లాండ్‌లోని జెనీవాలో అధికారిక కార్యక్రమం ఉంటుంది. ఈ వరుస పరిణామాలు వేళ ఇరాన్ నౌకలు హర్ముజ్‌ను దాటాయి. శాంతి ఒప్పందంపై ప్రకటన చేసినప్పుడే హర్ముజ్ దిగ్బంధనాన్ని ఎత్తివేస్తున్నట్లు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడది వాస్తవ రూపం దాల్చినట్లు కనిపిస్తోంది.

**రెండు దశలుగా అమెరికా-ఇరాన్ చర్చలు..**

అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు రెండు దశల్లో జరుగుతాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. తొలి దశలో ప్రధాశాంశం హర్ముజ్ జలసంధి అని వెల్లడించారు. దాంతో పాటు అమెరికా దిగ్బంధనం, ఇరాన్ పునర్నిర్మాణం గురించి చర్చలు ఉంటాయని చెప్పారు. అణు సంబంధిత అంశాలు, ఆంక్షల నుంచి ఉపశమనం వంటివి రెండో దఫాలో చర్చిస్తామని పేర్కొన్నారు. అయితే, లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలే ఈ ఒప్పంద చర్చలు ఎటు వెళ్లాలో నిర్ణయిస్తాయని, ఈ విషయం ట్రంప్ యంత్రాంగానికి బాగా తెలుసునని అన్నారు. ఇజ్రాయెల్‌ను కట్టడి చేయాల్సిన బాధ్యత అమెరికాపైనే ఉందని, అది ట్రంప్‌నకు పెద్ద సవాల్‌గా మారబోతోందని వ్యాఖ్యలు చేశారు.

# శాంతి చర్చల్లో ఇద్దరు ఇరాన్ సైకాలజిస్టులు!



**ఇరాన్, జూన్ 16:** పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో జరిగిన శాంతి చర్చల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిని ఎదుర్కోవడానికి ఇరాన్ ఒక అసాధారణమైన మార్గాన్ని అనుస రించినట్లు సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ట్రంప్ మానసిక స్థితిని అంచనా వేయ డానికి, ఆయన ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి ఇరాన్ ఇద్దరు సీనియర్ సైకాలజిస్టుల సహాయం తీసుకున్నట్లు ఒక కథనం వెల్లడించింది. ట్రంప్ ఎప్పటికప్పుడు మారే స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని, చర్చల ప్రక్రియను సులభతరం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఇరాన్‌కు చెందిన ఒక అధికారి మాట్లాడుతూ ట్రంప్ ప్రవర్తనలో మానసిక రుగ్మత ధోరణులు ఉన్నాయని మేము భావించాము. అందుకే చర్చలకు సంబంధించిన సలహాదారుల బృందంలో ఇద్దరు సీనియర్ సైకాలజిస్టులను చేర్చాము. వారి సహాయంతో ట్రంప్‌నకు పంపే సందేశాలను జాగ్రత్తగా రూపొందించాము అని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో ఇస్లామాబాద్‌లో తొలి విడత చర్చలు ముగిసిన తర్వాత ఇరాన్ ఈ మానసిక నిపుణుల సలహాలు తీసుకోవడం ప్రారంభించినట్లు సమాచారం. ఈ వ్యూహం ఫలించిందని, తమ సలహాదారుల సిఫార్సులను పాటించడం మొదలుపెట్టినప్పటి నుంచి ట్రంప్ స్పందనలో స్పష్టమైన మెరుగుదల కనిపించిందని ఆ అధికారి వివరించారు. భవిష్యత్తులో ఈ చర్చల వివరాలు బయటకు వస్తే, తమ పద్ధతులు ఎంత పకడ్బందీగా ఉన్నాయో స్పష్టమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ట్రంప్ ప్రవర్తనపై అమెరికాలోనూ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ ఏడాది మొదట్లో ఇప్సోస్ నిర్వహించిన ఒక సర్వేలో 10 మంది అమెరికన్లలో 6 మంది ట్రంప్ వయసు పెరిగేకొద్దీ ఆయన ప్రవర్తన అస్థిరంగా మారిందని అభిప్రాయపడ్డారు. వీరిలో 89 డెమోక్రాట్లు, 30 రిపబ్లికన్లు ఉండటం గమనార్హం.

# పార్టీని వీడే వారు నిశ్చింతగా వెళ్లిపోవచ్చు

## శివసేన చీఫ్ ఉద్ధవ్‌థాకరే

**ముంబయి,జూన్ 16:** పార్టీని వీడాలనుకునే వారిని తాను బలవంతం చేయబోనని శివసేన అధినేత ఉద్ధవ్‌థాకరే స్పష్టం చేశారు. శివసేనను వీడాలనుకునే వారు నిశ్చింతగా వెళ్లిపోవచ్చన్న స్పష్టం చేశారు. పార్టీలో ఉండమని ఎవరిపైనా ఒత్తిడి చేయొద్దని నిర్ణయించు కున్నానని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో జరిగిన చీలిక గురించి ప్రస్తావిస్తూ బాలాసాహెబ్ థాకరే స్థాపించిన పార్టీని వీడిన వారు తమ నిర్ణయం పట్ల చివరికి పశ్చాత్తాపపడతారని థాకరే అన్నారు. ఈ రోజు నాది కాకపోవచ్చు, కానీ రేపు కచ్చితంగా నాదే. అప్పటి వరకు మనం ఇలాంటివి భరించాల్సి ఉంటుందని థాకరే అన్నారు. మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఉద్ధవ్ థాక్రే వర్గానికి చెందిన శివసేన ఎంపీలు షిండే వర్గంలో చేరబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఏడుగురు ఎంపీలు షిండేతో సంప్రదింపులు జరుపుతున్నారని, వచ్చే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లోపు వారంతా షిండే వర్గంలో చేరే అవకాశం ఉందని శివసేనకు చెందిన మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే క్రిపాలు మానె వెల్లడించారు. ఈ నేపథ్యంలో కొంత మంది పార్టీ ఎంపీల విధేయతపై వస్తున్న ఊహాగానాలపై శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాకరే మౌనం వీడారు.

# అది ట్రంప్ తీసుకొన్న నిర్ణయం

## మా ప్రయోజనాలు వేరు..

### శాంతి ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు



**జెరుసలేం, జూన్ 16:** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తనకు కొన్నిసార్లు విభేదాలు వస్తుంటాయని అంగీకరించారు. ఓ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందానికి సంబంధించి ఎదురైన ప్రశ్నకు నెతన్యాహు బదులిస్తూ.. 'నాకు, ట్రంప్‌నకు మధ్య కొన్నిసార్లు విభేదాలు వస్తుంటాయి. అమెరికాతో సంబంధాల విషయంలో ఇజ్రాయెల్ తన సొంత ప్రయోజనాలకు కట్టుబడి ఉంది. ఇరాన్‌తో శాంతి ఒప్పందాన్ని ట్రంప్ కుదుర్చుకున్నారు. అది ఆయన నిర్ణయం. మాకు మా సొంత ప్రయోజనాలు ఉన్నాయి' అని వ్యాఖ్యానించరు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు లేకుండా చూడటమే తన లక్ష్యమన్నారు. తాను అధికారంలో ఉన్నంత కాలం అది జరుగుతుందన్నారు. శాంతి ఒప్పందం ఉన్నా.. లేకున్నా ఇరాన్ వద్ద అణ్వాయుధాలు మాత్రం ఉండవని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన సైనిక ఘర్షణల్లో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ పతనమైందని నెతన్యాహు పేర్కొన్నారు. దాని సైనికులకు, వ్యూహాత్మక మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఈ నష్టం విలువ వందల బిలియన్ డాలర్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఘర్షణ ఇంకా ముగియలేదంటూ నెతన్యాహు హెచ్చరికలు చేశారు. ఇరాన్ దాని మిత్ర దేశాల నుంచి ఎదురయ్యే ముప్పులను సమర్థవంతంగా ఎదుర్కొంటూనే ఉంటామన్నారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ రక్షణ వ్యయానికి అదనంగా 350 బిలియన్ షెకెళ్లను (ఇజ్రాయెల్ కరెన్సీ) కేటాయిస్తున్నట్లు నెతన్యాహు ప్రకటించారు.

# రెండుకోట్ల బీమా కోసం భర్తను చంపిన భార్య



**బెళగావి,జూన్ 16:** కర్ణాటకలోని బెళగావి జిల్లాలో జరిగిన ఒక మాజీ సైనికుడి మృతి కేసు సంచలనం సృష్టిస్తోంది. సాధారణ బైక్ ప్రమాదంగా భావించిన ఈ ఘటన రూ.2 కోట్ల ఇన్సూరెన్స్ డబ్బుకోసం భార్య, ఆమె ప్రియుడు కలిసి పన్నిన దారుణ హత్యగా పోలీసులు స్పష్టం చేశారు. ఈ కేసులో మృతుడి భార్య, ఆమె ప్రియుడితో పాటు వైద్యులు, ఫోరెన్సిక్ సిబ్బంది సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మాజీ సైనికుడు సందీప్ మంజర్గి మార్చి 13న బైక్‌పై నుంచి జారిపడి స్వల్పంగా గాయపడ్డారు. దీంతో అతని భార్య సుమ మంజర్గి, మొదట హుక్కేరి ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ఘటప్రభలోని జేజీ ఆసుపత్రికి మార్చింది. మార్చి 15న సందీప్ గుండెపోటుతో మరణించి నట్లు వైద్యులు ప్రకటించారు. పోస్టుమార్టం నిమి త్తం మృతదేహాన్ని బీఐఎంఎస్ ఆసుపత్రికి తర లించగా, ప్రాథమిక ఫోరెన్సిక్ నివేదికలో కూడా ఎలాంటి విష ప్రయోగం జరగలేదని, గుండె పోటు వల్లే మరణం సంభవించిందని పేర్కొన్నారు.ప్రమాదంలో తీవ్రగాయాలు కాకపోవడం ఆరోగ్యంగా ఉన్న సందీప్ అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడంపై పోలీసులకు అనుమానం కలిగింది. ఈ క్రమంలో సుమ ప్రియుడుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పుండలీక్ దొంబార్ పెట్టిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ఈ కేసును కీలక మలుపు తిప్పింది. ప్రమాదానికి గురైన వ్యక్తి అకస్మాత్తుగా ఎలా చనిపోయాడు. అంటూ తనకు అంతా తెలిసినట్లుగా అతను పోస్ట్ పెట్టాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు కుట్ర మొత్తం బయట పడింది. పోలీసుల కథనం ప్రకారం సందీప్, పుండలీక్ గతంలో కలిసి హోటల్ వ్యాపారం చేశారు. ఈ క్రమంలోనే సందీప్ భార్య సుమతో పుండలీక్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇదే సమయంలో సందీప్ పేరు మీద మూడు వేర్వేరు కంపెనీల నుంచి సుమారు రూ.2కోట్ల విలువైన ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకున్నారు. ఆ డబ్బును కాజేయాలనే దురుద్దేశంతోనే ఈ హత్యకు పథకం పన్నినట్లు పోలీసులు గుర్తిం చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమ యంలో సుమ, పుండలీక్ కలిసి సెలైన్ బాటిల్ ద్వారా విషాన్ని, నిద్రమాత్రలను ఇచ్చి సందీప్‌ను హత్య చేశారు. అనంతరం ఈ హత్యను గుండెపోటుగా చిత్రీకరించేందుకు వైద్య, ఫోరెన్సిక్ సిబ్బందికి రూ.3లక్షలకు పైగా లంచం ఇచ్చి నివేదికలను తారుమారు చేయించారు. నిందితుల నుంచి విషం సీసాలు, సిరంజిలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సందీప్ భార్య సుమ, ప్రియుడు పుండలీక్‌తో పాటు డాక్టర్ బసవరాజ్, ఎఫ్‌డీఏ అధికారి అశోక్, ఎఫ్ఎస్ఎల్ క్లర్క్ అప్పాసాహెబ్ సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేశారు.

# చైనా, జపాన్, ఇండోనేసియాల్లో భూకంపం

## డ్రాగన్ కంట్రీలో ఒకరి మృతి, నలుగురికి గాయాలు

**న్యూఢిల్లీ/బీజింగ్, జూన్ 16:** చైనా, జపాన్, ఇండోనేషియాలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం భూకంపాలు సంభవించాయి. అత్యధికంగా 6.7 తీవ్రతతో ఇండోనేషియాలోని సులవేసి ద్వీపంలో భూకంపం సంభవించగా, ఆ తర్వాత చైనాలోని క్వింగ్‌హైలోని హైక్సీ ప్రిఫెక్చర్‌లో 6.3 తీవ్రతతో, జపాన్‌లోని హోన్షు తూర్పు తీరానికి సమీపంలో 6 తీవ్రతతో ప్రకంపనలు సంభవించాయి. చైనాలో భూకంపం కారణంగా ఒక వ్యక్తి మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు. ఇండోనేషియాలో ఎనిమిది మంది



గాయపడ్డారు. జపాన్‌లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. స్థానిక మీడియా కథనం ప్రకారం, ఇండోనేషియాలోని పాలుకు తూర్పు ఆగ్నేయంగా స్థానిక కాలమాన ప్రకారం ఉదయం 10:27 గంటలకు ప్రకంపనలు సంభవించినట్లు మొదట నివేదికలు వెలువడ్డాయి. దాదాపు 4 లక్షల జనాభా ఉన్న పాలు, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లోకి ఈ ప్రకంపనలు ప్రజలను పరుగులు పెట్టించాయి. పైకప్పులు కూలిపోవడం, గోడలు బద్దలవడం, శిథిలాలు వీధులపై చెల్లాచెదురుగా పడటంతో భారీ నష్టం వాటిల్లింది. నష్టం, నిరాశ్రయులైన ప్రజల గురించిన సమాచారం ఇంకా సేకరిస్తున్నట్లు ఇండోనేషియాలోని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. భూకంప కేంద్రం 43 కిలోమీటర్ల ఎత్తులో, సుమారు 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు సమాచారం. ఆ తర్వాత అనేక ప్రకంపనలు సంభవించాయి, వాటిలో అత్యంత బలమైనది 5.2 తీవ్రతతో నమోదైంది. ఇండోనేషియాలో మాదిరిగానే, క్వింగ్‌హైలో కూడా 4.9 తీవ్రతతో సహా అనేక ప్రకంపనలు సంభవించాయి.

# రెండు ట్రక్కులు ఢీ

## ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనం



**భువనేశ్వర్, జూన్ 16:** ఒడిశాలో దారుణం జరిగింది. రెండు ట్రక్కులు ఢీకొన్న ఘటనలో వాటిలోని ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనమయ్యారు. ఈ ఘటన మంగళవారం ఉదయం ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లా, భస్మా పోలీస్ స్టేషన్ పరిధిలో కైంత్రా వద్ద, పదో నెంబర్ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైవేపై ఝూర్సుగూడ నుంచి సుందర్‌గఢ్ వెళ్తున్న ట్రక్కు అతివేగం కారణంగా అదుపు తప్పింది. వేగాన్ని డ్రైవర్ నియంత్రించలేకపోవడంతో డివైడర్‌ను దాటిన ట్రక్కు ఒకవైపు నుంచి మరోవైపు రోడ్డు మీదికి వెళ్లిపోయింది. దీంతో అటువైపు నుంచి వస్తున్న ట్రక్కును ఢీకొంది. ఇలా రెండు ట్రక్కులు ఢీకొనడంతో వెంటనే మంటలు చెలరేగాయి. అవి పెద్ద ఎత్తున వ్యాపించి, పూర్తిగా అంటుకున్నాయి. ఈ ఘటనలో రెండు ట్రక్కుల్లోని డ్రైవర్లు మంటల్లో సజీవదహనమయ్యారు. మంటల తీవ్రత కారణంగా డ్రైవర్ల మృతదేహాలు తీవ్రంగా కాలిపోయాయి. ఇంకా డ్రైవర్లను గుర్తించాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# డాక్టర్ చీటీ ఉంటేనే దగ్గు సిరప్

## కేంద్రం కఠిన ఆదేశాలు




**న్యూఢిల్లీ, జూన్ 16:** దగ్గు మందు విక్రయాల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. దగ్గు సిరప్‌లను కొనేందుకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి అని కేంద్రం పేర్కొన్నది. ఈ నేపథ్యంలో కాఫ్‌సిరప్ విక్రయాలకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌ను తప్పనిసరి చేస్తూ డ్రగ్స్ రూల్స్ 1945 కింద నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో కాఫ్ సిరప్‌లు షెడ్యూల్ కే డ్రగ్స్ జాబితాలోని క్లాస్ ఆఫ్ డ్రగ్స్ సెక్షన్‌లో 7వ ఎంట్రీగా ఉండేవి. దీంతో, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకపోయినా మెడికల్ షాపులు వినియోగదారులకు కాఫ్‌సిరప్‌లను విక్రయించే అవకాశం ఉండేది. ఈ షెడ్యూల్‌కు కేంద్రం తాజాగా మార్పులు చేసింది. కాఫ్ సిరప్‌లను షెడ్యూల్‌కేలోని మినహాయింపు జాబితా నుంచి తొలగిస్తున్నట్టు తెలిపింది. ఈ కొత్త రూల్‌కు సంబంధించిన ముసాయిదా నిబంధనలను కేంద్రం గతేడాది డిసెంబర్‌లోనే విడుదల చేసింది. ప్రజల అభిప్రాయాన్ని సేకరించింది. అనంతరం, తుది మార్గదర్శకాలను కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ తాజాగా జారీ చేశారు. ఈ నేపథ్యం లో దేశవ్యాప్తంగా మెడికల్ షాపులన్నీ ఇకపై మెడికల్ ప్రిస్క్రిప్షన్ ఉన్న వారికే సిరప్‌లను విక్రయించాల్సి ఉంటుంది. తమిళనాడుకు చెందిన శ్రీసన్ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తాగి సుమారు 20 మంది చిన్నారులు మృతి చెందారు. అయితే ఆ ఘటన పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ తయారీకి చెందిన దగ్గు మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూహెచ్‌వో తన హెచ్చరికల్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

# రాహుల్ గాంధీ వెన్నుపోటుదారుడు: డిఎంకె ఫైర్

**చెన్నై, జూన్ 16:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై డిఎంకె ఐటీ సెల్ తీవ్ర విమర్శలు గుప్పించింది. తమిళనాడులో కాంగ్రెస్, డిఎంకె కూటమి విడిపోవడంతో విమర్శలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకుడిని 'ఎ బిగ్ జోక్' అని అభివర్ణించింది. కాంగ్రెస్ అవసరాల కోసం తమను వాడుకుని, ఆ తర్వాత కొత్త పొత్తుల కోసం వెళ్లిపోయారని విమర్శించింది. కాంగ్రెస్ రాజకీయ మనుగడ కోసం పోరాడుతున్నప్పుడు తాము వారిని



భుజాలపై మోసాము, కానీ కొత్త మెరిసే బొమ్మను చూడగానే వారు పడవ నుండి దూకేశారని మండిపడ్డారు. ఇదే సమయంలో డిఎంకె పత్రిక 'మురసోలి'లో తన సంపాదకీయంలో ఇండియా కూటమి సమావేశం తర్వాత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టింది. ప్రతిపక్ష పార్టీల మధ్య చీలికలకు కాంగ్రెస్ నాయకుడే కారణమని ఆరోపించింది. అయితే ఇండియా కూటమిలోని ఇతర ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తిన అంశాలకు తాము మద్దతు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. రాహుల్ గాంధీ ప్రతిపక్షాల ఐక్యత గురించి బోధిస్తూనే, దానిని బలహీనపరుస్తున్నారని మండిపడింది. ప్రభుత్వాలు ఏర్పాటు చేసే తమ అవకాశాలను దెబ్బతీస్తోందని కూటమి భాగస్వాములే ఆరోపించినప్పుడు, కాంగ్రెస్ ఇప్పుడు ప్రతిపక్షాల ఐక్యత గురించి ఎలా మాట్లాడగలదని ప్రశ్నించింది. ఇండియా కూటమి సమావేశంలో వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ సహా పలు ఇండియా బ్లాక్ భాగస్వామ్య పార్టీలు కాంగ్రెస్‌ను విమ ర్శించాయని పేర్కొంది. రాహుల్ గాంధీ రాజకీయ వైఖరి ప్రతిపక్ష కూటమిలో పదేపదే ఘర్షణలకు దారితీసిందని వాదించింది.

# అయోధ్య రాముడికి ఖరీదైన ప్రసాదం

**ప్రయాగ్‌రాజ్, జూన్ 16:** ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మామిడి పండును అయోధ్య బాల రాముడికి నైవేద్యంగా పెట్టారు. జపాన్‌కు చెందిన మియాజాకీ అనే ప్రత్యేకమైన మామిడిపళ్లు కిలో రూ.2.5 నుంచి రూ.3 లక్షల వరకు ఉంటాయి. ఒక్కో పండు ధర దాదాపు రూ.లక్షకు పైగానే ఉంటుంది. ఓం ప్రకాశ్ సింగ్ అనే రైతు వీటిని పండించగా.. అతడి నుంచి కొనుగోలు చేసిన సీజన్‌లోని మొట్టమొదటిగా పండిన పండును స్థానిక సంప్రదాయాలకు అనుగుణంగా తులసి ఆకుల్లో పెట్టి బాలరాముడికి నైవేద్యంగా సమర్పించారు.

# సంక్షిప్త వార్తలు

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే: ఖర్గే



**న్యూఢిల్లీ, జూన్ 16:** నీట్ పేపర్ల లీకేజీ, సిబిఎస్ఇ పరీక్షల అక్రమాలు జరిగినప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. సదరు మంత్రిని రాజీనామా చేయమని కోరకపోవడం ద్వారా మోడీ సర్కార్ జవాబుదారీతనం అనే పరీక్షలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ మేరకు ఖర్గే మంగళవారం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఎన్‌డిఏ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. జూన్ 21న జరగనున్న నీట్ యూజీ 2026 రీఎగ్జామ్‌కు ముందు టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్ పై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని కూడా ఖర్గే తప్పుపట్టారు. పరీక్షల్లో జరిగిన అక్రమాల వల్ల దాదాపు అరడజను మంది యువకులు ప్రాణాలు తీసుకున్నారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు.

## భవానీపూర్ ఫలితాలపై హైకోర్టులో మమత పిటిషన్

**కోల్‌కతా, జూన్ 16:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గంలో బిజెపి నేత సువేందు అధికారి చేతిలో ఓటమి పాలైన మమతా బెనర్జీ, ఆ ఫలితాలను సవాల్ చేస్తూ కోల్‌కత్తా హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆమె ఆరోపిస్తున్నారు. దీనిపై న్యాయవిచారణ జరపాలని, సంబంధిత ఎన్నికల రికార్డులను భద్రపరచాలని కోరుతూ మమతా బెనర్జీ మంగళవారం హైకోర్టులో స్వయంగా పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ నేరుగా కోల్‌కతా హైకోర్టుకు హాజరవడం ఇది రెండోసారి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భవానిపూర్ నియోజకవర్గం నుంచి సువేందు అధికారి మమతా బెనర్జీపై 15,105 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఫలితంపై మమత అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

## చర్చించాకే టిఎంసి రెబెల్ ఎంపిల విలీనంపై నిర్ణయం

**న్యూఢిల్లీ, జూన్ 16:** తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ వర్గీయులతో చర్చించాకే ఆ పార్టీ రెబల్ ఎంపిలు విలీనంపై లోక్‌సభ స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. టిఎంసి రెబల్ ఎంపిలు తాము ఎన్‌సిపిఐలో విలీనమయ్యామంటూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఇటీవల లేఖ అందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పీకర్ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తిరుగుబాటు చేసిన 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపిల స్థితిగతులను లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా పరిశీలిస్తున్నారని, రెండు వర్గాల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ కార్యాలయం మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి ఎంపిల బృందానికి అధికారిక సమావేశం కోసం ఆహ్వానిస్తూ ఇ-మెయిల్ పంపిందని స్పష్టం చేశాయి. తిరుగుబాటు వర్గం కోరిన విలీన అభ్యర్థనపై, పార్టీ అధికారిక నాయకత్వంతో చర్చించిన తర్వాతే స్పీకర్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వెల్లడించాయి.

## ఎయిరిండియా విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్



**న్యూఢిల్లీ, జూన్ 16:** కన్నూర్‌నుంచి జెడ్డా బయలుదేరిన ఎయిరిండియా విమానంలో సాంకేతికలోపం తలెత్తింది. టేకాఫ్ అయిన కాసేపటికే ఇంజిన్‌లో సమస్య ఉన్నట్లు వార్నింగ్ లైట్స్ వెలగడంతో పైలట్లు వెంటనే అప్రమత్తమయ్యారు. ముందుజాగ్రత్త గా గాల్లోనే రెండుగంటల పాటు చక్కర్లు కొట్టించి ఇంధనాన్ని పూర్తిగా ఖర్చు చేశారు. తర్వాత కన్నూర్ ఎయిర్ పోర్టులోనే ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు.దీంతో అందులోని 180 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఇంజిన్ ఫ్యూయల్ ఫిల్టర్‌లో లోపమే దీనికి కారణమని అధికారులు గుర్తించారు.

## జస్పాల్ రాణా తల్లి కన్నుమూత



**న్యూఢిల్లీ, జూన్ 16:** దివంగత భారత షూటింగ్ దిగ్గజం, కోచ్ జస్పాల్ రాణా తల్లి శ్యామా దేవి రాణా కన్నుమూశారు. జస్పాల్ రాణా మరణించిన నాలుగు రోజులకే ఆయన తల్లి కూడా మరణిం చటంతో వారి కుటుంబంలో విషాదఛా యలు అలుముకున్నాయి. కుమారుడి ఆకస్మిక మరణాన్ని శ్యామా దేవి తట్టుకోలేక తీవ్ర మనోవేదనకు గురైనట్టు వారి కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఢిల్లీలోని ఆర్మీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె తుది శ్వాస విడిచారు.

17-6Pg6exHMNWJQE_17-6Pg6exHMNWJQE.qxd 17/Jun/26 12:13 AM Page 1



# అమెరికా విమాన ప్రమాదంలో కోసిగి యువకుడు మృతి

• ప్యారాచ్యూట్‌తో విన్యాసం.. విమానంలో సాంకేతిక లోపం

• పైలట్‌తో సహా 12 మృతి... అందులో కోసిగి వాసి



**కోసిగి, జూన్ 16 ప్రభాతవార్త:** అమెరికాలోని మిస్సోరిలో జరిగిన విమాన ప్రమాదంలో కర్నూలు జిల్లా కోసిగి మండలం తుమ్మిగనూరు గ్రామానికి చెందిన సాయి కార్తిక్ వర్మ(28) అనే యువకుడు మృతి చెందాడు. కోసిగి మండలం తుమ్మిగనూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రాజు కుమారుడు గత 10 సంవత్సరాల నుండి అమెరికాలోని మిస్సోరిలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా తన క్లాస్‌మేట్‌తో కలిసి విమానంలో నుండి కిందికి ప్యారాచ్యూట్ ద్వారా దిగే విన్యాసాలు చేసేవారు. ఇలాగే గతంలో కూడా పలు మార్లు ఈ విన్యాసాలు చేసినట్లు తెలిపారు. మరోసారి ఈ విన్యాసాలు చేయాలని సంకల్పించి ఆదివారం వారికి సెలవు కావడంతో తన స్నేహితులతో కలిసి విమానంలో విహారం చేసేవారని వారి తల్లిదండ్రులు తెలిపారు. కాగా తన కుమారుడితో పాటు అమెరికా దేశానికి చెందిన వారు కూడా ఈ విన్యాసం చేస్తుండడంతో వారి తల్లిదండ్రులు ఈ విన్యాసాన్ని చూసేందుకు వెళ్లారు. కాగా విమానం 300 మీటర్ల ఎత్తుకు వెళ్లింది. వెంటనే విమానంలో సాంకేతిక లోపం రావడంతో ఆ యువకుల తల్లిదండ్రులు ఎదుటే ఆ విమానం కుప్పకూలిపోయినట్లు చెప్పారు. దీంతో తమ కళ్లెదుటే ఈ సంఘటన జరగడంతో వారు పడిన వేదన వర్ణింపరానిదని అక్కడి వారు తెలిపినట్లు కోసిగి యువకుడి తండ్రి తెలిపారు. కాగా తుమ్మిగనూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రాజు, దాక్ష పద్మావతిలకు ఒకే కుమారుడు వంటం కొద్ది పొలాలు ఉన్నాయి. అబ్బాయిని బాగా అమెరికాలో చదివించారు. ఎంతో కష్టపడ్డారు. తుమ్మిగనూరు నుండి రాజానగర్‌కు మకాం మార్చారు. అక్కడే దైరిఫాం ఏర్పాటు చేసుకుని అప్పుడప్పుడు తుమ్మిగనూరుకు వచ్చి తమ పొలాలను చూసుకునేవారు. అయితే తన కుమారుడు సాయి కార్తిక్ వర్మ స్థిర పడితే ఇక్కడి ఆస్తులన్ని విక్రయించి తాము కూడా అమెరికాకు వెళ్లి తన కుమారుడితోనే ఉండాలని ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. అంతలోనే ఇలా విమాన రూపంలో మృత్యువు తన కుమారుడిని కబలించిందని తల్లిదండ్రులు వాపోయారు. తుమ్మిగనూరు రాజు పిలువబడే సుబ్రమణ్యం రాజు గతంలో నుండే తెలుగుదేశం పార్టీలో కొనసాగేవాడు. తన కుమారుడి దుర్ఘటన జరిగిన విషయాన్ని తెలుసుకున్న పలువురు టిడిపి నాయకులు ఆయనకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసారు.

## రైల్వే సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్

# కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడి




తురకపల్లి రైల్వేస్టేషన్ (ఫైల్‌ఫోటో)

**గుత్తి, జూన్ 16 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా గుత్తి రైల్వే జిఆర్‌పి పరిధిలో గుత్తి - కల్లూరు రైలేస్టేషన్ల నడుమ తురకపల్లి రైల్వే హాల్టింగ్ స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని అగంతకులు తమ సాంకేతిక నైపుణ్యంతో రైల్వే సిగ్నల్ సిస్టంను ట్యాంపరింగ్ చేసి రైలు ఆగేలా చేసి దోపిడికి పాల్పడ్డారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మైసూర్ నుండి కాచిగూడ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు (12786)ను ఆధునిక పరిజ్ఞానంతో తురకపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఆగేలా చేశారు. అనంతరం ముసుగు ధరించిన వ్యక్తులు ఎస్-2, ఎస్-4, ఎస్-6, ఎస్-7 నెంబర్ల కంపార్ట్‌మెంట్లలో యధేచ్చగా దోపిడీకి పాల్పడ్డారు. రైలులో ప్రయాణిస్తున్న రేణుక అనే మహిళా ప్రయాణికు రాలి వద్ద 37 గ్రాముల విలువైన బంగారు ఆభరణం, అనంతపురంకు చెందిన యశోదమ్మ వద్ద 4.2 గ్రాముల విలువైన నల్లపూసల దండ, మైసూర్‌కు చెందిన వైష్ణవి వద్ద ఐఫోన్-15, మైసూర్ నుండి మహబూబ్‌నగర్ వెళుతున్న సుచిత్ర వద్ద ఐదు తులాల బంగారం ఆభరణాన్ని అపహరించారు. అంబికా అనే ప్రయాణికురాలి వద్ద చోరికి విఫలయత్నం చేశారు. గతంలోనూ ఈ ప్రాంతంలో దోపిడీలు జరిగాయి. ఈ సంఘటనపై ఐఆర్‌పి సిఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గుత్తి రైల్వే జిఆర్‌పి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆక్వా ఫీడ్ ధరలను తగ్గించండి

• వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ • జులై 1 లేదా 2న రైతులతో కలిసి ఆందోళన



ఆక్వా రైతులతో మాజీ సిఎం జగన్

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** దారుణంగా పెరిగిన ఆక్వా ఫీడ్ ధరలను ఈనెలాఖరులోగా తగ్గించాలని, లేని పక్షంలో వచ్చే నెల 1 లేదా 2వ తేదీన రైతులతో కలిసి ఆందోళన చేస్తామని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సిపి అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. 2019-24 మధ్య ఆక్వా రంగానికి తమ ప్రభుత్వం పూర్తి అండగా నిల్చిందన్నారు. ఆక్వా రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పరిస్థితుల మధ్య వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆక్వా రైతులతో పాటు, ఏపి ప్రాన్ ఫెడరేషన్ ప్రతినిధులు వైయస్సార్‌సిపి కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ సమస్యలు వివరించారు. వారి సమస్యలు సావధానంగా విన్న వైయస్ జగన్, ఆక్వా రైతులకు పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామని, 57 నెలల్లో ఆ మేరకు విద్యుత్ సబ్సిడీ కింద రూ.3,306 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. 2014-19 మధ్య అదే యూనిట్ విద్యుత్‌కు రూ.3.85వసూలు చేసిన నాటి సీఎం చంద్రబాబు, 2019లో ఎన్నికలకు 6 నెలల ముందు ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.2కే అంటూ జీఓ జారీ చేసినా అమలు చేయలేదని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా జోన్ లోపల రైతులకు సబ్సిడీ కత్తిరింపులపై బెదిరిస్తున్నారని, ఆ దిశలోనే వారం క్రితం జీఓ ఆర్‌టీ:169 జారీ చేశారని, అందులో క్లాజ్ నెం:4లో పవర్ ఫ్యాక్టర్ (పీఎఫ్) నిర్వహణపై రూల్ పెట్టారని చెప్పారు. అది ఆక్వా రైతులు వాడే మోటార్లకు చాలా కష్టం అన్న ఆయన, ఆ విధంగా ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ కట్ చేసే కుట్ర జరుగుతోందని ఆక్షేపించారు. తాము అప్పుడైనా, ఇప్పుడైనా ఎప్పుడూ ఆక్వా రంగానికి పూర్తి అండగా ఉంటామని స్పష్టం చేశారు.

# కాంట్రాక్టు పారామెడికల్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న డైరెక్ట్ కాంట్రాక్టు పారామెడికల్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని, గ్రాస్ శాలరీ చెల్లించాలని పారామెడికల్ సిబ్బంది రేపు నిర్వహిస్తున్న రాష్ట్ర ధర్నాకు ఏపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ జెఎసి రాష్ట్ర కమిటి మద్దతు తెలిపింది. వీరి డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, డైరెక్ట్ కాంట్రాక్ట్ సిబ్బందికి చెల్లించాల్సిన వేతన బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు పత్రికా ప్రకటను విడుదల చేసింది. 'వైద్య, ఆరోగ్య శాఖలో, ఇతర శాఖలలో, వివిధ ప్రభుత్వ పథకాలు, సంస్థలలో కాంట్రాక్ట్ సిబ్బంది ఏళ్ళ తరబడి పనిచేయించుకోవడం సరైందికాదంది. కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీసం పిఎఫ్, ఇఎసఐలు కూడా అమలు చెయ్యకుండా రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయించుకుంటున్నాయి. ఉద్యోగులు చనిపోతే వారి కుటుంబాలు ఎటువంటి ఆధారం లేకుండా రోడ్డున పడుతున్నాయి. దాదాపు 3 లక్షల మంది ఆప్కాస్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులది ఇదే పరిస్థితి. అందరికీ ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ఈఅంశాలను దృష్టిలో పెట్టుకొని ఉద్యోగులను రెగ్యులరైజ్ చెయ్యాలని, ఈలోగా గ్రాస్ శాలరీ చెల్లించాలని, సర్వీసులో ఉండగా మరణించిన వారికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కాంపాషినేట్ అపాయింట్‌మెంట్లు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐలు అమలు చేయాలని, 8 గంటల పనివిధానం వర్తింపచేయాలని" రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ జెఎసి రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది.

## సర్దార్ పాపన్న గౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి



**కాకినాడ, జూన్ 16 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర గౌడ సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ తాతా కృష్ణారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో జరిగిన గౌడ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 18న పాపయ్య గౌడ్ జయంతి జరగనుందని రాజధానిలో 10 ఎకరాలు సర్దార్ పాపయ్య గౌడ్ స్మృతివనం భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్‌లో గౌడ భవనాలు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. గౌడ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి అనేక ఇబ్బందులు పడుతున్న గౌడ కులస్తులను అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గౌడలు ఐక్యతతో ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. రాబోవు ఎన్నికలలో తమకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన పార్టీల వెంట తాము ఉంటామని గౌడ సామాజిక వర్గాన్ని నిర్లక్ష్యం చేయరాదని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మట్ట వీరబాబు గౌడ్ తెలిపారు జిల్లా, మండల స్థాయిలో గౌడలు తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి తమ సమస్యలను పరిష్కరించుకుంటూ అభివృద్ధి పథంలో పైనించాలన్నారు.

## మంత్రి సంధ్యారాణికి అస్వస్థత



**సాలూరు, జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్ర మహిళ, శిశు గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి పాల్గొనేందుకు వెళ్తున్న క్రమంలో మార్గ మధ్యలో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది హుటాహుటిన విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని తెలుస్తుంది. కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేస్తారని మంత్రి క్యాంపు కార్యాలయం నుండి సమాచారం.



మృతిచెందిన బాలుడిని పట్టుకుని రోదిస్తున్న తల్లి

## బస్సు ఢీకొని బాలుడు మృతి

**మంత్రాలయం, జూన్ 16, ప్రభాతవార్త:** మంత్రాలయంలో కర్ణాటక బస్సు ఢీకొని ఓ బాలుడు మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మైసూర్‌కు చెందిన ఒరిస్సా అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో మంత్రాలయం వచ్చారు. అభయాంజనేయస్వామి దర్శనం ముగించుకుని రోడ్డు దాటుతుండగా కర్ణాటక బస్సు నుంచి యాత్రికులతో వచ్చిన బస్సు కార్తీక్(4) అనే బాలుడిని ఢీకొంది. దీంతో బాలుడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు తమ కళ్లముందే మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జున ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు

తిరుపతి, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఎడిజె కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు నిచ్చారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. 74/2018 కేసులో ముద్దాయి వేలూరు జిల్లా పెరియపట్టికి చెందిన ముత్తు ఏలుమలైపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.



## అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు వితరణ చేస్తున్న ట్రస్ట్‌కు విరాళాలు అందుతున్నాయి. మంగళవారం ఉదయం ఒంగోలుకు చెందిన విజన్ ఆటోమొబైల్స్ సంస్థ వెంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించింది. ఆ సంస్థ ప్రతినిధులు తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి విరాళం డిడిని అందజేశారు.

## తిరుమల సమాచారం



### పెరియాళ్వార్ ఉత్సవాలు ప్రారంభం

**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న లక్ష్మీ నారాయణస్వామి ఆల యంలో వైష్ణవ సంప్రదాయ మహామహుడు, శ్రీమహా విష్ణువు పరమభక్తుడు పెరియాళ్వార్ ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ఆరంభమయ్యాయి. ఈ ఉత్సవాలు జూన్ 25వ తేదీ వరకు భక్తిశ్రద్ధలతో కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి తమ శిష్యబృందంతో కలిసి పెరియాళ్వార్ సన్నిధిలో దివ్యప్రబంధ పాశురాలను భక్తిపూర్వకంగా నివేదించి ఆధ్యాత్మిక సౌరభాన్ని వెదజల్లారు. ఉత్సవాల చివరిరోజైన జూన్ 25న ఉదయం పెరియాళ్వార్‌కు తిరుమంజనం నిర్వహించనున్నారు. సాయంత్రం గోవిందరాజస్వామి గరుడ వాహనంపై, పెరియాళ్వార్ గజవాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యమంగళ దర్శనం ప్రసాదించనున్నారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, ఇతర అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# తిరుమలలో పెరిగిపోతున్న వాహనాలు

• కాలుష్య నియంత్రణ దిశగా అడుగులు • తిరుపతి అలిపిరి వద్దే పార్కింగ్ ఏర్పాట్లు




**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్యతోబాటు వాహనాలు పెరిగిపోతుండటంతో కొండపై పార్కింగ్ సమస్య తీవ్రమవుతోంది. తిరుమలలో సుమారు నాలుగువేల వరకు వాహనాలకు మాత్రమే పార్కింగ్ సదుపాయం ఉంది. ఆ తరువాత వాహనాలు వస్తే ఎక్కడ పార్కింగ్ చేయాలనేది తీవ్రమైన సమస్యగా మారింది. దీన్ని పరిష్కరించాలని ఎప్పటి నుండో టిటిడి అధికారులు ప్రతిపాదనలు రూపొందించినా కార్యాచరణలో అమలుకు నోచుకోవడం లేదు. దీంతో చాలావరకు యాత్రికుల వాహనాలు అలిపిరి టోల్‌గేట్ దాటడానికి దాదాపు 40నిమిషాలు సమయం పడుతోంది. అదేగాక తిరుమలలో ఉన్న 7,900వరకు గదులు కూడా 40వేల మంది భక్తులకు మాత్రమే వసతి కల్పించే వీలుంది. ఆ పై భక్తులు తిరుమలకు వచ్చినా ఎక్కడ విశ్రాంతి తీసుకోవాలి, ఎక్కడ ఉండాలనేది కూడా తలనొప్పి సమస్య. దీన్ని కొంతవరకు నియంత్రించడానికి టిటిడి అధికారులు తిరుమల కొండ క్రిందనే అలిపిరి సమీపంలో శాశ్వత పార్కింగ్ సమస్య పరిష్కారానికి ఆలోచన చేస్తున్నారు. ఇందుకోసం అలిపిరి సమీపంలోని జూ పార్క్ రోడ్డులో సుమారు 300 ఎకరాల అటవీ స్థలం ఉండటంతో వారికి ప్రత్యామ్నాయంగా టిటిడి స్థలాలు కేటాయించి, ఆ స్థలంలో విస్తృతమైన విశాల పార్కింగ్ వసతి, స్కానింగ్ హబ్ ఏర్పాటు దిశగా టిటిడి అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఇప్పటికే సాధారణ రోజుల్లోనూ తిరుమలకు దేశం నలుమూలల నుండి లక్షమందివరకు భక్తులు వస్తున్నారు. 4వేల వరకు వాహనాలు తిరుమలకు చేరుతున్నట్లు టిటిడి అధికారుల అంచనా. ఈ లెక్కన వాహనాలు సంఖ్య పెరిగితే దీనివల్ల ఘాట్‌రోడ్లపై వాతావరణం కాలుష్యం కూడా ఎక్కువవుతోందని శాస్త్రవేత్తల ఆవేదన.

సామాన్యభక్తుల దర్శనాలకు, వసతికి ప్రాధాన్య తనిస్తున్న టిటిడి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తిరుపతిలోనే పార్కింగ్ సదుపాయం కల్పించాలని ఆలోచన చేస్తున్నారు. దేశం నలుమూలల నుండి వచ్చే యాత్రికుల వాహనాలను కొండ క్రిందే పార్కింగ్ చేయించాలని చూస్తున్నారు. భక్తుల సదుపాయాలపైన కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అవసరమైన మార్పులు చేస్తోంది. తిరుమల కొండ పైన వాహనాల రద్దీ నివారణ కోసం కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం వాహనాల రద్దీ కారణంగా కాలుష్యం కూడా పెరిగిపోతోంది. కొత్త ప్రతిపాదనల మేరకు కొండ కిందే పార్కింగ్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు.

తిరుపతిలోని పార్కింగ్ ప్రాంతం నుండి విద్యుత్ బస్సుల్లో యాత్రికులు తిరుమలకు చేరుకునే విధంగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సాధారణ రోజుల్లో తిరుమలకు గంటకు ఎన్ని వాహనాలు వస్తున్నాయి, ఎన్ని వాహనాలు తిరుగు ప్రయాణమవుతున్నాయి. వీటి పార్కింగ్ ఎక్కడ అనేది ఏఐ ద్వారా పరిశీలిస్తున్నారు.

ఒక్కోరోజు గంటకు 400వరకు వాహనాలు తిరుమలకు వస్తుండటం విశేషం. మరీ రోజంతా ఉదయం నుండి సాయంత్రంలోపు నాలుగువేల వరకు వాహనాలు చేరుతుండటంతో పార్కింగ్ సమస్య జటిలమవుతోంది. అలిపిరి వద్ద అధునాతన విశ్రాంత భవనం మెగా టౌన్‌షిప్ ఏర్పాటు కూడా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇవన్నీ రానున్న సెప్టెంబర్ బ్రహ్మోత్సవాల లోపు కార్యరూపం దాల్చి సిఎం చేతుల మీదుగా పనులు ప్రారంభించాలని ఆలోచన చేస్తున్నారు.



## గంగమ్మకు భక్తిశ్రద్ధలతో మరుపొంగళ్లు

**తిరుపతి, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి ప్రజల ఆరాధ్య దైవమైన తాతయ్యగుంట గంగమ్మకి నిర్వహించే ఐదవ మరు పొంగళ్ళు కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక ఉత్సాహంతో వైభవంగా జరిగింది. గంగమ్మ జాతర అనంతరం ఐదు మంగళవారాల పాటు కొనసాగుతున్న మరు పొంగళ్ళు సంప్రదాయంలో చివరి మంగళవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలు నిర్వహించారు. భక్తులు పొంగళ్ళు సమర్పించి కుటుంబ శ్రేయస్సు, సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఆలయ ప్రాంగణం భక్తుల గోవింద నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో కళాకారులు వివిధ పురాణ, జానపద, దైవిక పాత్రల వేషధారణలతో పాల్గొని భక్తులను ఆకట్టుకున్నారు. నేరేళ్లమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర గంగమ్మ ఆలయం వరకు భక్తి పారవశ్యంతో కొనసాగింది. డప్పుల మోతలు, భక్తి గీతాలు, జై గంగమ్మ నినాదాల మధ్య కళాకారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా మాజీ గంగమ్మ గుడి చైర్మన్, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి గంగమ్మ పై తిరుపతి ప్రజలకు ఉన్న అపారమైన భక్తి, విశ్వాసానికి మరు పొంగళ్ళు కార్యక్రమాలు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలు సమాజంలో ఐక్యతను పెంపొందించి భారతీయ సంస్కృతిని భావితరాలకు చేరవేస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని, లోకక్షేమం చేకూరాలని గంగమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు. దర్శనం అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

## కురుక్షేత్రలో 25 నుండి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** హర్యానా రాష్ట్రంలో పుణ్యక్షేత్రమైన కురుక్షేత్ర వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుండి జులై 3వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు ముందుగా జూన్ 24న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు సన్నాహకంగా జూన్ 19న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వ హిస్తారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పులు, పూజా సామగ్రిని పవిత్ర జలాలతో శుద్ధి చేసి, నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. జూన్ 25న ధ్వజారోహణం, పెద్దశేష వాహనం ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ ధ్వజారోహణం నిర్వహించి, సాయంత్రం పెద్దశేష వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. 26న చిన్నశేష వాహనం, హంస వాహనంపై స్వామివారి దివ్య విహారం జరుగుతుంది. 27న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహన సేవలు నిర్వహిస్తారు. 28 నకల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం సేవలు జరుగుతాయి. 29న ఉదయం మోహినీ అవతారం, కల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహనం సేవ జరుగుతుంది. 30న హనుమంత వాహనం, గజ వాహనం, జులై 1న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం పైదివ్య దర్శనం కల్పిస్తారు. 2న రథోత్సవం, అశ్వవాహనం. భక్తుల గోవింద నామ స్మరణల మధ్య రథోత్సవం నిర్వహించి, రాత్రి అశ్వవాహనంపై స్వామివారు విహరిస్తారు. 3న చక్రస్నానం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలను ముగి స్తారు. బ్రహ్మోత్సవాల అనంతరం 4న సాయంత్రం పుష్పయాగం వైభవంగా నిర్వహి స్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి.

# రికార్డు స్థాయిలో భక్తుల లగేజీ డిపాజిట్ సేవలు

• అర కోటి మందికి పైగా భక్తులకు లగేజీ సురక్షంగా జమ బట్వాడా



**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** వేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు టిటిడి విస్తృత స్థాయిలో లగేజీ డిపాజిట్, డెలివరీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. భక్తులు శ్రీవారి దర్శనం, కాలినడక యాత్ర సమయంలో తమతో తీసుకువచ్చే లగేజీ, బ్యాగులు, సెల్ ఫోన్లను భద్రంగా ఉంచుకునేందుకు తిరుమలలో కాలినడక మార్గాల్లో కలిపి మొత్తం 65 కౌంటర్లు ఏర్పాటు చేసి 345 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో నిరంతరంగా సేవలందిస్తున్నారు. టిటిడి కల్పించిన ఈ సేవలను భక్తులు పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రికార్డు స్థాయిలో 51,38,976 మంది భక్తులు తమ లగేజీని డిపాజిట్ చేసుకున్నారు. గత ఏడాది ఏప్రిల్ లో 20,75,481 మంది భక్తులు తమ లగేజీని భద్రపరచుకోగా, ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 23,15,279 మంది భక్తులు తమ లగేజీని భద్రత పరచుకున్నారు. గత ఏడాది మే నెలలో 23,82,622 తమ లగేజీని భద్రపరచుకోగా, ఈ ఏడాది 28,23,697 మంది భక్తులు తమ లగేజీని భద్రపరచుకున్నారు. అంటే గత ఏడాది ఏప్రిల్ నెలతో పోల్చితే 2,39,798 లగేజీ డిపాజిట్లు, మే నెలతో పోల్చితే 4,41,075 లగేజీ డిపాజిట్లు అత్యధికంగా నమోదు కావడం విశేషం. తిరుమలలో రద్దీ పెరిగిన నేపథ్యంలో గత మూడు రోజుల్లో 3,41,742 మంది ఉచిత లగేజీ సేవలు వినియోగించుకున్నారు. అలిపిరి, శ్రీవారి మెట్టు కాలినడక మార్గాల ద్వారా తిరుమలకు చేరుకునే భక్తుల కోసం ప్రత్యేక డిపాజిట్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలిపిరి కాలినడక మార్గం లగేజీ కేంద్రం లో 5 కౌంటర్లు, 45 మంది సిబ్బంది (ప్రతి షిఫ్ట్‌లో 15 మంది). 10,194 లగేజీ డిపాజిట్ల సామర్థం. శ్రీవారి మెట్టు లగేజీ కేంద్రంలో 2 కౌంటర్లు, 10 మంది సిబ్బంది (ప్రతి షిఫ్ట్‌లో 5 మంది), 3,025 లగేజీ డిపాజిట్ల సామర్థం ఉంది. ఈ కేంద్రాల్లో లగేజీ డిపాజిట్ చేసిన భక్తులు తిరుమలలోని డెలివరీ కేంద్రాల్లో సులభంగా తిరిగి పొందే సౌకర్యాన్ని టిటిడి కల్పించింది. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో భక్తుల కోసం లగేజీ, సెల్ ఫోన్ డిపాజిట్ సౌకర్యం అందుబాటులో ఉంది. ఫ్రీ హాల్‌లో 8 కౌంటర్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్- 1, 2 కౌంటర్లు, నారాయణగిరి షెడ్ - 5 కౌంటర్లు, డిడి హాల్- 3 కౌంటర్లు, 300 రూపాయలు హాల్ 4 కౌంటర్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్ అప్ స్కానింగ్ (కంపార్ట్‌మెంట్03) - 2 కౌంటర్లు, డెలివరీ కేంద్రాలు తలనీలాలు సమర్పించే భక్తుల సౌకర్యార్థం కల్యాణకట్ట సమీపంలో కూడా ప్రత్యేక కేంద్రాలను టిటిడి ఏర్పాటు చేసింది.



## ముత్యాలదండల అలంకరణలో గంగమ్మ

అత్యంత మహిమాన్వితమైన తిరుపత తాతయ్యగుంట గంగమ్మ జాతర చివరి మంగళవారం ముత్యాల అలంకరణలో దర్శనమిచ్చారు. ముత్యాలు తెల్లనివి.. చల్లదనాన్నినిస్తాయి. అంతటి ముత్యాలను తానే ఆలయంలో అలంకరించుకుని భక్తులకు దర్శనమివ్వడం విశేషం. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకము చేసిన అనంతరము దాతలు కవిత, శివకుమార్, లీలాచంద్ర సహకారంతో ముత్యాల పూసలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, ఇఒ ఎ.జయకుమార్ దర్శన ఏర్పాట్లు చేయించారు.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

**కోవూరు, (నెల్లూరు), జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళా రాజకీయ సాధికారతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ప్రాధాన్యత ఇస్తుంటే ఒక హోం మంత్రిగా పనిచేస్తున్న మహిళాపై వైసిపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత నీచమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. వివిఆర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా మరింత ముందుకు రావాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ బాబులు 33శాతం రిజర్వేషన్ కల్పించి వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయంగా ఎన్నో పోరాటాలు చేసి రాష్ట్ర హోం మంత్రిగా ఎదిగిన వంగలపూడి అనితపై వైసిపి మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. రాజకీయంగా ప్రత్యర్థులను ఎదుర్కోవాలే వ్యక్తిగత అంశాలు, దుస్తులు, మేకప్ వంటి విషయాలను ప్రస్తావించడం మంచిది కాదన్నారు. రాజకీయాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి తల్లి చెల్లి భార్య వంటి మహిళా బంధువులు ఉంటారని, ఇటువంటి పరిస్థితుల్లో మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేయడం సమాజానికి మంచిది కాదన్నారు. రాజకీయ నాయకుల విధానాలు, నిర్ణయాలపై విమర్శలు చేయవచ్చు గానీ, వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. రాష్ట్ర హోం మంత్రి హోదాలో ఉన్న ఒక దళిత మహిళా ఆత్మ విశ్వాసంతో గౌరవప్రదంగా ఉండకూడదా అని ప్రశ్నించారు. సాధారణ కుటుంబం నుంచి ఉపాధ్యాయినిగా ఉద్యోగం ప్రారంభించి కష్టపడి హోం మంత్రి స్థాయికి చేరుకున్న అనితపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేసే వారిని ఆయా పార్టీల నాయకత్వం నియంత్రించాలన్నారు.

# మామిడి రైతు బేజారు

**● తోతాపురి ధర కేజీ రూ.4కు పతనం ● దిక్కుతోచని స్థితిలో తోతాపురి రైతు**



**చిత్తూరు, జూన్ 16 ప్రభాతవార్త:** జిల్లాలో మామిడి రైతు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. మామిడి సీజన్‌పై ఆశలు పెట్టుకున్న రైతుకు సీజన్ ప్రారంభం నుండి మామిడి ధర పతనం కావడంతో ఈ సీజన్ తమను నష్టాల ఊబిలోకి నెట్టివేస్తుందని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం మామిడి పల్ప్ ఫ్యాక్టరీలు రైతుల నుండి తోతాపురి రకం మామిడి కేజీ రూ.7కు కొనుగోలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా వుండటంతో రైతులు నట్టేట మునిగిపోతున్నారు. జిల్లాలో ప్రస్తుతం తోతాపురి రకం మామిడిని పల్ప్ ఫ్యాక్టరీలు రూ.4 నుండి రూ.5 వరకు రైతులకు చెల్లిస్తుండగా ర్యాంపుల వద్ద మాత్రం కేజీ తోతాపురి రూ.4 కంటే ఎక్కువకు ఎవరు కొనుగోలు చేయడం లేదు. జిల్లాలో మామిడి సీజన్ ప్రారంభం కాకముందు నుండి ఇటు జిల్లా అధికార యంత్రాంగం, మామిడి రైతులు, అటు పల్ప్ ఫ్యాక్టరీల యాజమనులు పలుమార్లు సమావేశమై చర్చలు జరిపినప్పటికీ సీజన్ ప్రారంభమైన అనంతరం మామిడి ధర మాత్రం ఏ మాత్రం పెరుగలేదు. ఈ సీజన్‌లో తోతాపురి మామిడి కేజీకి రూ.18 చెల్లించాలని మామిడి రైతు సంఘాలు ఆందోళనలు నిర్వహించి డిమాండ్ చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం కన్పించడం లేదు. గత సీజన్‌లో సైతం మామిడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రభుత్వం స్పందించి మామిడికి ప్రోత్సాహక ధర నిర్ణయించి మామిడి రైతుకు కేజీకి రూ.4 చెల్లించింది. అలాగే పల్ప్ ఫ్యాక్టరీలు తోతాపురి రకం మామిడి కేజీకి రూ.4 చెల్లించడంతో గత సీజన్‌లో తోతాపురి రైతుకు కేజీ మామిడికి రూ.8 లభించింది. జిల్లాలో 79 వేల హెక్టార్ల నుండి 97 వేల హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి పంట సాగు అవుతోంది. ఇందులో 55 వేల హెక్టార్ల విస్తీర్ణంలో తోతాపురి రకం మామిడిని అత్యధిక రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలో తోతాపురి మామిడి పండ్ల నుండి పల్ప్ తయారు చేసి ఇతర దేశాలకు శీతలన పానీయ ఫ్యాక్టరీలు, ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి 31 పల్ప్ ఫ్యాక్టరీలు వున్నాయి. ఈ సీజన్ ప్రారంభంలో కేవలం 5 ఫ్యాక్టరీలు మాత్రమే పల్ప్ చేయడానికి సిద్ధమై ప్రారంభమైనప్పటికీ రాను రాను 28 ఫ్యాక్టరీలు మామిడి పల్ప్‌ను తయారు చేయడానికి సిద్ధం అయ్యాయి. ఇందులో ప్రస్తుతం కేవలం 14 పల్ప్ ఫ్యాక్టరీలు మాత్రమే తోతాపురి మామిడిని కొనుగోలు చేసి పల్ప్‌ను తయారు చేస్తున్నాయి. మిగిలిన ఫ్యాక్టరీలు తోతాపురి మామిడిని ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు. జిల్లాలో తోతాపురి మామిడి ఉత్పత్తి అధికంగా వుండటం, పల్ప్ ఫ్యాక్టరీలు తక్కువగా వుండటంతో మామిడికి గిట్టుబాటు ధర లేకపోయినప్పటికీ రైతులు తమ తోటల్లోని తోతాపురి మామిడిని పల్ప్ ఫ్యాక్టరీలకు తరలించడానికి సిద్ధమవున్నారు. అయితే ఫ్యాక్టరీలకు తోతాపురి మామిడి అధికంగా వస్తుండటం, ఫ్యాక్టరీల్లో పల్ప్ తక్కువగా ఉత్పత్తి చేయాల్సి వుండటంతో అత్యధిక రైతులు ఫ్యాక్టరీలకు తీసుకెళ్ళిన మామిడి ఆన్‌లోడ్ చేయడానికి రెండు రోజుల సమయం పడుతున్నది. మామిడి సీజన్ జులై నెలాఖరు వరకు కొనసాగనుండటంతో జిల్లాలో వున్న అన్ని పల్ప్ ఫ్యాక్టరీలను తోతాపురి మామిడి పల్ప్‌ను తయారు చేయడానికి సిద్ధం చేస్తే మామిడి రైతులకు మామిడికి గిట్టుబాటు ధర లేకపోయినా తమ తోటల్లో ఉత్పత్తి అయిన మామిడిని సకాలంలో పల్ప్ ఫ్యాక్టరీలకు తరలించి ఎంతో కొంత మొత్తం రైతులు దక్కించుకునే అవకాశం వుంది. గత ఏడాది మామిడి సీజన్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రభుత్వం స్పందించి కేజీ తోతాపురి మామిడిపై రూ.4 ప్రోత్సాహక ధర చెల్లించింది. మామిడి సీజన్ పూర్తయిన రెండు నెలల్లో మామిడి రైతుకు ప్రభుత్వం నుండి రావాల్సిన కేజీపై రూ.4 ప్రోత్సాహక ధర వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యింది. ఈ సీజన్‌లో సైతం తోతాపురి మామిడి రైతులు గత సీజన్ కంటే ఎక్కువ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుండటంతో ప్రభుత్వం స్పందించి తోతాపురి రైతును ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

**మామిడి ధరపై సిఎం సమక్షంలో సమావేశం:** జిల్లాలో మామిడి ధర పెంచడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో ఒక వారం రోజుల్లో సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం కన్పిస్తుంది. ముఖ్యమంత్రి స్థాయిలో సమావేశం జరిగిన అనంతరం తోతాపురి మామిడి ధర పెరిగే అవకాశం కన్పిస్తుంది. జిల్లాలో అత్యధిక రైతులు మామిడి పంటపై ఆధారపడి జీవిస్తుండటంతో వారి ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని తోతాపురి మామిడి ధర పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి ఇప్పటికే చర్చించడం జరిగింది.




## జై చిరంజీవ ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై 5 స్టార్ ఫ్యామిలీ నూతన చిత్రం

**తిరుపతి, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** జై చిరంజీవ ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై ఫైవ్ స్టార్ కుటుంబ చిత్రం పోస్టర్ ను సినీ నిర్మాత ఎన్ వి ప్రసాద్ ఆవిష్కరించారు. నటీనటులుగా వాసుదేవ్ ,నితిన్ శ్రీకర్, కార్తిక్ , దిలీప్, తిలక్, లక్ష్మణ్, కుసుమ కుమారి నటించారు. నటుడు భానుచందర్ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. దర్శకుడు వాసుదేవ్ ఆధ్వర్యంలో ఈ చిత్రం తిరుపతి పరిసర ప్రాంతాలలో షూటింగ్ నిర్వహించుకున్నందున ఆ తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదాలు తోడై సినిమా మంచి విజయం సాధిస్తుందని నిర్మాత ఎన్ వి ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి మనిరామ్ కడలి ఎడిటింగ్, అనిల్ కుమార్ సంగీతం చాలా ప్లస్ అవుతుందని డాక్టర్ కరుణానిధి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఎన్వి ప్రసాద్, డాక్టర్ కరుణానిధి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఓంకార్, డైరెక్టర్ వాసుదేవ్, కుసుమ కుమారి, నితిన్ శ్రీకర్, కార్తీక్, తిలక్, లక్ష్మణ్, మురళి తమ్మిశెట్టి, వంశీ, నాని, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ అస్త్రా విజువల్ స్టూడియోస్‌లో శరవేగంగా జరుగుతోంది ఇటీవలే కన్యాకుమారి లో పాటల చిత్రీకరణ పూర్తి చేసుకుంది.

## హోంమంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళా కమిషన్ ఆగ్రహం

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** హోంమంత్రి వంగలపూడి అనితను ఉద్దేశించి వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. మహిళా మంత్రిని మేకప్ మంత్రి అని సంబోధిస్తూ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలను మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో విధానాలపై విమర్శలుండాలి గానీ, ఒక మహిళా ప్రజాప్రతినిధి రూపం, దుస్తులు, మేకప్ గురించి మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదని శైలజ స్పష్టం చేశారు. ఇది హోంమంత్రిని మాత్రమే కాకుండా మొత్తం మహిళా సమాజాన్ని కించపరచడమేనని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా మహిళా రిజర్వేషన్లపై చర్చ జరుగుతున్న వేళ, ఇలాంటి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు మహిళలు రాజకీయాల్లోకి రాకుండా నిరుత్సాహపరుస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. నైతిక విలువలు లేనివారు నాయకులు కాలేరని హితవు పలికారు. ఈ వ్యవహారాన్ని మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణిస్తోంది. కేవలం వ్యాఖ్యలు చేయడమే కాకుండా, వాటిని సమర్థించుకునేలా అమర్‌నాథ్ మాట్లాడటంపై కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీకి లేఖ రాయాలని నిర్ణయించింది. అలాగే గుడివాడ అమర్‌నాథ్‌కు సమన్లు జారీ చేయనుంది.

## జూనియర్ కళాశాలలో 329 మంది పార్ట్‌టైమ్ సిబ్బంది సేవలు మరో ఏడాది కొనసాగింపు

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 329 మంది పార్ట్‌టైమ్ సిబ్బందికి 2026-27 విద్యా సంవత్సరానికి కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పార్ట్‌టైమ్ జూనియర్ లెక్చరర్లు, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు, కంప్యూటర్ టెక్నీషియన్లు, ల్యాబ్ అటెండర్లు, కన్సాలిడేటెడ్ పే సిబ్బంది వీరి సేవలు 01 జూన్ 2026 నుండి 30 ఏప్రిల్ 2027 వరకు కొనసాగిస్తామన్నారు.

# కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలు



విజయోత్సవ సంబరాల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**నెల్లూరు(వైద్యం), జూన్ 16 ప్రభాతవార్త:** కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలు అని, రాష్ట్రంలోని 111 దేవాలయాలలో నిత్యాన్నదానం అమలు చేస్తున్నామని, అలాగే 808 కోట్ల రూపాయలతో 684 దేవాలయాల అభివృద్ధి, పునః నిర్మాణం చేస్తున్నామని, మరో 73 కోట్ల 99 లక్షలతో 6,116 దేవాలయాలలో దీప,దూప నైవేద్యం పథకం, 2500 కోట్ల రూపాయలతో దత్తులూరులో డిఫెన్స్ పరిశ్రమ ఏర్పాటు చేశామని, సోమశిల కండలేరు రిజర్వాయర్ ద్వారా జిల్లా రైతాంగానికి తొలి విడతగా ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని, మరో నాలుగు లక్షల ఎకరాలకు త్వరలో సాగునీరు అందిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. మంగళవారం నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకొని విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామానారాయణ రెడ్డి మాట్లాడుతూ గత రెండేళ్లలో ప్రజలకు కల్పించిన నమ్మకం, అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించేలా విజయోత్సవాలని నిర్వహిస్తున్నా మన్నారు. నెల్లూరు జిల్లా సమగ్ర అభివృద్ధికి అందరి సహాయ సహకారాలతో కలిసి ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకం సూపర్ హిట్ అయిందని, 16 వేలమంది ఉపాధ్యాయులకు మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ కల్పన, 6000 కానిస్టేబుల్ ఉద్యోగాలను ప్రత్యక్షంగా నియమించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో దేవాదాయ శాఖ చాలా చిన్నదని,అయినను దానిని ముందు వరుసలో నిలిపే విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద 684 దేవాలయాల అభివృద్ధి పునర్నిర్మాణానికి రూ.808 కోట్లు వెచ్చించడం జరుగుతున్నదని తెలిపారు. ధూప దీప నైవేద్యం కార్యక్రమం కింద 6,116 దేవాలయాలలో 73 కోట్ల 99 లక్షల రూపాయలు వెచ్చించడం జరుగుతున్నదని, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 5000 గుడిలలో భజనలు ఆలయాలు నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని 111 దేవాలయాలలో నిత్యాన్నదానం జరుగుతున్నదని సుమారుగా సంవత్సరానికి మూడు కోట్ల మందికి అన్న ప్రసాదం జరుగుతున్నదని తెలిపారు. జిల్లాలో పరిశ్రమలు రావడం ఆనందదాయకమని నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి ముఖ్యమని అన్నారు. ఎం ఎస్ ఎం ఈ పార్కును రాష్ట్రంలోనే తొలిసారిగా ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజినరీ లీడర్ అని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంచి డిస్నోయిన్ ఉన్న వ్యక్తి అని, నారా లోకేష్ బాబు డిసిప్లిన్, పట్టుదల గల వ్యక్తి అని వారి అడుగుజాడలలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్ళవలసిన అవసరం ఉందన్నారు. నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ విధివిధానాలతో రాష్ట్రం చాలా నష్టపోయిందని ప్రధానమంత్రి మోడీ, సిఎం చంద్రబాబుల కృషితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం జరుగుతున్నదని తెలిపారు. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాల నమ్మకం 12 సంవత్సరాల మోడీ పాలన అమోఘమన్నారు. చంద్రబాబు నాయుడు చెప్పినవన్నీ చేయడం జరిగిందన్నారు. కావలి నియోజకవర్గం శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, ఉదయగిరి నియోజకవర్గం శాసనసభ్యులు కాకర్ల సురేష్, గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, గోపాలపురం శాసనసభ్యులు, జోనల్ ప్రెసిడెంట్ వెంకట రాజు, శాసన మండల సభ్యులు బీద రవిచంద్ర, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమం అనంతరం డిఆర్డిఏ శాఖ ద్వారా పలువురు లబ్ధిదారులకు ట్రాక్టర్లు, ఆటోలను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, శాసనసభ్యులతో కలిసి అందజేశారు.

## హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

### - 2015లో జరిగిన హత్య కేసులో కోర్టు తీర్పు

**మార్కాపురం, జూన్ 16 ప్రభాతవార్త:** కొమరోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2015లో జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధిస్తూ మార్కాపురం 6వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవాని మంగళవారం తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం, టేకులపెంట గ్రామానికి చెందిన కొండమల్ల శివ (25) గ్రామంలో జరుగుతున్న తప్పులను ప్రశ్నిస్తూ ఉండేవాడు. ఇదే గ్రామానికి చెందిన వీర్నేని లింగయ్య తరచూ గ్రామస్తులతో వివాదాలు సృష్టిస్తూ ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నించేవాడు. తనకు ఎదురునిలుస్తున్న శివపై లింగయ్య కక్ష పెంచుకుని, ఇతర నిందితులతో కలిసి 2015 సెప్టెంబర్ 27న శివ ఇంటి వద్ద మారణాయుధాలతో దాడి చేశాడు. ఈ దాడిలో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై శివ తల్లి కొండమల్ల ఆదిలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కొమరోలు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.77/2015 కింద కేసు నమోదు చేశారు. అప్పటి గిద్దలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఎండీ ఫిరోజ్, వి. శ్రీరామ్ దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం విజయలక్ష్మి వాదనలు వినిపించారు. మార్కాపురం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మార్గదర్శకత్వంలో పోలీసు సిబ్బంది సాక్షులను సమయానుసారం కోర్టులో హాజరుపరుస్తూ పటిష్టమైన ట్రయల్ మానిటరింగ్ నిర్వహించారు. సమర్పించిన సాక్ష్యాధారాల ఆధారంగా నిందితులపై నేరం రుజువైనట్లు కోర్టు నిర్ధారించి నలుగురు నిందితులకు జీవిత ఖైదు విధించింది.

## ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌పై విచారణ

**● 4గంటల పాటు ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించిన అధికారులు**

**● త్వరలోనే ఉన్నతాధికారులకు నివేదిక సమర్పణ**

**తిరుపతి(విద్య), జూన్ 16 ప్రభాతవార్త:** తిరుపతిలోని ప్రముఖ విద్యాసంస్థ అయిన ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌పై వచ్చిన వేధింపుల ఆరోపణల వ్యవహారం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. అదే కళాశాలలో పనిచేస్తున్న ఓ మహిళా అధ్యాపకురాలు, ప్రిన్సిపాల్ తనను మానసికంగా, వృత్తిపరంగా వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలంటూ ఆమె ఏకకాలంలో టీటీడీ విజిలెన్స్ విభాగానికి మరియు విజయవాడలోని రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదులు పంపడంతో ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు అత్యంత ప్రాధాన్యతతో స్పందించారు.ఈ ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం తిరుపతిలో హైడ్రామా నడిచింది. విజయవాడ నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన రాష్ట్ర మహిళా కమిషన్‌కు చెందిన ముగ్గురు సభ్యుల ఉన్నత స్థాయి బృందం, టీటీడీ విజిలెన్స్ అధికారులతో కలిసి కళాశాలలో నేరుగా రంగంలోకి దిగింది. ఉదయం నుంచే కళాశాల ప్రాంగణంలో విచారణ ప్రక్రియను ముమ్మరం చేశారు. తొలుత ఫిర్యాదు చేసిన బాధితురాలైన మహిళా అధ్యాపకురాలితో విడిగా సమావేశమై, ఆమె పడుతున్న ఇబ్బందులు, ప్రిన్సిపాల్ అనుచిత ప్రవర్తనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు.అనంతరం ఈ వేధింపుల వ్యవహారంపై నిజానిజాలు తెలుసుకునేందుకు కళాశాలలోని ఇతర మహిళా, పురుష అధ్యాపకులను, ల్యాబ్ మరియు కార్యాలయ సిబ్బందిని విచారణ కమిటీ ఒక్కొక్కరిగా పిలిచి ఆరా తీసింది. ఈ క్రమంలో కళాశాల అంతర్గత వాతావరణంపై భిన్న కోణాల్లో సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కళాశాలలో జరుగుతున్న కొన్ని పరిణామాలపై కొందరు అధ్యాపకులు ,సిబ్బంది తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, వారు విచారణ కమిటీకి, టీటీడీ విజిలెన్స్ అధికారులకు తమకు తెలిసిన వివరాలను లిఖితపూర్వకంగా (లిఖితపూర్వక స్టేట్‌మెంట్లు) అందజేసినట్లు సమాచారం. ఇది ఈ కేసులో కీలక ఆధారంగా మారే అవకాశం ఉంది.కళాశాలలో ప్రాథమిక సమాచారం, ఆధారాలు సేకరించిన అనంతరం, విచారణ బృందం తమ ఫోకస్‌ను ప్రిన్సిపాల్‌పైకి మళ్లించింది. టీటీడీ పరిపాలనా భవనానికి చేరుకున్న మహిళా కమిషన్ బృందం, టీటీడీ విజిలెన్స్ ఉన్నతాధికారులు ప్రిన్సిపాల్‌ను గదిలోకి పిలిపించి విచారించారు.

# ఆగస్టు నాటికి వెలిగొండ పూర్తి చేస్తాం

**● టన్నెల్ లైనింగ్, టిబిఎం తొలగింపు పనులు వేగవంతం ● మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే నారాయణరెడ్డి**



**కొత్తూరు, జూన్ 16 ప్రభాతవార్త:** వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, ఆగస్టు చివరి నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో ప్రభుత్వం వేగంగా పనులు చేపడుతోందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్సన్‌బాబుతో కలిసి వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్లు, ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మరోసారి టన్నెల్‌లలోకి వెళ్లి లైనింగ్ పనులు, టన్నెల్ బోరింగ్ మెషిన్ (టిబిఎం) తొలగింపు పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి మిగిలిన పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.మంత్రి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్లకు సంబంధించిన రిటైనింగ్ వాల్, వింగ్స్, రిటర్న్స్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొల్లంవాగు నుంచి ఒక టీఎంసీ నీరు టన్నెల్‌లలోకి చేరేలా 1.80 లక్షల క్యూబిక్ మీటర్ల మక్ తొలగించాల్సి ఉండగా, ఇప్పటివరకు 58 వేల క్యూబిక్ మీటర్ల మక్ తొలగించినట్లు చెప్పారు. టన్నెల్1లో అడ్డుగా ఉన్న 1.2 లక్షల క్యూబిక్ మీటర్ల మక్‌లో 40 వేల క్యూబిక్ మీటర్లను ఇప్పటికే తొలగించినట్లు వివరించారు.టన్నెల్ 2లో మొత్తం 7 కిలోమీటర్ల లైనింగ్ పనులకు గాను 5.5 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మిగిలిన 1.5 కిలోమీటర్ల పనులను జూలై చివరి నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిలిచిపోయిన టిబిఎం వెలికితీత పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని, యంత్రంలోని ఏడు కంపార్ట్‌మెంట్లలో మూడు ఇప్పటికే బయటకు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. క్లిష్టమైన హెడ్ భాగాన్ని టన్నెల్‌లోనే పూడ్చిపెట్టే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.ఫీడర్ కెనాల్‌లో 5.3 కిలోమీటర్ల రిటైనింగ్ వాల్ పనులను ఐదు నెలల్లో పూర్తి చేశామని, ప్రస్తుతం కొనసాగుతున్న 21 కిలోమీటర్ల లైనింగ్ పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించినట్లు తెలిపారు. మేఘా తుఫాన్ కారణంగా ఫీడర్ కెనాల్‌లో ఏర్పడిన భారీ గండిని సీసీ వాల్ నిర్మాణం ద్వారా పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు.తీగలేరు, ఈస్టర్న్ మెయిన్ కెనాల్ పనులతో పాటు శాశ్వత డైవర్షన్ రోడ్డు నిర్మాణాన్ని జూన్ నెలాఖరులోగా పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సాగు సీజన్ ప్రారంభానికి ముందే నల్లమలసాగర్ రిజర్వాయర్‌ను నీటితో నింపేలా పనులు ముమ్మరంగాకొనసాగుతున్నాయని చెప్పారు.అదేవిధంగా వెలిగొండ నిర్వాసితులకు ఈ నెలలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆర్‌అండ్‌ఆర్ పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. నల్లమలసాగర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వకు అవసరమైన పునరావాస కార్యక్రమాల కోసం అదనపు బడ్జెట్‌లో రూ.905 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎసిబికి పట్టుబడ్డ వెల్దుర్తి ఇఓ

**వెల్దుర్తి, జూన్ 16 ప్రభాతవార్త:** ఇంటి నిర్మాణం అప్రూవల్ కోసం వెల్దుర్తి పట్టణానికి చెందిన సతీష్ అనే వ్యక్తి వద్ద నగదు తీసుకుంటున్న వెల్దుర్తి గ్రామపంచాయతీ ఇఓ లక్ష్మినాథ్ మంగళవారం ఎసిబి అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు ఉన్న వీధిలో ఇతనికి ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలానికి సంబంధించి ఉన్న డి పట్టాతో గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి తను ఇంటి నిర్మాణం చేపడతానని అప్రూవల్ అనుమతులు మంజూరు చేయాలని ఇఓకు విన్నవించుకున్నాడు. అనుమతులు మంజూరు చేయాలంటే రూ.50 వేల ఇవ్వాలని ఇఓ డిమాండ్ చేశారు. దీంతో ఒప్పందం కుదుర్చుకున్న సతీష్ ముందస్తుగా ఇఓకు రూ.40 వేలు ఇచ్చేందుకు సిద్ధమై ఎసిబికి సమాచారం అందించాడు. వెల్దుర్తి పట్టణ సమీపంలోని జాతీయ రహదారి ప్రక్కన హనుమాన్ సర్కిల్ ఎదురుగా ఉన్న ఓ టీ స్టాల్ వద్ద నగదు ఇస్తుండగా అప్పటికే వ్యక్తి నిర్వహిస్తున్న ఎసిబి అధికారులు వల్లపన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## రూ.15లక్షలతో ఉడాయింపు

### పోలీసులకు ఫిర్యాదు... కేసు నమోదు

**ఏర్పేడు, జూన్ 16 ప్రభాతవార్త:** రూ.లక్షకు మూడు లక్షలు అంటూ ఓ సామాన్యునికి ఆశ చూపి రూ.15 లక్షలతో ఉడాయించిన సంఘటన మంగళవారం తిరుపతి జిల్లా ఏర్పేడు మండల కేంద్ర సమీపంలో చోటుచేసుకుంది. ఓ సామాన్యుడు అత్యాసకు పోయి మొదటికి మోసపోయిన ఘటన గురించి పోలీసులకు ఫిర్యాదు అందింది. మంగళవారం శ్రీకాళహస్తి తిరుపతి హైవేలో చోటు చేసుకున్న సంటనపై ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు అందింది. అంజిమేడు గ్రామ సమీపంలోని ఓ ప్రైవేటు డాబా వద్ద తిరుపతి జిల్లా తడ మండలం వెండ్లూరు గ్రామానికి చెందిన కె.రవిచంద్రారెడ్డి అనే వేణు ఆతనికి కొందరు వ్యక్తులు లక్షకు మూడు లక్షలు డబ్బు ఇస్తామని ఆశ చూపారు. దాంతో రవిచంద్రరెడ్డిని ప్రైవేటు డాబా వద్ద సిట్టింగ్ ఏర్పాటు చేసారు. ఒప్పందం మేరకు అతనిని బెదిరించి ఆతని వద్ద ఉన్న రూ.15 లక్షలు తీసుకొని కారులో పలాయనం చిత్తగించినట్లు బాధితుడు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు సిఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కదిరి కూటమిలో కుంపట్లు మొదలయ్యాయా?

**● ఎమ్మెల్యే కందికుంట, బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి మధ్య సైలెంట్ వార్ నడుస్తున్నదా? ● అంతు పట్టని కదిరి రాజకీయం**

**అనంతపురం, జూన్ 16 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ తెలుగుదేశం పార్టీని బలోపేతం చేశారు. ఎన్నికల్లో గెలిచినా ఓడినా పార్టీలోనే వ్యూహాత్మకంగా తనదైన శైలిలో పావులు వెతుకుతుంటాడు. ఇప్పటివరకు రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లయిన నేపథ్యంలో రాబోయే ఆరు నెలల్లో మంత్రివర్గ విస్తరణ జరిగితే తన సీనియార్టీని గుర్తిస్తే మంత్రి కావాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆశతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా కదిరిలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి మధ్య అంతర్గతంగా సైలెంట్ వార్ నడుస్తోందని, ఎందుకు ఏమిటి అన్నది తిరిగి రావటం లేదని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. అయితే బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి పలు విషయాలపై ఎమ్మెల్యే పేరు ప్రస్తావించకుండా కదిరి ప్రాంతంలో అవినీతిపై స్పందిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాత్రం బహిరంగంగా ఎక్కడ మాట్లాడకుండా మోనంగా ఉన్నాడని, కొందరు కదిరి టౌన్ టిడిపి నాయకులు మాత్రం బహిరంగంగా బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి వైసీపీకి ఏజెంట్ గా ఉన్నాడని, కుటుంబ ప్రభుత్వంపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. తాజా సంఘటనతో ఆధారంగా కదిరిలో కూటమిలో కుంపట్లు మొదలయ్యాయని రాజకీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా సోమవారం అనంతపురంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కదిరి బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి డీఎస్పీ విషయంలో వైసీపీ నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండపడ్డారు. అదే సమయంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తనకు ప్రాణహాని ఉందని, కొందరు వ్యక్తులు ఫోన్ చేసి తనతో మాట్లాడిన వ్యవహారంపై కదిరి పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదుపై కదిరి పోలీసులు స్పందించకపోతే జిల్లా ఎస్పీని కలుస్తానని చెప్పడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత మార్చి నుంచి కూటమిలో చిన్నపాటి వివాదాలు పట్టింపుకుపోవడంతో పెరుగుతూ వచ్చాయి. గతంలో కదిరి ఎమ్మెల్యేగా బిజెపి తరపున ఎమ్మెస్ పార్థసారధి ఉండేవారు. టిడిపి, బిజెపి పొత్తులో భాగంగానే అప్పట్లో టిడిపి అండతో ఎమ్మెల్యే అయ్యారు. ఆ సమయంలో ఎమ్మెస్ పార్థసారధి కలిసి కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరిగినప్పుడు విష్ణువర్ధన్ రెడ్డి కూడా తీరే ఎక్కేవారు. అలా కదిరి తీరు లాగినప్పుడల్లా పార్థసారధితో పాటు విష్ణువర్ధన్ రెడ్డి తీరే ఎక్కే వారిని చెబుతుంటారు. అయితే గత మార్చిలో ప్రముఖ కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు జరిగినప్పుడు బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి తేరు ఎక్కకుండా పోలీసులు హౌస్ అరెస్టు చేశారని, దీని వెనుక ఎమ్మెల్యే ఉన్నాడని బిజెపి వర్గీయుల అనుమానం. ఈ విషయంపై అప్పట్లో టిడిపి పెద్దలకు, బిజెపి పెద్దలకు విష్ణువర్ధన్ రెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.. ఆ తర్వాత కాలక్రమమైన కదిరి పట్టణంలో జరుగుతున్న కొన్ని విషయాలపై బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి ప్రత్యక్షంగా పరోక్షంగా పావులు కలిగినట్లు తెలుస్తోంది. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కదిరి మున్సిపల్ కమిషనర్ పైన, కదిరి సబ్ రిజిస్టర్ ఆఫీస్‌పైన రాష్ట్ర మంత్రి నారాయణ, ఇతర ఉన్నతాధికారులకు బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి ఫిర్యాదులు చేసినట్లు తెలియ వచ్చింది. అదేసమయంలో కదిరి లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో టెంకాయల టెండర్ల వ్యవహారంలో అవినీతి జరిగిందని ఫిర్యాదు చేసి టెండర్లు నిలుపుదల వెనుక బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా సోమవారం (15వ తేదీ) పలువురు బిజెపి జిల్లా నేతలతో అనంతపురంలో విలేకరుల సమావేశానికి బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి సన్నద్ధమయ్యారు. ఆ మేరకు వాట్సాప్ గ్రూపుల ద్వారా విలేకరులకు చేరవేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల ఉత్సవాల జరుగుతున్న నేపథ్యంలో కదిరి వివాదం పైన బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి ఏదైనా మాట్లాడతారని అనుకున్నారా ఏమోగానీ రాష్ట్ర మంత్రి ఒకరు విష్ణువర్ధన్ రెడ్డికి ఫోన్ చేసి వివాదాలు మాట్లాడవద్దని చెప్పడంతో, డీఎస్పీ పై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తానని విష్ణువర్ధన్ రెడ్డి సమాధానం ఇచ్చి అమెరికా విలేకరులతో మాట్లాడినట్లు విశ్వసనీయ వర్గాల బోగట్టా. బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి పార్టీ తరపున వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ పార్టీ అప్పగించిన పనులు చేస్తుంటారు. ఇన్నాళ్లు వన్ ప్లస్ వన్ గన్మెన్ల భద్రత ఉంది. తాజా పరిణామాలతో కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఆ గన్మన్ల భద్రతను ఇంకా ఎక్కువగా పెంచినట్లు తెలియ వచ్చింది. విష్ణువర్ధన్ రెడ్డి వ్యవహారంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట ఎక్కడ బహిరంగంగా స్పందించకపోవడం కొసమెరుపుగా చెప్పొచ్చు.

## అల్జీరియాతో అర్జెంటీనా ఢీ

## నేటి ఉదయం 6.30గంటలకు

## భారత్‌లోనూ మెస్సీ మానియా

# వరల్డ్ ఛాంపియన్లకు తొలి పరీక్ష



**కాన్సాస్ సిటీ, జూన్ 16**

సాకర్ ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా తొలి పోరుకు సిద్ధమైంది. గ్రూప్-జేలో ఉన్న అర్జెంటీనా.. అల్జీరియాతో తలపడనుంది. భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం ఆరున్నర గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. స్టార్‌ప్లేయర్ లియోనెల్ మెస్సీ చేసే మ్యాజిక్ కోసం ప్రపంచం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా తన వరల్డ్ కప్ యాత్రను విజయంతో ప్రారంభించాలని చూస్తుండగా.. చరిత్ర సృష్టించే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని అండర్‌డాగ్ అల్జీరియా ఆశిస్తోంది. మెస్సీ మాయాజాలం, మహ్రేజ్ ప్రతిభ మధ్య జరిగే ఈ పోరు ఉత్కంఠ రేపుతోంది.

### హాట్ ఫేవరెట్‌గా మెస్సీ సేన

లియోనెల్ మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. అయితే మెస్సీ ఫిట్‌నెస్ కాస్త ఆందోళన పరుస్తోంది. అతను ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండే అవకాశాలు



ఎక్కువగానే ఉన్నాయి. గోల్ కీపర్ ఎమిలియానో మార్టినెజ్ కూడా అందుబాటులో ఉండడం అర్జెంటీనాకు ఊరటనిచ్చే అంశం. మెస్సీని ఎంతవరకు నిలువరిస్తారన్న అంశంపైనే అల్జీరియా విజయావకాశాలు ఉంటాయి. డ్రాగా ముగించినా గొప్పగానే భావించవచ్చు. అయితే ప్రత్యర్థిని తక్కువ అంచనా వేయకూడదని అర్జెంటీనా కోచ్ లియోనెల్ స్కలోనీ హెచ్చరిస్తున్నాడు. 2022 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో ఎదురైన అనుభవాన్ని గుర్తుచేస్తే... అల్జీరియా నైపుణ్యమైన జట్టని పేర్కొన్నారు. రియాద్ మహ్రేజ్ నాయకత్వంలోని అల్జీరియా మెరుపు దాడులతో ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆటగాళ్లకు కోచ్ స్కలోనీ సూచించాడు.

### భారత్‌లోనూ మెస్సీ మానియా

ఫిఫా ప్రపంచకప్ మానియా ఇప్పుడు భారత్‌లో కూడా టాప్ గేర్‌కు చేరుకుంది. లియోనెల్ మెస్సీ ఆడుతుండడంతో ఈ మ్యాచ్‌పై భారత్‌లో కూడా ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా కేరళ, గోవా, బెంగాల్‌లో ఫిఫా కళ వచ్చేసింది. ఆపై డిఫెండింగ్ చాంపియన్స్ హోదాలో అర్జెంటీనా బరిలోకి దిగుతుండడంతో కేరళలో సాకర్ ఫీవర్ ఊపేస్తోంది. ఇక కేరళలో అయితే మెస్సీతో పాటు రొనాల్డో, నెయ్‌మర్, ఎంబాపె, సాలా, లామినే యమాల్ వంటి ఆటగాళ్లకు కూడా విపరీతమైన ఆదరణ ఉంది. అక్కడి ఇళ్లకు కూడా ప్రజలు తమ కిష్టమైన జట్ల రంగులను పెయింటింగ్ వేసుకున్నారు. ఇక బుధవారం ఒక్కరోజే ముగ్గురు బిగ్‌స్టార్స్ మ్యాచ్‌లు ఆడనుండడంతో ఫిఫాలో అసలు సమరం మొదలుకానుంది.

బుధవారం తెల్లవారుజామున ఫ్రాన్స్, సెనెగల్ మధ్య పోరు జరగనుంది. ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ స్టార్ ప్లేయర్ ఎంబాపె బరిలోకి దిగనున్నాడు. ఆ తర్వాత ఉదయం 6.30 గంటలకు మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా.. అల్జీరియాతో తలపడనుంది. ఇక రాత్రి 10.30 గంటలకు పోర్చుగల్... కాంగో రిపబ్లిక్‌తో తలపడనుంది. ఇలా త్రిమూర్తులు ఒకే రోజు మ్యాచ్ ఆడనుండడంతో ఫుట్‌బాల్ అభిమానుల్లో ఫుల్ జోష్ నెలకొంది.



# హాకీ సెమీస్‌లోకి దూసుకెళ్లిన భారత్

**ఆక్లాండ్, జూన్ 16:** నేషన్స్ కప్ మహిళల హాకీ టోర్నీలో భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఆక్లాండ్‌లోని నార్త్ హార్బర్ నేషనల్ హాకీ సెంటర్‌లో జరిగిన పూల్-ఎ రెండో మ్యాచ్‌లో భారత్ మహిళలు 2-1 గోల్స్‌తో జపాన్‌పై కంగుతినిపించింది. పూల్-ఎలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందిన భారత్.. సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. భారత్ తరపున కెప్టెన్ సలీమా టెటే 33వ నిమిషంలో, ఫార్వర్డ్ లాల్‌రెమ్ సియామి 49వ నిమిషంలో గోల్స్ చేశారు. జపాన్‌కు లభించిన ఏకైక గోల్‌ను 35వ నిమిషంలో హిరామిత్సు అందించింది. వందో అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన మిడ్‌ఫీల్డర్ జ్యోతికి ఇది చిరస్మరణీయ గేమ్‌గా మారింది.

మొదటి అర్ధభాగంలో ఇరుజట్లకు గోల్స్ అవకాశాలు వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయాయి. 33వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను భారత్ గోల్‌గా మలిచింది. నవనీత్ కౌర్ ఇచ్చిన పాస్‌ను నిక్కీ ప్రధాన్ అద్భుతంగా సలీమా వైపు మళ్లించింది. కెప్టెన్ దాన్ని విజయవంతంగా గోల్‌పోస్ట్‌లోకి నెట్టింది. రెండు నిమిషాల తర్వాత హిరామిత్సు పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి జపాన్‌ను 1-1తో సమవుజ్జీగా నిలిపింది. ఇక 49వ నిమిషంలో సుశీల చాను.. సర్కిల్ అంచు నుండి గోల్ వైపు అందించిన అద్భుత పాస్‌ను అందుకున్న లాల్‌రెమ్ సియామి బంతిని నెట్‌లోకి మళ్లించి భారత్‌కు విజయాన్ని అందించింది. 18న జరిగే పూల్-ఎ చివరి లీగ్ మ్యాచ్‌లో ఉరుగ్వేతో భారత్ తలపడనుంది. పూల్-ఎ నుండి రెండో సెమీఫైనల్ స్థానం కోసం జపాన్-అమెరికా తలపడతాయి.

# అరౌజో గోల్‌తో గట్టెక్కిన ఉరుగ్వే

**మియామి:** సాకర్ ప్రపంచకప్‌లో చిన్న జట్లు పెద్ద ఆటతో మేటి జట్లకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. కబొవెర్దెతో మ్యాచ్‌ను గోల్ లెస్‌గా స్పెయిన్ ముగించగా... బెల్జియం, ఈజిప్ట్ మ్యాచ్ 1-1తో డ్రా అయింది. ఇక రెండుసార్లు చాంపియన్స్ ఉరుగ్వే తృటిలో ఓటమి నుంచి తప్పించుకుంది. గ్రూప్ హెచ్‌లో భాగంగా సౌదీ అరేబియాతో జరిగిన మ్యాచ్‌ను ఉరుగ్వే 1-1తో డ్రా ముగించి ఊపిరి పీల్చుకుంది. గత ప్రపంచకప్‌లో అర్జెంటీనాను ఓడించిన సౌదీ.. ఈ మ్యాచ్‌లోనూ సంచలనం సృష్టించే ఊపులో కనిపించింది. 41వ నిమిషంలో అబ్దులేలాహ్ అల్ అమ్రి గోల్ చేసి సౌదీకి ఆధిక్యం అందించాడు. ఈ ఆదిక్యం 80వ నిమిషం వరకు కొనసాగింది. చివరకు మాక్సీ అరౌజో చేసిన గోల్‌తో ఉరుగ్వే గోల్స్ సమం చేసింది. డ్రాతో గటెక్కింది. అయితే ఉరుగ్వేకు పలు అవకాశాలు వచ్చాయి. 5వ నిమిషంలో బాక్స్ అంచు నుంచి మాక్సీ అరౌజో కొట్టిన కిక్‌ను సౌదీ గోల్ కీపర్ మొహమ్మద్ అలోవైస్ సమర్థంగా అడ్డుకున్నాడు. ఆ తర్వాత ఉరుగ్వేకు కార్నర్ లభించినా, గోల్ చేయడంలో విఫలమైంది. 18వ నిమిషంలోనూ ఉరుగ్వే కొట్టిన షాట్ గోల్‌పోస్టు తగులుకుంటూ వెళ్లింది.

### ఈజిప్ట్‌ను ముంచిన సెల్ఫ్ గోల్: 1-1 గోల్స్‌తో బెల్జియం మ్యాచ్ డ్రా

సియాటెల్‌లో జరిగిన మరో గ్రూప్-జి పోరులో బెల్జియం, ఈజిప్ట్ 1-1తో డ్రా అయ్యాయి. సలాహ్ పాస్‌ను అందుకున్న ఎమామ్ అషూర్ 19వ నిమిషంలో గోల్ చేసి ఈజిప్ట్‌కు ఆధిక్యం అందించాడు. మ్యాచ్ అంతా బెల్జియం ఆధిపత్యం ప్రదర్శించినా గోల్స్‌గా మలచలేకపోయింది. 65వ నిమిషంలో రొమెలు లుకా మైదానంలోకి అడుగుపెట్టిన 22 సెకన్లకే ప్రభావం చూపించాడు. థామస్ ఇచ్చిన క్రాస్‌ను అడ్డుకునే క్రమంలో ఈజిప్ట్ ఆటగాడు మహ్మద్ హానీ సెల్ఫ్ గోల్ చేయ డంతో బెల్జియం సమం చేసింది. దీంతో ప్రపంచకప్‌లో తొలి విజయాన్ని అందుకోవాలన్న ఈజిప్ట్ కల మరోసారి నెరవేరలేదు.





# ఇరాన్ గేమ్ భళా: న్యూజిలాండ్‌తో డ్రా

**కాలిఫోర్నియా, జూన్ 16:** ఫిఫా ప్రపంచకప్‌లో మేటి జట్లు ఉన్నా అందరి చూపు ఇరాన్‌పైనే. సాకర్ వరల్డ్ కప్‌లో పాల్గొంటుందా? లేదా? అన్న సందిగ్ధం నుంచి అమెరికాకు వచ్చిన ఇరాన్ అదిరే ఎంట్రీ ఇచ్చింది. గ్రూప్-జిలో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌ను 2-2తో డ్రా చేసి ఆశ్చర్యపరిచింది. ఆరంభంలో న్యూజిలాండ్ ఆధిక్యం కనబరిచింది. ఆట ప్రారంభమైన ఏడో నిమిషంలోనే గోల్ చేసి ఆధిక్యంలో నిలిచింది. క్రిస్ వుడ్ అందించిన పాస్‌ను ఎలిజా జస్ట్ గోల్‌గా మలిచాడు. అటు తర్వాత అటాక్‌కు దిగిన ఇరాన్ చివరకు 31వ నిమిషంలో గోల్ చేసింది. రామిన్ రెజాయియన్ గోల్ సాధించి ఇరాన్‌ను సమవుజ్జీగా నిలిపాడు. రెండో అర్ధ భాగం 54వ నిమిషంలో ఎలిజా జస్ట్ మరోసారి గోల్ చేయడంతో న్యూజిలాండ్ 2-1తో ఆధిక్యం పొందింది. పది నిమిషాలకే ఇరాన్ మరో గోల్ చేసింది. 64వ నిమిషంలో రెజాయియన్ అందించిన క్రాస్‌ను ఈసారి మహమ్మద్ మొహెబ్బి గాల్లోకి ఎగిరి హెడర్‌తో గోల్‌గా మలచడంతో మ్యాచ్ 2-2తో సమంగా ముగిసింది.

### అమెరికా విడిచి వెళ్లాలన్నారు: ఇరాన్ కోచ్

ఈ మ్యాచ్ ముగిసిన వెంటనే అమెరికా విడిచి వెళ్లిపోవాలంటూ తమకు ఆదేశాలు వచ్చాయని ఇరాన్ కోచ్ అమీర్ ఘలేనోయి అన్నారు. ఈ టోర్నీలో తాము అణచివేతకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మ్యాచ్ ఆడిన తర్వాత విశ్రాంతి తీసుకునేందుకు ఇరాన్ జట్టు రాత్రి కాలిఫోర్నియాలో ఉండాలనుకుంది. కానీ, మెక్సికోకు వెళ్లాలని ఆదేశాలు వచ్చాయన్నారు. లాస్‌ఏంజిల్స్‌లోనే ఇరాన్ తదుపరి మ్యాచ్ 22న బెల్జియంతో ఆడాల్సి ఉంది. అయితే అమెరికాలోనే మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నా... మెక్సికోలోని టిజువానాలో ఇరాన్ జట్టుకు బస ఏర్పాటు చేశారు. మ్యాచ్ జరిగే రోజు అక్కడి ఉంచి మ్యాచ్ ఆడే వేదికకు ఇరాన్ జట్టును విమానంలో తరలిస్తారు. అమెరికా వీసాలు నిరాకరించడంతో కోచింగ్ సహాయక సిబ్బంది జట్టుతో లేకపోవడాన్ని ఇరాన్ కెప్టెన్ మెహ్దీ తరేమీ, కోచ్ అమీర్ ఘలేనోయి తీవ్రంగా తప్పుబట్టారు. ఈ పరిస్థితి జట్టు సన్నద్ధతను మరింత క్లిష్టతరం చేసిందన్నారు.

# పెట్టుబడుల ఉపసంహరణతో భారీ ఆదాయం

# తొలి త్రైమాసికంలో 15వేల కోట్లకు పైగా వసూళ్లు




**న్యూఢిల్లీ, జూన్ 16:** కేంద్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పెట్టుబడుల ఉపసంహరణ (డిస్‌ఇన్వెస్ట్‌మెంట్) ద్వారా రూ.15వేల కోట్లకు పైగా ఆదాయం సమీకరించనున్నది. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) లావాదేవీల ద్వారా ఈ ఆదాయం పెరిగి, ప్రభుత్వ పన్నేతర రాబడులకు ఊతం ఇస్తోంది. కోల్ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్‌ఎల్‌సీ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థల్లో వాటాల విక్రయాల ద్వారా ఈ వృద్ధి నమోదైంది. ప్రస్తుత త్రైమాసికంలోనే కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.14,000 కోట్లను సమీకరించింది. ఇంకా లెక్కల్లో చేరాల్సిన ఆదాయంతో ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉంది. ఆర్థిక వ్యయ భారం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక వ్యవస్థకు నాన్‌ట్యాక్స్ క్యాపిటల్ రిసీట్స్ కీలక ఆధారంగా మారుతున్నాయి.

పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల మోనిటైజేషన్ ద్వారా అధిక ఆదాయం సమకూరితే ఆర్థిక లోటు నియంత్రణకు తోడ్పడటంతో పాటు 2027 ఆర్థికసంవత్సరంలో లక్ష్యాలను చేరుకోవడంలో ప్రభుత్వానికి సహాయ పడుతుందని అంచనా. ముఖ్యంగా ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులపై సబ్సిడీ వ్యయం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ ఆదాయం ప్రాధాన్యం సంతరించుకుంది. 2027 ఆర్థికసంవత్సరంలో లో కేంద్ర ప్రభుత్వం రూ.80వేల కోట్ల విలువైన ఆస్తుల మోనిటైజేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో ఐడిబిఐ బ్యాంక్ వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో మైనారిటీ వాటాల విక్రయాలు కూడా ఉన్నాయి. భవిష్యత్తులో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మరింత వాటా విక్రయించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

అధికారిక గణాంకాల ప్రకారం ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నాన్‌ట్యాక్స్ క్యాపిటల్ రిసీట్స్ రూపంలో మొత్తం రూ.21,732.23 కోట్లను సమీకరించింది. ఇందులో పెట్టుబడులు విత్‌డ్రా ద్వారా రూ.13,389.42 కోట్లు, ఆస్తుల మోనిటైజేషన్ ద్వారా రూ.6,367 కోట్లు, డివిడెండ్ ఆదాయం ద్వారా రూ.1,976 కోట్లు లభించాయి.





# కాసులు కురిపిస్తున్న గోల్డ్ బాండ్స్

**ముంబయి, జూన్ 16:** సావరీన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ) 202021 సిరీస్‌లో పెట్టుబడి పెట్టిన ఇన్వెస్టర్లకు కనకవర్షం కురుస్తోంది. ఐదేళ్ల కాలపరిమితి పూర్తి కావడంతో, ఈ బాండ్లను గడువుకు ముందే అమ్ముకునేందుకు ఆర్‌బీఐ అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించిన విమోచన ధరను కూడా ప్రకటించడంతో ఇన్వెస్టర్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. రూ. 4,627 పెట్టుబడిపై రూ. 14,774 రాబడి ఎస్‌జీబీ 202021 సిరీస్ బాండ్లను 2020 జూన్ 16న జారీ చేశారు. ఆ సమయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి గ్రాముకు రూ. 4,627 ధరకు, ఇతర మార్గాల ద్వారా కొన్నవారికి రూ. 4,677 ధరకు బాండ్లను కేటాయించారు. ఇప్పుడు ఐదేళ్ల తర్వాత, ఆర్బీఐ ఈ బాండ్ల ముందస్తు విమోచన ధరను యూనిట్‌కు (ఒక గ్రాముకు) రూ. 14,774గా నిర్ణయించింది.

అప్పట్లో ఆన్‌లైన్‌లో గ్రాముకు రూ. 4,627 పెట్టి కొన్నవారికి ఇప్పుడు గ్రాముపై రూ. 10,147 లాభం వస్తుంది. దీనిని శాతాల్లో లెక్కిస్తే, రాబడి 219.30 శాతంగా ఉంటుంది. ఎవరైనా ఆ సమయంలో రూ. 1 లక్ష పెట్టుబడి పెట్టి ఉంటే, వారికి ఇప్పుడు వడ్డీ ఆదాయం కాకుండానే సుమారు రూ. 3.19 లక్షలు చేతికి వస్తాయి. ఈ ఐదేళ్ల పాటు ఏటా 2.5 శాతం చొప్పున వడ్డీ కూడా ఇన్వెస్టర్ల ఖాతాలో జమ అయింది. ఎస్‌జీబీ నిబంధనల ప్రకారం బాండ్ల జారీ తేదీ నుంచి 8 ఏళ్ల మెచ్యూరిటీ పీరియడ్ ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో నిధులు అవసరమైన వారి కోసం, ఐదేళ్ల తర్వాత గడువుకు ముందే అమ్ముకునే వెసులుబాటును ఆర్బీఐ కల్పిస్తుంది. ఈ బాండ్లను 2020 జూన్ 16న జారీ చేయడంతో, 2026 జూన్ 16 నాటికి ఐదేళ్ల లాక్ ఇన్ పీరియడ్ పూర్తయింది.

దీంతో ముందస్తు ఉపసంహరణకు మార్గం సుగమమైంది. ఆర్బీఐ ఈ విమోచన ధరను యాదృచ్ఛికంగా నిర్ణయించదు. ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) ప్రచురించే ధరల ఆధారంగా, విమోచన తేదీకి ముందున్న మూడు పనిదినాల్లోని 999 స్వచ్ఛత కలిగిన బంగారం ముగింపు ధరల సగటును లెక్కించి ఈ ధరను ఖరారు చేస్తుంది. 219 శాతం లాభాలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నప్పటికీ, బాండ్లను అమ్ముకోవాలా లేక మెచ్యూరిటీ వరకు ఉంచుకోవాలా అనేది ఇన్వెస్టర్ల వ్యక్తిగత ఆర్థిక లక్ష్యాలపై ఆధారపడి ఉంది.

# వార్ ఒప్పందంతో ఈక్విటీల ర్యాలీ



**ముంబై, జూన్ 16:** అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరలు తగ్గడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మళ్లీ కొనుగోళ్లకు దిగడం వంటి అంశాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిశాయి. అమెరికా-ఇరాన్ మధ్య హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఒప్పందం కుదిరిందన్న వార్తలు ఇంధన సరఫరాపై ఉన్న ఆందోళనలను తగ్గించడంతో బ్రెంట్‌క్రూడ్ ధర బ్యారెల్‌కు 83 డాలర్ల కంటే దిగువకు చేరింది. ఐటీ షేర్లలో బలమైన కొనుగోళ్లు సూచీలకు మద్దతుగా నిలిచాయి. మెటల్స్, హెల్త్‌కేర్, ఫార్మా రంగాల షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 544.15 పాయింట్లు పెరిగి 76,808.48 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 135.25 పాయింట్లు శాతం లాభపడి 23,989.15 వద్ద స్థిరపడింది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 4.03 శాతం, నిఫ్టీ 3.57 శాతం మేర ర్యాలీ తీశాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.33 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.48 శాతం పెరిగాయి. బీఎస్‌ఈలో 2,293 షేర్లు లాభపడగా, 1,967 షేర్లు నష్టపోయాయి. 169షేర్లు మార్పులేకుండా ముగిశాయి. రూపాయి కూడా డాలర్‌తో పోలిస్తే బలపడగా, 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ స్వల్పంగా తగ్గింది. బంగారం ఫ్యూచర్స్ ధరలు స్వల్ప లాభాల్లో ట్రేడ్ అయ్యాయి. రిటైల్ అమ్మకాలు తగ్గగా, పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి అంచనాలను మించి నమోదైంది. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ షేరు 3.68 శాతం ఎగిసింది. బెంగళూరుకు చెందిన ఏఐ స్టార్టప్ సర్వమ్ ఏఐలో రూ.1,427 కోట్ల వ్యూహాత్మక పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ ప్రకటించింది.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

సుజ్లాన్ ఎనర్జీ షేరు 4.25 శాతం లాభపడింది. దేశంలో విండ్ ఎనర్జీ సామర్థ్యాన్ని భారీగా పెంచే అవకాశాలు ఉన్నాయని కేంద్ర మంత్రి పేర్కొనడం ఇందుకు కారణమైంది. 1500 మెగావాట్ల విండ్ టర్బైన్‌ల సరఫరా కోసం ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించడంతో షేరు లాభపడింది. ఇతర ప్రధాన షేర్లుఆదాని పోర్టులు ప్రత్యేక ఆర్థిక జోన్ 0.90 పెరిగింది. గోదావరి బయో రిఫైనరీస్ 5.56జంప్ చేసింది. క్యాన్సర్ చికిత్సకు ఉపయోగపడే ఆవిష్కరణకు జపాన్ పేటెంట్ లభించింది. బంధన్ బ్యాంకు 2.78 లాభపడింది. రూ.303.74 కోట్ల ఎన్‌పీఏలను విక్రయించేందుకు బోర్డు ఆమోదంతెలిపింది. మిని డైమండ్స్ ఇండియాషేరు9.77 పెరిగింది. 16.25 కోట్ల వజ్రాల సరఫరా ఆర్డర్ వచ్చిందన్న ప్రకటన షేర్లనుపెంచింది. ధనలక్ష్మిబ్యాంకు 1.77 నష్టపోయింది. మొత్తంగా, అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలంగా మారడం, ఎఫ్ఐఐలు మళ్లీ కొనుగోళ్లకు రావడం, రూపాయి బలపడడం వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేశాయి. దీంతో సూచీలు వరుసగా మూడో రోజు కూడా లాభాల్లో ముగిశాయి.



# కిమ్స్ క్యూఐపి ఇష్యూ ఓపెన్

**ముంబయి, జూన్ 16:** కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(కిమ్స్) మంగళవారం తన క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ క్యూఐపి ఇష్యూను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఒక్కో ఈక్విటీ షేర్‌కు ఫ్లోర్ ప్రైస్‌ను రూ.771.73గా నిర్ణయించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన వివరాల్లో తెలిపింది. కంపెనీ ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ 16న ఇష్యూ ప్రారంభానికి ఆమోదం తెలిపి, నిధుల సమీకరణకు సంబంధించిన ప్రాథమిక ప్లేస్‌మెంట్ డాక్యుమెంట్స్‌ను ఆమోదించింది. అలాగే సంస్థాగత పెట్టుబడిదారులకు ఫ్లోర్ ప్రైస్‌పై గరిష్ఠంగా 5 శాతం వరకు డిస్కౌంట్ ఇవ్వడానికి కూడా కంపెనీకి అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి 2026 ఏప్రిల్ 15న పోస్టల్ బ్యాలెట్ ద్వారా వాటాదారుల ప్రత్యేక తీర్మానం ఆమోదం పొందింది. ఈ నేపథ్యంలో గరిష్ఠ డిస్కౌంట్‌ను అమలు చేస్తే ఒక్కో షేర్ ధర రూ.733.14 వరకు ఉండే అవకాశం ఉంది. తుది ఇష్యూ ధరను క్యూఐపికు నియమించిన బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లతో సంప్రదించి నిర్ణయిస్తామని కిమ్స్ పేర్కొంది. ఈ ఇష్యూకు సంబంధించి 2026 జూన్ 16ను రిలెవెంట్ డేట్‌గా ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ నిర్ణయించింది. ఈ క్యూఐపికి సంబంధించి కిమ్స్ డైరెక్టర్ల బోర్డు 2026 మార్చి 11న జరిగిన సమావేశంలో ఆమోదం తెలిపింది. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ద్వారా వాటాదారుల అనుమతి కూడా లభించింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ అనేది లిస్టెడ్ కంపెనీలు దీర్ఘకాలిక పబ్లిక్ ఇష్యూ ప్రక్రియ లేకుండానే సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి మూలధనం సమీకరించేందుకు ఉపయోగించే మార్గం. విస్తరణ ప్రణాళికలు, కొనుగోళ్లు, వ్యాపార వృద్ధి లేదా బ్యాలెన్స్ షీట్ బలోపేతం కోసం కంపెనీలు ఈ విధానాన్ని తరచుగా వినియోగిస్తుంటాయి.




# ఇంధన ఎగుమతులపై ఎక్సైజ్ సుంకం పెంపు

**న్యూఢిల్లీ, జూన్ 16:** పెట్రోల్, డీజిల్, విమానఇంధన (ఏటీఎఫ్) ఎగుమతులపై కేంద్రం ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని (విండ్‌ఫాల్ ట్యాక్స్) పెంచింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల హెచ్చుతగ్గుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. దేశీయ ఇంధన నిల్వలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడడంతో పాటు, ఎగుమతుల ద్వారా లభిస్తున్న అదనపు లాభాలపై నియంత్రణ సాధించడమే లక్ష్యంగా ఈ చర్య చేపట్టినట్లు తెలుస్తోంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం డీజిల్ ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.13.50 నుంచి రూ.14కు పెంచారు. విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై సుంకాన్ని 9.50 నుంచి రూ.12.50కు పెంచారు. పెట్రోల్ ఎగుమతులపై ప్రస్తుతం అమల్లో ఉన్న లీటరుకు రూ.1.50 సుంకంలో ఎలాంటి మార్పు చేయలేదు. కొత్త రేట్లు జూన్ 16 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిర్ణయం దేశీయ వినియోగదారులపై తక్షణ ప్రభావం చూపదని కేంద్రం స్పష్టం చేసింది. దేశీయ మార్కెట్‌కు సరఫరా చేసే పెట్రోల్, డీజిల్‌పై ఉన్న ఎక్సైజ్ సుంకాల్లో ఎలాంటి మార్పులు చేయలేదని తెలిపింది. ఇజ్రాయెల్‌ఇరాన్ ఘర్షణల నేపథ్యంలో మార్చి 26న కేంద్రం విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను తిరిగి అమల్లోకి తీసుకొచ్చింది. అప్పటి నుంచి అంతర్జాతీయ ముడిచమురు ధరలు, రిఫైనరీల లాభాల పరిస్థితిని బట్టి ప్రతి రెండు వారాలకు ఒకసారి సుంకాలను సమీక్షిస్తోంది.

# టిసిఎస్‌కు అమెరికా కోర్టులో షాక్

# రూ.1986 కోట్ల పరిహారం




**న్యూయార్క్, జూన్ 16:** భారత ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌టీసీఎస్ కు అమెరికాలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్దాలుగా నడుస్తున్న ట్రేడ్ సీక్రెట్స్ వ్యాపార రహస్యాలు చౌర్యం కేసులో అమెరికా సుప్రీంకోర్టులో ఆ సంస్థకు షాక్ తగిలింది. ఈ కేసులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో టీసీఎస్‌పై దాదాపు 220 మిలియన్ డాలర్ల భారత కరెన్సీలో సుమారు రూ.1,986 కోట్లు ఆర్థిక భారం పడుతుందని అంచనా. ఈ వివాదం మూలాలు అమెరికాలోని లైఫ్ ఇన్సూరెన్స్ సాఫ్ట్‌వేర్ వ్యాపారంలో ఉన్నాయి. డీఎక్స్‌సీ టెక్నాలజీ అనే సంస్థకు చెందిన పూర్వ కంపెనీ అయిన కంప్యూటర్ సైన్సెస్ కార్పొరేషన్ (సీఎస్‌సీ), 1990లలో తమ యాజమాన్యంలోని ఒక ప్రత్యేకమైన లైఫ్ ఇన్సూరెన్స్ సాఫ్ట్‌వేర్‌ను ట్రాన్స్‌అమెరికా అనే బీమా సంస్థకు లైసెన్స్ ఇచ్చింది. కొన్నేళ్ల తర్వాత ట్రాన్స్‌అమెరికాకు చెందిన 2,200 మందికి పైగా ఉద్యోగులను టీసీఎస్ నియమించుకుంది. ఈ ఉద్యోగుల ద్వారా సీఎస్‌సీకి చెందిన రహస్య సాఫ్ట్‌వేర్ సమాచారాన్ని, దాని పనితీరును తెలుసుకుని, దానికి పోటీగా ఒక కొత్త ఇన్సూరెన్స్ ప్లాట్‌ఫామ్‌ను టీసీఎస్ అభివృద్ధి చేసిందని డీఎక్స్‌సీ ఆరోపించింది. ఈ ఆరోపణలతో డీఎక్స్‌సీ, 2019లో డల్లాస్‌లోని ఫెడరల్ కోర్టులో టీసీఎస్‌పై దావా వేసింది. టీసీఎస్ తమ వ్యాపార రహస్యాలను దుర్వినియోగం చేసిందని, గోప్యమైన సమాచారంతో లబ్ధి పొందిందని ఆరోపించింది. టీసీఎస్ మొదటి నుంచి ఈ ఆరోపణలను ఖండిస్తూ వచ్చింది. తాము పొందిన సమాచారం రహస్యమైనది కాదని, చట్టబద్ధంగానే సాఫ్ట్‌వేర్‌ను యాక్సెస్ చేశామని వాదించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14